ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్ | fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 202 పేజీలు: 10+4 వెల: 6.50

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదా
ఇపిఎఫ్ 'డెత్ రిలీఫ్ ఫండ్' రూ. 15 లక్షలకు పెంపు 5



గురువారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి. చిత్రంలో సోనియా, ఖర్గే, పవార్, రాహుల్ తదితరులు

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్

### ఉపరాష్ట్రపతి పదవికి విపక్షాల అభ్యర్థి

**ఆయనకు మద్దతుగా 160 మంది ఎంపీల సంతకాలు**

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఊహించని ఫలితాలుంటాయ్ - ఎంపి మల్లురవి 3

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, శరద్‌పవార్ సహా విపక్ష పార్టీల >>2

## నివేదికపై చర్యలు ఏ దశలో?



### జస్టిస్ ఘోష్ రిపోర్టుపై విచారణలో ప్రశ్నించిన హైకోర్టు

**60 పేజీల నివేదికను ఎందుకు బయట పెట్టారు?**

**అసెంబ్లీలో చర్చించాకే పబ్లిక్ డొమైన్‌లో పెడతామన్న ఎజి**

**కెసిఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాడి, వేడిగా వాదనలు**

**విచారణ నేటికి వాయిదా**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు21:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. 2 పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్(ధర్మాసనం) విచారించింది. ఐదు అంశాలను ప్రేయర్‌గా పిటిషనర్లు పేర్కొన్నారు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక రద్దు చేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. కాళేశ్వరం కమిషన్‌ను నియమిస్తూ గతఏడాది జారీ చేసిన జీఓను కొట్టేయాలని కేసీఆర్, హరీష్ కోరారు. తమకు కమిషన్ నివేదికను ఇవ్వలేదని కేసీఆర్, హరీష్‌రావు పేర్కొన్నారు. కమిషన్ విచారణ సమయంలో యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని పిటిషన్‌లో సుందరం తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పిటిషన్‌లో సుందరం వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్‌ని అప్రదిష్టపాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరుపు న్యాయవాది తెలిపారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ గోష్ కమిషన్ నియామకం జరిగిందని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని వివరించారు. దురదృష్టవశాత్తూ వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్ ఒక పిల్లర్ కుంగిందని, వర్షాకాలం లో అకాల వర్షాలు కారణంగా కూలిందని తెలిపారు. కుంగిపోవడానికి డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరుపు న్యాయవాది స్పష్టం చేశారు. నివేదిక కాపీలను తమకు అందజేయకుండా మీడియాకు అందజేయడంలో దురుద్దేశం ఉందని చెప్పుకొచ్చారు. సాధారణ ప్రజల్లో తమ పరువును అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని >>2



## నీటిపారుదల సలహాదారుగా హార్పాల్ సింగ్

**హైదరాబాద్,ఆగస్టు 21,ప్రభాతవార్త:** తెలంగాణ ఆయకట్టు ప్రాంతం అభివృద్ధి నీటిపారుదలశా సలహాదారుగా రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ హార్పాల్ సింగ్ ను నియమిస్తూ గురువారం సిఎస్ రామకృష్ణ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు హార్పాల్ సింగ్ ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న నీటిపారుదల సొరంగ ప్రాజెక్టులలో సమస్యలను పరిష్కరించడం, పనులను వేగవంతం చేయడంతో పాటు ఆయన నైపుణ్యాన్ని, సేవలను నీటి పారుదల, సిఎడి విభాగంలో వినియోగించుకోనున్నారు. జనరల్ హార్పాల్ సింగ్ భారత సైన్యంలో 40 ఏళ్లకు పైగా పనిచేశారు. భారతరక్షణ దళాల వ్యూహాత్మక మౌలిక సదుపాయాలలో ఆయన నిష్ణాతుడు. పెద్ద >>2

## ఆ బిల్లుపై అంత ఉలుకా!

### నేతలు, పార్టీలకు నైతిక విలువలు అవసరం

**దోచుకుంటున్న వారికే దానితో బాధ..**

**సాంకేతిక సమస్యల వల్లే యూరియాలో జాప్యం**

**ఢిల్లీలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆరోపణలతో జైలుకు వెళ్తే పదవి నుంచి వైదొలగాలన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ 6 నెలలుగా పైగా జైలులో ఉన్నప్పుడు అక్కడే అధికారులతో రివ్యూ మీటింగ్లు పెట్టారని విమర్శించారు. జైలు నుంచే పాలన చేసి. ప్రభుత్వ యంత్రాంగాన్ని భ్రష్టు పట్టించారన్నారు. తమిళనాడులో మంత్రి సెంథిల్‌బాలాజీ జైలుకెళ్లినా రాజీనామా చేయలేదన్నారు. ప్రభుత్వాలను కాపాడే నేతలు, పార్టీలకు నైతిక విలువలు అవసరమన్నారు. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొందరు నాయకులు బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, దీంతో కేంద్ర ప్రభుత్వం నైతిక విలువలను కాపాడేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తోంది. ఇందు కోసం లోక్సభలో బిల్లు పెట్టామని. దీన్ని ఏకపక్షంగా తీసుకురావాలని అనుకోవడం లేదన్నారు. జేపీసీ ద్వారా దేశంలోని ప్రజలు, మేధావులు, విద్యావంతులు, రాజ్యాంగ నిపుణులు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నాం. లోక్సభలో పెట్టిన బిల్లు వల్ల దోచుకున్న వారికి కొంత బాధ కలుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు బాధ కలుగుతుందో అర్థం కావడం లేదన్నారు. భవిష్యత్తులో జరిగే 3 రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓటమి చెందుతుందన్నారు. సాంకేతిక సమస్యతోనే యూరియా కొరత కిషన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా విషయంలో సాంకేతిక సమస్యలు వచ్చాయని అన్నారు. యూరియాపై తెలంగాణకు రూ.76 వేల కోట్ల సబ్సిడీ ఇచ్చామని స్పష్టం చేశారు. ఎరువుల ధరలను కేంద్రం పెంచలేదని క్లారిటీ ఇచ్చారు. యూరియాను సమానంగా పంచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని చెప్పారు. రైతులు సమస్యలు తీర్చాలని యూరియా ఇస్తాంమని, అది కేంద్ర ప్రభుత్వంగా తమ బాధ్యత అని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద స్టాక్ పెట్టాం..అదేమైందో తెలియడం లేదన్నారు. యూరియాను పద్ధతి ప్రకారం వాడుకోవాలని చెప్పారు. దుర్వినియోగం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని సూచించారు. రైతుల విషయంలో కేంద్రం కమిట్‌మెంట్‌తోఉందని.. అందుకే అంతర్జాతీయంగా ఇబ్బందులు ఉన్నా. రైతులకు మేలు చేస్తున్నామన్నారు. తెలంగాణ మంత్రులు రోజూ యూరియా లేదని మాట్లాడటం కారణంగా.. దొరికిన చోట కొందరు దీన్ని స్టోర్ చేసుకోవడం కారణంగా సమస్య ఉత్పన్నమైందని చెప్పారు.

11 ఏళ్లలో ఏనాడూ యూరియా కొరత ఏర్పడలేదన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు 20 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం ఉందని అడిగారని, ఇప్పటివరకు 20 లక్షల మెట్రిక్ టన్నుల సప్లయ్ జరిగిందని, మరో 2 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వర్షాలు బాగా కురియడంతో రైతులు పంటలు వేశారన్న ఆయన వారికి సహకరించాల్సిన బాధ్యత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నారు.



గురువారం భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

## ద్వీపకల్పంలా భద్రగిరి

**ఉప్పొంగుతున్న గోదావరి**

**వరద ముంపులో జాతీయ రహదారులు**

**మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉధృతి**

**విస్తృతంగా పర్యటిస్తున్న అధికార యంత్రాంగం**

**ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి**



**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఉపనదులు ఉప్పొంగడంతో అనూహ్యంగా వరద నీరు పెరిగి జాతీయ రహదారిపైకి చేరి ద్వీపకల్పంగా మారింది. దీంతో భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాలకు సత్సంబంధాలు తెగి పోయాయి. భద్రాచలం నుండి చర్ల, వెంకటాపురం మార్గం, ఆంధ్రా ప్రాంతంలోని కూనవరం ప్రాంతం, ఇటు బూర్గంపాడు మార్గంలో జాతీయ రహదారులపైకి వరదనీరు చేరడంతో ప్రజా రవాణా ఎక్కడికక్కడ స్పందించిపోయింది. ప్రభుత్వ అధికారులు ముంపునకు గురైన జాతీయ రహదారుల వద్దకు చేరుకుని ప్రజలెవ్వరూ అటుగా ప్రయాణించకుండా భారికేడ్లు అడ్డుగాపెట్టి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు మీదకు వరద నీరు చేరింది. దీంతో మారాయిగూడెం, చెరుపల్లి, ఎటపాక మీదుగా రాకపోకలు సాగుతున్నాయి. అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలోని నెల్లిపాక రోడ్డుపైక వరద నీరుగా కూనవరం, వీ.ఆర్.పురం, చింతూరు మండలాలకు రాకపోకలు నిలిచాయి. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 10 >>2



## వ్యవసాయ యంత్ర పరికరాలపై జిఎస్‌టి మినహాయించండి


**ప్రధాని మోడీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖలు** 2

## నటుడు విజయ్ బహిరంగ సభలో తొక్కిసలాట

**ఒకరు మృతి, స్పృహ తప్పిన 400 మంది**

**12 మంది పరిస్థితి విషమం**

**రెండు లక్షలకు పైగా అభిమానులు రాక**



**మదురై, ఆగస్టు 21:** తమిళనాడులోని మదురైలో గురువారం నిర్వహించిన తమిళగ వెట్రి కజగం ( టివికె) రెండో మహానాడుకు భారీ ఎత్తున విజయ్ అభిమానులు పోటెత్తారు. దీంతో బహిరంగ సభలో రద్దీ ఏర్పడి.. తోపులాట జరిగింది. ఈ క్రమంలో 400మంది అభిమానులు, కార్యకర్తలు స్పృహ తప్పి పడిపోయారు. వీరిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. అస్వస్థతకు గురైనవారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. అంతకు ముందు విజయ్ జెండా ఎగురవేసేలా 100 >>2

## సాగునీటి భూములూ 'అక్రమా'ర్పణం!



### ప్రాజెక్టుల పరీవాహక ప్రాంతాల్లో యధేచ్ఛగా దురాక్రమణలు

**అన్యాక్రాంతంతో పెరుగుతున్న పూడిక సమస్య**

**ఎల్ఎండి కట్ట ఆనుకొని మొలిచిన భవనాలు**

**ఎస్సారెస్పీ కెనాల్‌లో ఉపాధిహామీ పనులను అడ్డకొంటున్న ఆక్రమణదారులు**

**హైదరాబాద్,ఆగస్టు 21,ప్రభాతవార్త:** తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల పరివాహక భూములను నీటిపారుదలశాఖ అధికారులు కళ్ళకు గంతలు కట్టి అక్రమార్కులు యథేచ్ఛగా దురాక్రమణకు పాల్పడుతున్నారు. దురాక్రమణ చేసిన భూములతో కొంత మంది క్రయవిక్రయాలు కొనసాగిస్తూ సొమ్మచేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడే కబ్జాలకు పాల్పడుతున్నారు. కొందరు హద్దురాళ్లు తొలగించి సాగు చేయటం, భవన నిర్మాణాలు చేపట్టడం తదితర ఆక్రమాలకు పాల్పడుతున్నారు. పంటపొలాలకు నీరు తీసుకొచ్చ కాలువలలో ఉపాధిహామి కూలీలు పూడిక తీయకుండా ఆక్రమణదారులు అడ్డుకొనేంతగా బలపడినారు. సాగునీటి ప్రాజెక్టులు జలాశయాల భూముల అన్యాక్రాంతంపై కలెక్టర్లకు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. కృష్ణా,గోదావరి బేసిన్‌లో భారీ, మధ్య తరహా, చిన్నతరహా ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 8071 హెక్టార్లు అన్యాక్రాంతమై ఉంటుందని ఒక అంచనా. నాగార్జున సాగర్‌కు సంబంధించి ఉమ్మడి నల్లగొండజిల్లాలోనే 3946 ఎకరాలు, మూసి,దిండి తదితర ప్రాజెక్టుకు సంబంధించి 872 ఎకరాలు, నిజామాబాద్‌లో ఎస్సారెస్పీకి సంబంధించి 900 ఎకరాలు ఖమ్మం జిల్లా అర్బన్ మండలంలో ఎన్ఎస్‌పి కాలువ భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలో నీటిపారుదల శాఖ కూడా గుర్తించారు. నగరాలలలో చిన్ననీటి >>2

## నేటి నుంచి మళ్లీ సినిమా షూటింగ్‌లు

### ప్రభుత్వ జోక్యంతో కొలిక్కి వచ్చిన వివాదం

**నిర్మాతలు, కార్మికుల మధ్య చర్చలు సఫలం: దిల్‌రాజు**

**హైదరాబాద్ (ముషీరాబాద్), అగస్టు 21, ప్రభాతవార్త:** 18 రోజుల విరామం తరువాత టాలీవుడ్ సినిమా షూటింగ్‌లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం ఆర్‌టిసి క్రాస్‌రోడ్సు లోని కార్మిక భవనంలో సమ్మె ముగింపు సందర్భంగా నిర్మాతలు, ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ జోక్యంతో టాలీవుడ్ వివాదం కొలిక్కి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు, నిర్మాతలు అర్థం చేసుకుని ముందుకు రావటం అభినందనీయమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి >>2



మాస్కోలో రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్ బృందంతో సమావేశమైన కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బృందం

# ద్వీపకల్పంలా భద్రగిరి

>> గంటలకు 48 అడుగులు దాటి గోదావరి ప్రవాహించగా సబ్ కలెక్టర్ రెండువ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 11 గంటలకు 48.30 అడుగులు, 12 గంటలకు 48.60 అడుగులు, 1 గంటలకు 48.9 అడుగులు, 49.20 అడుగులు, 3 గంటలకు 49.50 అడుగులు, 4 గంటలకు 49.70 అడుగులు, 5 గంటలకు 50 అడుగులు, గురువారం ఉదయం 6 గంటలకు 50.30 అడుగులు, 7 గంటలకు 50.60 అడుగులు, 8 గంటలకు 50.80 అడుగులు, 9 గంటలకు 50.9 అడుగులు, 10 గంటలకు 51.10 అడగులు, 11 గంటలకు 51.20 అడుగులు, 12 గంటలకు 51.40 అడుగులు, మధ్యాహ్నం 1 గంటకు 51.50 అడుగులు, 2 గంటలకు 51.60 అడుగుల, 3 గంటలకు 51.80 అడుగులు, సాయంత్రం 4 గంటలకు 51.90 అడుగులకు చేరి 13,66,298 క్యూసెక్కుల వరద నీరు దిగువకు పయనమవుతుంది. కాగా ఇదే స్థాయిలో రాత్రి వరకు కొనసాగింది.

అదేవిధంగా కూనవరం వద్ద శబరి నది పోటెత్తడంతో గోదావరి ప్రవాహం దిగువకు నెమ్మదిగా పయనమవుతుంది. నేడు గోదావరి నీటిమట్టం తగ్గే అవకాశం ఉందని, మధ్యాహ్నం నుంచి అనూహ్యంగా తగ్గే అవకాశం ఉందని, సాయంత్రం ప్రమాద హెచ్చరికలన్నీ ఉపసంహరించే అవకాశం ఉండనుందని సంబంధిత అధికారులు అంచనాకు వస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజులు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు.

అధికారులను పూర్తి స్థాయిలో అప్రమత్తం చేశారు. పరివాహక ప్రాంత ప్రజలకు తగు సూచనలు చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సైతం రంగంలోకి దింపారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్ళను ఉంచి భక్తులు ఎవ్వరూ కూడా గోదావరి వద్దకు వెళ్ళకుండా అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి స్లూయిస్‌లను సందర్శించారు.

ఇరిగేషన్ శాఖ అధికారులు ఇసుక బస్తాలతో సిద్ధంగా ఉండాలని, ఎక్కడ స్లూయిస్ లీకు అయిన వెంటనే ఇసుక బస్తాలతో లీకును పూడ్చే విధంగా చూడాలని ఆదేశించారు. పలు చోట్ల కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. భద్రాచలం వద్ద గోదావరి పరిస్థితులను జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలను చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ గురువారం విస్తృతంగా పర్యటించి పరివాహక ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

### నటుడు విజయ్ బహిరంగ సభలో
# తొక్కిసలాట

>> అడుగుల పోల్‌ను ఏర్పాటు చేస్తుండగా విరిగి కారుపై పడింది. దీంతో వాహనం పూర్తిగా ధ్వంసమై.. అందులో ఉన్న ఒకరు మృతిచెందారు. ఈ బహిరంగ సభకు భద్రత కోసం మొత్తం 3 వేల మంది పోలీసులు, 2 వేల మంది ప్రైవేటు సెక్యూరిటీ, 500 మంది మహిళా బౌన్సర్లను వినియోగించారు. మదురై వద్ద అరుప్పుకోట్టై తూత్తుకుడి సాలైలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో వేదిక ఏర్పాటుచేశారు. 2 లక్షల మంది కూర్చునేలా గ్యాలరీలు, వాహన పార్కింగ్, తాగునీరు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అలాగే, వేదికపై నుంచి కార్యకర్తల మధ్యకు విజయ్ నడిచివచ్చేలా 300 మీటర్ల పొడవునా ర్యాంపు ఏర్పాట్లు చేశారు. ఈ సభ నుంచి ఎన్నికల శంఖారావం పూరించిన విజయ్.. తాను మదురై తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నట్టు ప్రకటించారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే, రాష్ట్రంలోని డిఎంకె ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విజయ్ విమర్శలు గుప్పించారు. నీట్‌ను ప్రధాని మోదీ రద్దు చేయగలరా? అని ప్రశ్నించారు. '800 మంది తమిళనాడు మత్స్యకారులపై శ్రీలంక నేవీ దాడి చేసింది. మా మత్స్యకారుల భద్రతను నిర్ధారించడానికి, కట్చతీవు (దీవులు) తిరిగి మాకు ఇవ్వండి' అని డిమాండ్ చేశారు.

'దొంగచాటు ఒప్పందాలు చేసుకోడానికి, పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసం చేయడానికి టీవీకే ఓ పార్టీ కాదు... మేము ఎవరికీ భయపడం.. తమిళనాడు ప్రజలు, మహిళలు, యువత మా వెంట ఉన్నారు' అని విజయ్ స్పష్టం చేశారు.

'సింహానికి గుంపులో ఎలా ఉండాలో.. ఒంటరిగా ఎలా ఉండాలో తెలుసు.. వేటాడేందుకు మాత్రమే వస్తుంది.. వినోదం కోసం కాదు.. ప్రాణాలతో ఉన్నవారిని మాత్రమే వేటాడుతుంది..' అని పరోక్షంగా తాము ఎవరితో పొత్తు పెట్టుకోవడం లేదని తేల్చిచెప్పారు.

వచ్చే ఏడాది మార్చి ఏప్రిల్‌లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల జరగనుండగా.. అధికారమే లక్ష్యంగా విజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు విజయ్ పార్టీని ప్రకటించినా.. పోటీకి మాత్రం దూరంగా ఉన్నారు. తన టార్గెట్ 2026 అసెంబ్లీ ఎన్నికలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ప్రశాంత్ కిషోర్ విజయ్ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు.

### రెవెన్యూ శాఖలో
# 217 పోస్టులు మంజూరు
### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు మరో గుడ్ న్యూస్ తెలిపింది.త్వరలోనే ఓ భారీ జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రంగం సిదమైంది.అందుకోసం రెవెన్యూ శాఖలో 217 పోస్టులను మంజూరు చేస్తూ గురువారం సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ల్యాండ్ అడ్మినిసేషన్ విభాగంలో ఈ పోస్టులు ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 15 కొత్త రెవెన్యూ మండలాలో 189 పోస్టులు,అలాగే రెండు డివిజన్ల కోసం మరో 28పోస్టులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది.గద్వాల,నల్గొండ, వికారాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, వనపర్తి,మహబూబ్ నగర్ జిల్లాలో ఈ పోస్టులను భరీ చేసేందుకు అతి త్వరలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రకటనతో నిరుద్యోగులు హారం వ్యకం చేసున్నారు.

కాగా కొత పోస్టులు మంజూరు చేయడం పట అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు సైతం,తమపై గల భారం తగ్గబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.చేస్తున్నారు.

# నీటిపారుదల సలహాదారుగా హార్పాల్ సింగ్

>> ఎత్తున సివిల్ మౌలిక సదుపాయ ప్రాజెక్టులను మార్గదర్శనం చేయడం, అధునాతన సాంకేతికత, పరిష్కారాలను అమలు చేయడంలో హార్పాల్ సింగ్ కు అపార అనుభవం ఉంది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ గా, ఇండియన్ ఆర్మీలో ఇంజనీర్ ఇన్ చీఫ్, వ్యూహాత్మక సొరంగాలు, ఇతర భూగర్భమౌలిక సదుపాయ ఆస్తుల అభివృద్ధిలో హార్పాల్ సింగ్ కీలకపాత్ర పోషించారు. రోహ్‌తాంగ్ పాస్ కింద అటల్ టన్నెల్ పూర్తి, సిక్కింలో థీంగ్ టన్నెల్, అరుణాచల్ ప్రదేశ్లో సెలా, నెచిపు టన్నెల్స్ పురోగతి, దేశ సరిహద్దు పొస్ల వెంట అనేక సొరంగాల ప్రణాళికలో కీలక వ్యవహరించారు. అత్యంత సవాలుతో కూడిన హిమాలయ భౌగోళిక పరిస్థితుల్లో ఆయన సివిల్ ఇంజనీర్ అయినప్పటికీ, అమెరికాలో పీజీ కోర్సులు చేసి మౌలిక సదుపాయ అభివృద్ధిలో నైపుణ్యం సంపాదించారు. ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ కు అధ్యక్షుడిగా, ఇండియన్ ఇన్సిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ వైస్ చైర్మన్ గా, ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ బ్రిడ్జ్ ఇంజనీర్స్ సంస్థకు వైస్ చైర్మన్, కన్స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్మెంట్ కౌన్సిల్ కు వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. నీటిపారుదల శాఖా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడానికి హార్పల్ సింగ్ నియామకం తోడ్పడు తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### నేటి నుంచి మళ్లీ సినిమా
# షూటింగ్‌లు

>> సమస్యను త్వరగా పరిష్కారం చేసినందుకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరఫున ధన్యవాదములు తెలియచేస్తున్నామని అన్నారు. లేబర్ కమీషనర్ గంగాధర్ చర్చలు సఫలం అయ్యేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా చెయ్యాలనే ముఖ్యమంత్రి ఆలోచన దిశగా ఫిల్మ్ ఇండస్ట్రీ ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. కార్మిక శాఖ అదనపు కమీషనర్ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ 30శాతం హైక్ అనేది జరుగుతుందని, పలు డిమాండ్స్ ఉన్నాయని, మూడు, నాలుగు కండిషన్స్ మీద ప్రధానంగా చర్చలు జరిగాయని తెలిపారు. 22.5 శాతం మొత్తంగా వేతనాలు పెంపు ఉంటుందన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీ వేస్తున్నామని, మిగతా చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కమిటీ నెలరోజుల్లో నివేదిక ఇస్తుందని వివరించారు.

## వారం - వర్జ్యం

22-08-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి ఉ.11.59
ఆశ్లేష రా.12.19
వర్జ్యం : మ.12.38-2.16
దు.ఉ.8.25-9.15, 2) మ.12.37-1.27
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ప్రతి చిన్న విషయానికి జీవితభాగస్వామితో సలహాలు సంప్రదింపులు సాగిస్తారు.

**వృషభం:** ముఖ్య వ్యవహారాలలో సహోద్యోగులు, స్నేహితులు అండదండగా నిలుస్తారు.

**మిథునం:** అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం ప్రతిపనిలోనూ కనబడుతుంది.

**కర్కాటకం :** మాట తీరు వలన నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించండి.

**సింహం:** ముఖ్యమైన దరఖాస్తు ఫారాలకు జయచేయవలసిన పత్రాలను పరిశీలించుకోవడం చెప్పదగిన సూచన.

**కన్య :** ఆర్థికపరమైన లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. ఋణాలు తీరుస్తారు.

**తుల :** నూతన పెట్టుబడులకు నిదానం అవసరం. వివాదాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** వాహనాలు నడిపేటప్పుడు మెలుకువలు పాటించండి. సోదరుల కలయిక.

**ధనుస్సు:** ప్రజాసంబంధాలు వృద్ధి చేసుకోవడానికి విశేషంగా కృషిచేస్తారు.

**మకరం:** కుటుంబ వ్యవహారాలలో ఇతరుల జోక్యం అధికం కాకుండా జాగ్రత్తలువహించండి.

**కుంభం:** వృత్తి ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన మార్పులు, చేర్పులు ఉండవు.

**మీనం :** మనస్సును అదుపులో ఉంచుకోండి. కొనుగోలు, అమ్మకాలు అనుకూలంగా ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# నివేదికపై చర్యలు ఏ దశలో?

>> సుందరం తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని న్యాయవాది సుందరం తెలిపారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదని వాదించారు.నివే దికను కూడా కేసీఆర్,హరీష్‌కు అందించలేదని న్యాయవాది సుందరం వెల్లడించారు.పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని సుందరం తెలిపారు.రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని అన్నారు. కాగా, ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. పిటిషనర్లు కేసీఆర్, హరీష్‌రావు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

**అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిపై హై కోర్టు ప్రశ్నల వర్షం**

అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయట పెట్టారని ప్రభుత్వాన్నిహైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి జర్నలిస్టుకు 60 పేజీల నివేదిక అందజేశారని సుందరం తెలిపారు. న్యాయస్థానానికి సమర్పించిన కాపీలు సరిగ్గా కనిపించడం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. నివేదిక కాపీలు సరిగ్గా కనిపించేలా ఇస్తే తర్వాత విచారణ చేస్తామని తెలిపింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఈరోజే(గురువారం) విచారణ కొనసాగించాలని కేసీఆర్ తరుపు న్యాయవాది సుందరం కోరారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా అని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని హైకోర్టు మూడు ప్రశ్నలు వేసింది. నివేదిక కాపీను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారా..? పిటిషనర్లకు 8బీ కింద నోటీసులు ఇచ్చారా లేదా..? కమిషన్ నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి..? అని హైకోర్టు ప్రశ్నించింది. తాము ఇచ్చిన నోటీస్ సెక్షన్ 8బీ కింద అని న్యాయస్థానానికి అడ్వకేట్ జనరల్ తెతెలిపారు.సెక్షన్ మెన్షన్ చేయనంత మాత్రానా అది సెక్షన్ 8బీ కింద నోటీస్ కాదంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సిందేనని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి పట్టుబట్టారు. కిరణ్‌భేడీ కేస్‌కి ఈ కేస్‌కు తేడాలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

**కాళేశ్వరం రిపోర్టును పబ్లిక్ డొమెన్‌లో పెట్టలేదు.. ఏజీ క్లారిటీ**

కాళేశ్వరం రిపోర్టును తాము ఎక్కడ పబ్లిక్ డొమెన్‌లో పెట్టలేదని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీలో చర్చించాకే పబ్లిక్ డొమైన్‌లో పెడతామని స్పష్టం చేశారు. కౌంటర్‌లో మరిన్ని వివరాలు పొందపరుస్తామని వివరించారు. ఈ స్టేజిలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని హైకోర్టును ఏజీ కోరారు. అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించాక తదుపరి విచారణ చేపట్టాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోరారు. సెక్షన్ 8బీ కింద కాకుండా ఏ సెక్షన్ కింద నోటీసులిచ్చారు? అని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కమిషన్ నివేదిక ప్రస్తుతం ఏ దశలో ఉందని ఏజీని హైకోర్టు అడిగింది. ప్రజాధనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కమిషన్‌ను ప్రభుత్వం వేసిందని ఏజీ తెలిపారు. కమిషన్ నివేదికను కేబినెట్ సులభంగా అర్థం చేసుకునేలా 60పేజీల నివేదిక రూపొందించారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

**అసెంబ్లీలో చర్చించి తదుపరి చర్యలు..ఏజీ సుదర్శన్ రెడ్డి**

60పేజీల నివేదిక ఆధారంగా ఘోష్ కమిషన్ నివేదికను కేబినెట్ ఆమోదించిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.అసెంబ్లీలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేలా కేబినెట్ నిర్ణయం తీసు కుందని ఏజీ వివరించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టవద్దని ఏజీ సూచించారు. ఈ పిటీషన్లపై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇవ్వలేదని పిటీషనర్లు తప్పుపట్టడం చెల్లదని ఏజీ పేర్కొన్నారు. ఏజీని మరోసారి హైకోర్టు ప్రశ్నించింది. కాళేశ్వరం కమిషన్ నివేదికను ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు..? అని అడిగింది.

ఈ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో పెడతారా..?అని ప్రశ్నించింది. అసెంబ్లీలో పెట్టాక నివేదికపై చర్యలు తీసుకుంటారా..? అని నిలదీసింది. శుక్రవారం లేదా సోమవారం సమాచారం తెలుసుకుంటానని ఏజీ తెలిపారు. అయితే ఈ విచారణను శుక్రవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

## హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు21:** హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురైంది. జిహెచ్‌ఎంసి పరిధిలో భూకేటాయింపుల్ని రద్దు చేస్తూ 2024లో ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఎంపిలు, ఎంఎల్‌ఎలు, జర్నలిస్టు తదితర సొసైటీల తరపున ముకుల్ రోహతీ, సిద్ధార్థ్ లూథ్రా సహా మొత్తం 8మంది వాదించారు.2008లో కేటాయింపులు జరిపారని, ఇప్పుడు వేరేచోటుకు వెళ్లలేరంటూ వాదించారు. కరుణ, దయతో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగ స్టీన్‌జార్జ్ మసీహ్‌లతో కూడినసుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. రూ.8నుంచి30వేల జీతాలుండే జర్నలిస్టుల్ని రూ.2.5 లక్షలు (జీతాలు, అలవెన్సులు) పొందే ఎంపిలు,ఎంఎల్‌ఎలులు, ఐఎఎస్‌లతో సమానంగా చూడటం సరి కాదని, జర్నలిస్టులది ప్రత్యేక తరగతి అని, ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా పనిచేస్తారని కోర్టుకు విన్నవించారు.

## నైజీరియా మసీదులో కాల్పులు.. 50 మంది మృతి

**అబుజా, ఆగస్టు 21:** నైజీరియాలోని కాట్సినా రాష్ట్రంలో దారుణ ఘటన వెలుగుచూసింది. ములుంఫాషి జిల్లాలోని ఉంగువాన్ మాంటా పట్టణంలో మంగళవారం (స్థానిక కాలమానం ప్రకారం) ఓ మసీదుపై ముష్కరులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 50 మంది మృతి చెందగా, ముష్కరులు 60 మందికిపైగా బందీలుగా చేసి తీసుకెళ్లారు. తెల్లవారుజామున మసీదులో ప్రార్థనలు జరుగుతుండగా దుండగులు మోటార్‌సైకిళ్లపై వచ్చి దాడికి దిగారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అంతేకాదు పలు గ్రామాలపై కూడా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. ఇది ఉగ్రవాదుల పనేనని స్థానిక అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఇప్పటివరకు ఏ సంస్థ ప్రకటించలేదు. కాగా, ములుంఫాషికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే అమీను ఇబ్రహీం ఈ దాడిపై స్పందించారు. ఇది తమ సమాజంపై జరిగిన అత్యంత క్రూరమైన దాడిగా పేర్కొన్నారు. ఇందులో కనీసం 30 మరణించారని, 20 మంది సజీవ దహనమయ్యారని అన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకుని భద్రతా దళాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే అనేక ఇళ్లు కూడా తగలబడిపోయాయయని ఆయన చెప్పారు. దుండగులు స్త్రీలను, బాలికలను ఈడ్చుకెళ్లిన భయానక దృశ్యాలను ప్రాణాలతో బయటపడినవారు వివరించారు.



గురువారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన శుభాంశు శుక్లా

# సాగునీటి భూములూ 'అక్రమా'ర్పణం!

>> వనరులు చెరువులు కుంటలను కబ్జాపెడుతుంటూ గ్రామీణ ప్రాంతాల్లో ఏకంగా భారీ మధ్యతరహా ప్రాజెక్టులకు ఎసరుపెడుతున్నారు. ప్రాజెక్టులశిఖంలో వ్యవసాయం చేస్తుండటంతో అనేక ప్రాజెక్టుల్లో పూడిక సమస్యకూడా పెరిగిపోతున్నది. ఎస్సారెస్పీ,కడెం,శ్రీపాద ఎల్లంపల్లి,లోయర్‌మానేరుడ్యాం, నిజామ్‌సాగర్, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్‌ఎల్‌బిసి, నాగార్జునసాగర్, జూరాల,వంటి అనేక ప్రాజెక్టుల హెడ్‌వర్క్ కెనాల్స్,క్యాంపులను కొంత మంది రైతులపేరుతో కబ్జాపెడుతున్నారు. నిజామాబాద్, బోధన్,బాల్కొండ,ఆర్మూర్, జగిత్యాల, మిర్యాలగూడ, నల్లగొండలో రెవెన్యూ అధికారుల అండదండలలో కొంతమంది పట్టాలు పొందారని ఫిర్యాదులు కూడా వెల్లువెత్తున్నాయి.నిజామ్‌సాగర్ మెయిన్ కెనాల్ అత్యధికభాగం నిజామాబాద్ నగరంలోనే దురాక్రమణకు గురైంది. ప్రాజెక్టుకోసం సేకరణ చేసిన భూములలో ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టాలన్నా ఆక్రమణ దారులనుంచి ప్రతిఘటన తప్పడంలేదు. 2023లో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రామరావుపల్లెలో ఎస్సారెస్పీ భూముల్లో పంచాయతీభవనం, క్రీడా ప్రాంగణం కట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పెద్ద ఎత్తున ఆక్రమణ దారుల నుంచి నిరసన వ్యక్తమైంది. మూడు దశాబ్దాలుగా మేం సాగుచేసుకొనే భూముల్లోకి ఎలా వస్తారని రైతుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. జగిత్యాల జిల్లా కేంద్రం ధరూర్‌లో ఎస్సారెస్పీ భూములపై ఎప్పటికి కబ్జాదారుల కన్ను ఉంటుంది. తరుచూ అక్కడ నిర్మించే అక్రమనిర్మాణాలను ఎస్సారెస్పీ అధికారులు కూల్చుతూ ఉంటారు. విలువైన భూములు కావడంతో వాటి పరిరక్షణ కష్టంగా మారింది. కరీంనగర్ పట్టణంలో ఏకంగా ఎల్‌ఎండి రిజర్వాయర్ కోసం నీటిపారుదలశాఖ పరిహారం ఇచ్చి భూసేకరణ చేసి భూములను తిరిగి తమ స్వాధీనం లోకి తీసుకొని పెద్దపెద్ద వాణిజ్యసముదాయాలను విద్యాలయాలను నిర్మించారు. అంతేకాదు మానేరు రిజర్వాయర్ కట్టను ఆనుకొని పద్మానగర్ నుంచి సప్తగిరికాలని, భగత్‌నగర్ ఎక్స్‌రోడ్డు వరకు వేములవాడ కరీంనగర్ బైపాస్ రోడ్డులో వందల భవనాలను అక్రమంగా నిర్మిస్తుంటే నీటిపారుదలశాఖ,రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారు. సప్తగిరికాలని,బతుకమ్మకాలనీ,హస్నాపూర్ కాలనీ వాసులు ఇళ్ళను తొలగించాలని నీటిపారుదలశాఖ ఇఇ నోటిసులు జారీచేయడంతో ఆందోళన నెలకొంది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోనే కొంతమంది రైతుల పేరుతో దురాక్రమణలు చేస్తున్నారు.రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు రైతుల పేరిటే పట్టాలు పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎస్సారెస్పీ రిజర్వాయర్ నిర్మాణం కోసం 88,807 ఎకరాలు సేకరించారు. ఎస్సారెస్పీ జలాశయంను 120 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించడానికి వంద గ్రామాల భూములను అప్పట్లో సేకరించారు. సేకరించిన భూముల్లో 86,528 ఎకరాలను ప్రాజెక్టు పేరు మీదకు మార్చారు. మరో 2,279 ఎకరాలు ఇంకా రైతుల పేర్లమీదే ఉన్నాయి. ఆయా రికార్డులను జలాశయం పేరు మీదకు మార్చడానికి అధికారులు క్రమంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎలాంటి కట్టడి లేకపోవడంతో జలాశయ భూముల్ని ఆక్రమించి కొందరు యథేచ్ఛగా సాగుచేస్తున్నారు. దీనివల్ల వరదలకు మట్టి కొట్టుకుపోయి పూడిక పేరుకుంటోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం 80 టీఎంసీలకు పడిపోయింది.నందిపేట, బాల్కొండ, ఆర్మూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాలతో పాటు పరివాహక ప్రాంతాల్లో భూముల ఆక్రమించుకొనిక్రయవిక్రయాలు యదేచ్ఛగా సాగిస్తున్నారు. ఎస్సారెస్పీ చుట్ట వంద కోట్లతో కంచెవేసి దురాక్రమణ కట్టచేయాలని ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రతిపాదనలు చేసినా అమలు కాలేదు. జగిత్యాల, ధరూర్, ఎల్‌ఎండి, పెద్దపల్లి,హుజురాబాద్‌లో ఉన్న ఎస్సారెస్పీ ఆస్తులకు కూడా రక్షణలేకుండా పోయింది. ఎస్సారెస్పీ కెనాల్స్‌ను కూడా రైతులు దున్ని తమ భూములలో కలుపుకొంటున్నారు. కరీంనగర్,పెద్దపలి జిల్లాలో జిల్లాలో ఎస్సారెస్పీ కెనాల్ కబ్జాపెట్టారు.పెద్దపల్లి జిల్లాలో డి83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మందని, కమాన్పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1.25 లక్షల ఎకరాలు. డి86 కింద జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 70 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీరు కాలువల ద్వారా సరఫరా అవుతోంది. అయితే కాలువలకు కుడి, ఎడమ వైపులా ఖాళీ స్థలాల్లో హద్దు రాళ్లు ఉండగా అక్రమార్కులు వాటిని తొలిగిస్తూ కబ్జా చేస్తున్నారు. భూసేకరణకు సంబంధించి సక్రమంగా రికార్డులు లేకపోవడంతో కనీసం కబ్జాలను గుర్తించటం లేదు.సుల్తానాబాద్ మండలం సుద్దాల తదితర ప్రాంతాల్లో కాలువ భూముల్లో భవనాలు నిర్మిస్తున్నారు. రైతులు, గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు.పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు కాలువలో ఉపాధిహామీ పనులు చేపట్టకుండా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. పెద్దకల్వల, నిట్టూరు, తుర్కలవుకుంటలో భూములను చదును చేస్తూ పొలాలుగా మార్చుతున్నారు. భూములకు పక్కాగా హద్దులను నిర్ణయిస్తేనే రక్షణగా ఉంటాయి .భూపాలపల్లి జిల్లా మంజూరునగర్ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన సింగరేణి ఏరియా ఆసుపత్రి ప్రాంతం నుంచి మహబూబ్‌పల్లి సమీపంలోని సోమన్నకుంట వరకు ఉండే వరద కాల్వ కనిపించకుండా మాయం చేశారు.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్

>> నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌సిపి (ఎస్పీ) అధినేత శరద్‌పవార్, ఎస్పీ నేత రామ్‌గోపాల్‌యాదవ్, డిఎంకె తిరుచ్చి శివ, టిఎంసి నేత శతాబ్ది రాయ్, శివసేన (యుబిటి) సంజయ్‌రౌత్, సిపిఎం జాన్ బ్రిటాస్‌లు ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 160 మంది ఎంపిలు ఆయనకు మద్దతుగా సంతకాలు చేసినట్లు సమాచారం. నామినేషన్ పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రశీదును అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై నిబద్ధత, వినయభావంతో నామినేషన్ దాఖలు చేస్తున్నానని అన్నారు. తన జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉందన్న ఆయన.. ప్రతివ్యక్తి గౌవరం పైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉందన్నారు. మరోవైపు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్ ఈ నెల 20న నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతులమీదుగా ఆయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మొత్తం ఎలక్టోరల్ కాలేజీ సంఖ్య 781 కాగా మెజారీ మార్కు 391. అధికార పక్షానికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

## వ్యవసాయ యంత్ర పరికరాలపై జిఎస్‌టి మినహాయించండి
### ప్రధాని మోడీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు21:** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన వ్యవసాయ రంగం మన జనాభాలో అరవై ఐదు శాతం పైగా జనాభాకు జీవనాధారం. దేశ జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలు పంటలు ఉత్పాదకతలో ఆధునిక సాగు పద్ధతులు రైతాంగం అమలు చేయాలంటే వ్యవసాయ యాంత్రీకరణ దిశగా రైతులను ప్రోత్సహించాలి.కానీ వ్యవసాయ యంత్రాలు పరికరాలు పై 12 శాతం జీఎస్‌టీ విధించడం వల్ల రైతాంగానికి ఆర్థిక భారంగా మారింది. సన్నకారు రైతులు వ్యవసాయ పరికరాలు కొనే స్థోమత లేక సాగు యాజమాన్య పద్ధతులు పాటించ లేక దిగుబడులు తక్కువగా ఉండటం సాగు పెట్టుబడులు భారంగా మారాయి.ఆధునిక సాగు యాజమాన్య పద్ధతులు పాటించేలా కూలీల కొరత పెట్టుబడులు భారం లేకుండా సన్నకారు రైతులకు మేలు జరిగేలా 12శాతం జీఎస్‌టీ మినహాయించడం చేయాలని ప్రధాని మోదీకి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం లేఖ రాశారు.తెలంగాణ రైతాంగంకు మాత్రమే కాకుండా యావత్ దేశ వ్యాప్తంగా రైతాంగంకు మేలు చేసేలా 12 శాతం జీఎస్‌టీ మినహాయించడం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. రైతులకు యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలిసేలా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని మంత్రి తుమ్మల జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. యూరియా లభ్యతపై జిల్లా వ్యవసాయ అధికారులతో వ్యవసాయశాక కమిషనరేట్ లో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యూరియా స్టాక్ వివరాలు ఎప్పటి కప్పుడు తెప్పించుకోవాలి అని అన్నారు. జిల్లాలకు వచ్చే యూరియా ముందుగానే తెలియవస్తుంది కాబట్టి ఆ రేక్ నుంచి వివిధ జిలాల్లకు వెంటనే యూరియాను తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్ పోర్టింగ్‌లో సమస్యలు ఉన్నట్టయితే కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. మండలాల వారిగా యూరియా స్టాక్,అవసరాలు తెలుసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.అలాగే ప్రైవేట్ డీలర్ల వద్ద నున్న యూరియా నిలువలను కూడా రైతులకు అమ్మే విధంగా చూడాలని,క్యూలైన్ లేకుండా చూడాలనిసూచించారు. మండలాలలో ప్రతి స్టాక్ పాయింట్ వద్ద యూరియా నిలువలను మానిటర్ చేయాలని,ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు యూరియాను తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు.ఎవరైన ప్రైవేట్ డీలర్లు ఎక్కువ ధరకు అమ్మినట్టయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతిస్టాక్ పాయింట్ ను మండల వ్యవసాయ అధికారులతో,ఏఈఓలతో నిత్యం పర్యవేక్షించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సీజన్ త్వరగా ప్రారంభంకావడం, వర్షాలు ముందుగా రావడం,సాగర్ నీరు త్వరగా విడుదల చేయడంతో జూన్‌లో వేయవలిసిన పత్తి, మొక్కజొన్నలాంటి పంటలు ముందు గానే వేసుకోవడం జరిగిందని, దానికి అనుగుణంగా కేంద్రం యూరియా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. యూరియా అమ్మకాలలో పాస్ బుక్ అనుసంధానం చేసే అవకా శాలను పరిశీలించాలని అధికారులను కోరారు. రైతులు నానో యూరియాను వాడేలా ప్రోత్సహించడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఒడిశాలోని నైనీ బొగ్గు గని సందర్శించిన సింగరేణి అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త: ఒడిశాలోని నైనీ బొగ్గు గని పనితీరును సింగరేణి అధికారులు పరిశీలించారు. ఈ మేరకు ఒడిశాలోని అంగుల్‌జిల్లాలో సింగరేణి సంస్థకు చెందిన నైనీ ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని సింగరేణి అధికారుల బృందం సందర్శించింది. సింగరేణికి చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సుబ్రమణ్యం, ఇతర అధికారులతో కూడిన బృందం ఒడిస్సాలోని నైని గనిలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా,స్టాకుయార్డు, డిస్పాచ్, కాంట్రాక్టులు, లాజిస్టిక్స్ వంటివి పరిశీలించారు. ఈ సందర్భంగా నైనీ కోల్‌బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి పురోగతి, ఆపరేషనల్ కెపాసిటీ, కష్టనష్టాలు, బొగ్గు సప్లై తీరుపై నైనీ ఏరియా జీఎం మజుందార్, ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. రోజూ16 వేల టన్నుల ఉత్పత్తికి టార్గెట్ చేసుకున్నామని తెలిపారు. అనంతరం బొగ్గును రవాణాకు ఏర్పాటు చేసిన అంగుల్ జిల్లాలోని జరపాడ రైల్వే గూడ్స్‌షెడ్, హండప్ప రైల్వే గూడ్స్‌షెడ్లను పరిశీలించారు. జరపాడ రైల్వే గూడ్స్‌షెడ్ నుంచి రైల్వే సముద్రం రైల్వే (ఆర్ఎస్ఆర్) మార్గం ద్వారా పరదీప్, ధర్మా, గోపాలపురం పోర్టుల నుంచి తమిళనాడు జెన్‌కోకు బొగ్గు రవాణాపై సమీక్షించారు.

# లొంగిపోయిన ఇద్దరు సీనియర్ మావోయిస్టులు

### రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత

### ఏరియా కమిటీ సభ్యుడు హారీష్ కోసం చాలా కాలం నుంచి అన్వేషణ

హైదరాబాద్ (మన్సూరాబాద్), ఆగస్టు 21 , ప్రభాతవార్త: ఇద్దరు సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు రాచకొండ సీపీ సుధీర్ బాబు ముందు లొంగిపోయారు. మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు సుధాకర్ భార్య సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు కాకరాల సునీత(62),ఏరియా కమిటీ సభ్యుడు చెన్నూరి హారీష్(35) అలియాస్ రామన్న అలియాస్ శ్రీను లు గురువారం లొంగిపోయారు.ఈ వివరాలను రాచకొండ సిపి సుధీర్ బాబు గురువారం ఎల్బీనగర్ లోని విలేకరుల సమావేశంలో వెల్లడించారు.కాకరాల సునీత అలియాస్ బద్రి తండ్రి ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు సిపి తెలిపారు." వర వరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వీరి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారన్నారు. 1986 జనవరిలో ఆమె సిపిఐ (ఎంఎల్) పీపుల్స్ వార్ వైపు పూర్తిగా ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని చెప్పారు.1986 నుండి 1990 వరకు విజయవాడ పట్టణంలో సిపిఐ (ఎంఎల్) పిడబ్ల్యూ సెంట్రల్ ఆర్గనైజర్ (సిఓ)గా పనిచేసిందని అన్నారు. విజయవాడలో సిఓగా పనిచేస్తున్న సమ యంలో ఆమెకు టిఎల్ఎన్ చలం అలియాస్ గౌతమ్ సుధాకర్ తో పరిచయం ఏర్పడిందని వారి పరిచయం ప్రేమగా మారింది.ఆగస్టు 1986లో వారిద్దరూ వివాహం చేసుకున్నారు.1990నుంచి 1992 వరకు ఆమె గుంటూరు పట్టణంలో సెంట్రల్ ఆర్గనైజర్ (సిఓ)గా పని చేశారు. 1992లో, ఆమె నల్లమల అడవిలోకి వెళ్లి, అక్కడ ఫారెస్ట్ డివిజనల్ కమిటీలో పనిచేసిందని తెలిపారు. నల్లమలలో ఉన్న సమయంలో వెలిగొండ , భైరవకోన ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నదని 2001 వరకు నల్లమలలో పనిచేసిందన్నారు. 2001లో ఆమెకు డివిజనల్ కమిటీ సభ్యురాలుగా పదోన్నతి లభించిందని చెప్పారు.2001లో ఆమె భర్త టిఎల్ఎన్ చలం తో కలిసిఆంధ్రాఒడిశా సరిహద్దు ప్రాంతానికి బదిలీ చేయబడిందని చెప్పారు. అక్కడ ఆమె 2006 వరకు పనిచేసి ఏఓబిలో పనిచేసిన పదవీకాలంలో పూజారి గూడ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందన్నారు. 2006లో ఆమె భర్త టిఎల్ఎన్ చలంతో పాటు, ఆమెను దండకారణ్యం (డికె) కు బదిలీ చేశారు. దండకారణ్యం కార్యకర్తలలో సైద్ధాంతిక,రాజకీయ అవగాహన లేకపోవడంతో కేడర్లో సైద్ధాంతిక,రాజకీయ అవగాహనను బలోపేతం చేయడానికి కేంద్ర కమిటీ ప్రత్యేకంగా సునీత ,చలంను డికె కు నియమించిందని తెలిపారు.2014లో ఆమె కుతుల్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందని చెప్పారు.2025 జూన్ 5న, ఆమె తన భర్తతో కలిసి అన్నపురం నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నదని చెప్పారు, ఈఘటనలో ఆమె భర్త టిఎల్ఎన్ చలం చనిపోయాడని తెలిపారు.



సీపీ సుధీర్ బాబు ముందు లొంగిపోయిన సునీత

2006 నుంచి ఇప్పటివరకు, ఆమె తన భర్తతో కలిసి రీజనల్ పొలిటికల్ స్కూల్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిందన్నారు.మావోయిస్టు పార్టీ సిద్ధాంతర్త , మేధావిగా, ఆమె పలు వ్యూహాలను రూపొందించడంలో గణనీయంగా పని చేసిందని చెప్పారు.ఇదే కాకుండా అనేక పత్రాలను తయారు చేయడంలో, క్రాంతి వంటి పార్టీ పత్రికలను ప్రచురించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని 40 సంవత్సరాల పాటు మావోయిస్టు పార్టీలో వివిధ విభాగాలలో పనిచేశారని చెప్పారు. కాగా వారిపై ఉన్న రివార్డ్ ను వారికి అందజేస్తామని సీపీ తెలిపారు.

## 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

### బకాయిలు రూ. 1300 కోట్ల నుంచి రూ. 1400 కోట్లు

### వైద్య, ఆరోగ్య మంత్రితో ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలి

### ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకి టిఏఎన్‌హెచ్ఏ లేఖ


హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21: రాష్ట్రంలో కొనసాగుతున్న నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేయాలని నిర్ణయించాయి. తమకు రావల్సిన రూ. 1300 కోట్ల బకాయిలను వెంటనే మంజూరు చేయాలని.. అలాగే తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఫర్ ఆరోగ్యశ్రీ(టిఏఎన్‌హెచ్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వద్దిరాజు రాకేష్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకి లేఖ రాశారు. ఈ ఏడాది జనవరిలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని చెప్పిన సమయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, శాఖ కార్యదర్శి చర్చలు జరిపారని కానీ అప్పటి నుంచి గడచిన 6, 7 నెలల్లో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రులతో ప్రభుత్వం చేసుకున్న అవగాహన ఒప్పందాన్ని సవరించాలని, ప్యాకేజీని సవరించాలని, సాధారణ చెల్లింపులు చేయాలని రీఇంబర్స్‌మెంట్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో ఆసుపత్రులను మూసివేసే పరిస్థితి వచ్చిందని, వైద్యులకు జీతాలను సైతం చెల్లించలేకపోతున్నందున వారు తమ సేవలను చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. వెంటనే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితోగానీ లేదంటే ముఖ్యమంత్రితో గానీ చర్చలకు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. గతంలో ఉన్న బకాయిలు కాస్త పెరిగి ఇప్పుడు సుమారు రూ.1300కోట్లనుంచి రూ.1400కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు.

# నవంబర్ 8న దక్షిణ భారత సిఎస్ఆర్ భారీ సదస్సు

### హైదరాబాద్ వేదికగా కార్పొరేట్ సామాజిక బాధ్యత విధానంపై చర్చ

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిచే పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ ఆగస్టు 21, ప్రభాతవార్త: దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడే కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సు హైదరాబాద్ వేదికగా నవంబర్ 8 జరగనున్నది. కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సు అధికారిక పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ గౌరవ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ ప్రఖ్యాత సదస్సులో ప్రముఖ కార్పొరేట్ నాయకులు, సిఎస్ఆర్ నిపుణులు, అభివృద్ధి రంగ నిపుణులు మరియు పాలసీ మేకర్లు పాల్గొనబోతున్నారు. సామాజిక బాధ్యతను, సుస్థిర అభివృద్ధి, సహకార భాగస్వామ్యాలపై ప్రభావవంతమైన చర్చల కోసం ఇది ఒక వేదికగా నిలవనుంది. పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సదస్సుకు హైదరాబాద్‌ను వేదికగా ఎంచుకున్న నిర్వాహ కులను



అభినందించారు. దేశ నిర్మాణంలో సిఎస్ఆర్ పాత్రను ప్రస్తావిస్తూ, వివిధ రంగాల నుండి వచ్చిన భాగస్వామ్యాలు సామాజిక ప్రభావాన్ని కలిగించడంలో కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సిఈఓ గోనెరెడ్డి, ఈవెంట్ లైసెన్సీ ఎదుడొడ్ల వినిల్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొని ఈ సదస్సును దక్షిణ భారతదేశ సిఎస్ఆర్ రంగంలో ఒక మైలురాయిగా మార్చాలని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు.ఈ రాబోయే సదస్సు వినూత్న సిఎస్ఆర్ కార్యక్రమాలను ప్రదర్శించడంతోపాటు, ఉత్తమ అనుభవాలను పంచుకోవడానికి, వివిధరంగాలలో భాగస్వామ్యఅవకాశాలను అన్వేషించడానికి ఇది ఒక శక్తివంతమైన వేదికగా మారనుంది.

## తిరిగి ప్రారంభమైన ఉపాధ్యాయుల పదోన్నతులు

### హైకోర్టు తీర్పుతో రీషెడ్యూల్‌ను ప్రకటించిన పాఠశాల విద్యశాఖ

హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు బుధవారం ఎత్తివేయడంతో పదోన్నతుల ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది. సీనియారిటీ విషయమై కొందరు టీచర్లు న్యాయస్థానంలో కేసు దాఖలు చేయడంతో హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. బుధవారం స్టే ఎత్తివేయడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు పదోన్నతుల కోసం రీషెడ్యూల్‌ను జారీ చేశారు. గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. గురువారం ఆప్షన్లు ఇచ్చుకోవడంతో జీహెచ్ఎంలుగా పదోన్నతులు ఇచ్చారు. మల్టీ జోన్-1లో 490 మందికి, మల్టీ జోన్-2లో 390 మందికి... మొత్తం 880 మందికి జీహెచ్ఎంలుగా పదోన్నతులు లభించాయి. 2,324 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, మరో 640 మంది ఎస్‌జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ(పీఎస్‌హెచ్ఎం) లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇందుకోసం రీషెడ్యూల్‌ను ఈ నెల 26 వరకు 7 రోజులపాటు కొనసాగించనున్నట్లు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ గురువారం షెడ్యూల్‌ను జారీ చేశారు.

## ఢిల్లీలో కుటుంబం దారుణ హత్య

### కుమారుడిపైనే అనుమానం

హైదరాబాద్, ఆగస్టు21, ప్రభాతవార్త: ఢిల్లీలో ఒక కుటుంబాన్ని అతిదారుణంగా హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఢిల్లీలోని మైదాన్‌గడిలోని ఓ ఇంటి నుంచి రక్తంతో ముగ్గురు పడిఉన్నారన్నారు. దుర్వాసన రావడంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి వచ్చి ఇంట్లో చూసేసరికి విగజీవులుగా ఉన్నారు. ఘటన స్థలిని తనిఖీ చేయడంతో ప్రేమ్‌సింగ్ (45), రజని(40), వారి కుమారుడు రితిక్ (24) మృతదేహాలు రక్తపు మడుగులో ఉన్నాయి. మృతుల మెడలపై కత్తిపోట్లు, ఇటుకలతో తలలపై గాయం చేసినట్లు గుర్తులు ఉండడంతో అత్యంత దారుణంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మానసిక సమస్యతో బాధపడుతున్న ప్రేమ్‌సింగ్ చిన్న కుమారుడు సిద్దార్థ్ ఈ దారుణానికి తెగబడ్డాడనే పోలీసులు అనుమానిస్తున్నారు. అతడిని విచారిస్తే కానీ.. వాస్తవాలు తెలిసే అవకాశం ఉండదని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం అతను పరారిలో ఉండడంతో గాలింపు చర్యలు వేగవంతం చేశారు.మానసికస్థితి సరిగ ఉండదని, ఒక్కోసారి క్రూరంగా వ్యవహరిస్తాడని స్థానికులు చెబుతున్నారు. గత పన్నెండేళ్లుగా మానసిక చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కక్ష కట్టి టిబిజికెఎస్ నుంచి తొలగించారు

### సింగరేణి కార్మికులకు కవిత బహిరంగ లేఖ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు21: తనపై కక్ష కట్టి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నుంచి తొలగించారని కల్వకుంట్ల కవిత విడుదల చేసిన లేఖ సంచలనంగా మారింది. కుమారుని అడ్మిషన్ నిమిత్తం అమెరికాకు వెళ్లిన కవిత అక్కడి నుంచే సింగరేణి బొగ్గు గని కార్మికులకు రాసిన లేఖను విలేకరులకు పంపించారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన టిబిజికెఎస్ కేంద్ర కమిటి సమావేశంలో కవితను గౌరవాధ్యక్షురాలిగా తొలగించి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. దీన్ని ఉటంకిస్తూ కవిత విడుదల చేసిన లేఖ సింగరేణి వ్యాప్తంగా సంచలనం రేపుతుంది. టిబిజికెఎస్‌కు గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు కార్మికుల కుటుంబాల్లో ఒక సభ్యురాలుగా సేవలందించానని, కార్మికులను ఏకత్రాటిపైకి తీసుకొచ్చానని పేర్కొన్నారు. టిబిజికెఎస్‌లో జరిగే నిర్ణయాలను గౌరవ అధ్యక్ష హోదాలో తీసుకునేలా తీర్మానం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికుల సంక్షేమానికై పోరాడుతుంటే కొందరు కుట్రలు, కక్షలు పన్ని తొలగించడం దారుణమన్నారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించడం తప్పో,ఒప్పో అనే అంశాలను పక్కన పెడితే రాజకీయ కారణాలతో ఎన్నిక జరిగినట్టుగా అవగతమవుతుందన్నారు. దీని వల్ల తనకు వ్యక్తిగతంగా ఎలాంటి నష్టం లేకున్నా కార్మికుల శ్రేయస్సుకై పోరాడుతున్న తనను లక్షంగా చేసుకొని తొలగించారన్నారు. రెండు దశాబ్దాల పాటు ప్రక్కన పెట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కెసిఆర్‌ను ఒప్పించి కారుణ్య నియామకాల పేరుతో 19,463 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు పేర్కొన్నారు. సకల జనుల సమ్మెతో సింగరేణిలో ఒక్క బొగ్గు పెళ్లను సైతం బయటకు రాకుండా చేసి ఢిల్లీ పాలకులకు కనువిప్పు కలిగించామన్నారు. తెలంగాణా ఇంక్రిమెంట్ ఇప్పించామన్నారు. పది లక్షలకు వడ్డీ లేకుండా ఇంటి రుణం, ఉచిత కరెంటు, ఉచిత ఏసి, మ్యాచింగ్ గ్రాంటు పది రెట్లు, ఐఐటి, ఐఐఎం చదివే వారి పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్, అంబేద్కర్ జయంతి రోజున పూర్తి సెలవు, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్‌లకు ఆప్షనల్ హాలీడే, కార్మిక కుటుంబసభ్యులకు కార్పోరేట్ వైద్యం లాంటి వాటి అమలులో క్రియాశీలకంగా పనిచేశానన్నారు. బిఆర్ఎస్‌లో కొన్నేళ్లుగా జరుగుతున్న పరిణామాలు, తన తండ్రికి వ్రాసిన లేఖను అమెరికా పర్యటనలో ఉండగా లీక్ చేయడంతో మనస్థాపానికి గురైనట్టు చెప్పారు. దీన్ని బయటపెట్టాలని కోరితే తనపై కక్ష కట్టారన్నారు. అట్టి కుట్రదారులే వివిధ రూపాల్లో వేదింపులకు గురి చేస్తున్నారన్నారు. మళ్లీ అమెరికాలో ఉన్న సమయంలో కార్మిక చట్టాలకు విరుద్ధంగా టిబిజికెఎస్ కేంద్ర కమిటి సమావేశం నిర్వహించి కొత్త గౌరవ అధ్యక్షున్ని ఎన్నుకున్నట్టు ప్రకటించారన్నారు. టిబిజికెఎస్‌కు గౌరవాధ్యక్షురాలి హోదాలో ఉన్నా లేకున్నా కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. గతంలో ఎలా పనిచేశానో అదే రీతిలో కార్మికులకు చిన్న కష్టం వచ్చినా అండదండగా ఉంటానన్నారు. కాగా, కవిత టిబిజికెఎస్ గౌరవాధ్యక్షురాలి హోదాలో ఉన్న సమయంలోనే, కవిత వ్రాసిన లేఖ లీకు అయిన కొద్ది రోజులకే సింగరేణిలోని 11 ఏరియాలకు సింగరేణి జాగృతి పేరుతో ఇంచార్జిలను నియమించారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌తో టిబిజికెఎస్ సమావేశం జరిగినా కవితను గౌరవాధ్యక్షురాలి హోదా నుంచి తొలగించలేదు. కానీ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను సింగరేణి టిబిజికెఎస్‌కు ఇంచార్జిగా ప్రకటించారు. కాగా, 15 రోజుల క్రితం కవిత హైద్రాబాద్‌లోని బంజారాహిల్స్ తన స్వంత గృహంలో హెచ్ఎంఎస్ నాయకత్వంతో సమావేశం నిర్వహించి పొత్తు పెట్టుకున్నట్టు ప్రకటించారు. జాతీయ స్థాయి హోదా కలిగిన హెచ్ఎంఎస్‌తో కలిసి సింగరేణిలో పోరాటాలు చేస్తామని మీడియాతో తెలిపారు. హెచ్ఎంఎస్‌తో పొత్తు పెట్టుకున్నట్టు స్వయంగా కవిత ప్రకటించిన తరువాతనే రెండు రోజుల క్రితం టిబిజికెఎస్ కేంద్ర కమిటి సమావేశం నిర్వహించి ఈశ్వర్‌ను గౌరవాధ్యక్షునిగా నియమించారు. కవిత వ్రాసిన లేఖలో సింగరేణి జాగృతితో ఇంచార్జిల నియామకం, హెచ్ఎంఎస్‌తో పొత్తు పెట్టుకున్న విషయాలను మాత్రం అందులో ఉటంకించలేదు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలుంటాయ్..

### తెలుగు ఎంపి లంతా సుదర్శన్ రెడ్డికే మద్దతు ఇవ్వాలి..

### విలేఖరుల సమావేశంలో ఎంపి మల్లు రవి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త: త్వరలో జరగబోయే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలు ఉంటాయని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. తెలుగు ఎంపిలంతా ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికే మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ రెడ్డి గురువారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎంపి మల్లు రవి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేఖరులతో మాట్లాడారు.తెలుగు ఎంపిలు కృషి చేయాలని కోరారు.సుదర్శన్ రెడ్డికి ఏ పార్టీలో సభ్యత్వం లేదు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఇండియా కూటమి సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన గెలుపు కోసం తెలుగు ఎంపిలంతా కృషి చేయాలి. సుదర్శన్ రెడ్డి త్వరలోనే పలు రాష్ట్రాల్లో పర్యటిస్తారు. తనకు మద్దతు ఇవ్వాలని వివిధ పార్టీలను, ఎంపిలను కోరతారు. ఈ ఎన్నికల్లో విప్ ఉండదు. కాబట్టి ఎంపీలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం ఉం టుంది. ఈ అవకాశాన్ని సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం వినియోగించుకుంటారని ఆశిస్తున్నామని అని మల్లు వివరించారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి త్వరలో ఉత్త రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల కు వెళ్తారు. యూపీలో అఖిలేష్ యాదవ్, బెంగా ల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్ మద్దతు కోరతారు. అలాగే ఇండియా కూటమి ఎంపీల మద్దతు కోరతారు. తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్‌గా నేను కూడా సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం ఎంపీల మద్దతు కోరతానని మల్లు రవి స్పష్టం చేశారు.

**చంద్రబాబు కృతజ్ఞత చూపాలి:** ఎన్టీఆర్,చంద్రబాబు మధ్య పార్టీ గుర్తు కోసం కేసు నడిచిన సమ యంలో సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టులో న్యాయ మూర్తిగా ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు కృతజ్ఞత చూపాల్సి న సమయం వచ్చిందని రవి వ్యాఖ్యానించారు. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని మేము అన్ని పార్టీలను, ఎంపీలను విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఆయన జడ్జిగా ఉన్నప్పుడు ఎన్నో కీలక తీర్పు లను చెప్పారు. ఆయన ఎప్పుడూ ప్రజల కోణం లో ఆలోచించే వ్యక్తి అని మల్లు రవి వ్యాఖ్యా నించారు.తెలుగు కేంద్ర మంత్రులకు లేఖలు రాస్తామని తెలిపారు. పార్లమెంట్‌లో ఉభయ సభలను నిర్వహించడంలో బిజెపి ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు ప్లాన్ ప్రకా రం సభల్లో గందరగోళ పరిస్థితులు సృష్టించారని మల్లు రవి ఆరోపించారు. అలాగే తెలంగాణ ఎంపీలంతా కలిసి కీలక అంశాలపై కేంద్ర ప్రభు త్వానికి లేఖలు రాసినట్టు వివరించారు మల్లు రవి.విభజన సమస్యల పరిష్కారం, సెమీకండక్టర్ యూనిట్స్,తెలంగాణలో ఎయిర్ పోర్టులు, మూసీనది ప్రక్షాళన వంటి అంశాలపై సంబంధిత మంత్రులకు లేఖలు రాసినట్టు వెల్లడించారు.

# ఇంజనీరింగ్, వృత్తి విద్య ఫీజుల నిర్ధారణలో ఏఎఫ్ఆర్‌సికి పూర్తి స్వేచ్ఛ

### కాలేజీలు సమర్పించే ఆడిట్ రిపోర్టులు తప్పనిసరిగా నోటరీ అఫిడవిట్ దాఖలు చేయాలి

### ఫీజుల నిర్ధారణ కోసం జీవో 33ను జారీ చేసిన సర్కార్

హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21: తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఇతర వృత్తివిద్య కోర్సులకు సంబంధించిన ఫీజులను నిర్ధారించడంలో తెలంగాణ అడ్మిషన్, ఫీజు నియంత్రణ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సి)కి పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఒకసారి ఏఎఫ్ఆర్‌సి ఫీజులను నిర్ణయిస్తే దానినే కొనసాగించేలా నిబంధనలు ఉండగా.. దానిని కాస్త సవరించి కాలేజీ యాజమాన్యాలతో చర్చించి ఫీజులు ప్రతిపాదన చేసిన తరువాత కూడా ఆ ఫీజులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఇకపై ఏఎఫ్ఆర్‌సికి లభించనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఫీజుల నిర్ధారణ కోసం కొలమానాలను నిర్ణయించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నేపథ్యంలో కమిటీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నిర్ధారణలో కొలమానాలపై జీవో ఎంఎస్ నంబర్ 33ను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా జారీ చేశారు. ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తివిద్య కాలేజీల్లో విద్యార్థుల హాజరుకు ఫేస్ రికగ్నేషన్‌ను అమలు చేయాలి, అలాగే ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు ఉండేలా కాలేజీలు చర్యలు తీసుకోవాలి. వాటితోపాటు విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహిస్తున్నారా? లేదా? అనేది కూడా పరిశీలించనున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల (ప్రవేశాల నియంత్రణ, క్యాపిటేషన్ ఫీజు నిషేధం) చట్టం, 1983 (1983 చట్టం నం.5) లోని సెక్షన్ 15, సెక్షన్ 3, 7 తో కలిపి ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, తెలంగాణ అడ్మిషన్ మరియు ఫీజు నియంత్రణ కమిటీ (ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ సంస్థలలో అందించే ప్రొఫెషనల్ కోర్సుల కోసం) నియమాలు, 2006కు సవరణను చేశారు. ఫీజుల నిర్ణయం కోసం ముందుగానే ఏఎఫ్ఆర్‌సి ప్రతి సంస్థ నుండి దాని ప్రతిపాదిత ఫీజు నిర్మాణాన్ని, అన్ని సంబంధిత పత్రాలు, అకౌంట్ పుస్తకాలను పరిశీలన కోసం కోరాలి. ప్రొఫెషనల్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు స్థిరీకరణ ప్రయోజనం కోసం ఏఎఫ్ఆర్‌సికి సమర్పించిన వాస్తవాలు, గణాంకాల ఖచ్చితత్వం, వాస్తవికతను ధృవీకరిస్తూ నోటరీ చేయబడిన అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. సమర్పించిన వాస్తవాలు, గణాంకాల్లో ఏదైనా వక్రీకరణ ఉన్నట్టయితే సంబంధిత చట్టాలు, నియమాల ప్రకారం శిక్షార్హమైన చర్యకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. సంస్థ పేర్కొన్న అంశాలకు వెయిటేజీని ఇస్తూ, సంస్థ వసూలు చేసే ప్రతి కోర్సుకు ప్రతిపాదిత రుసుమును ఆమోదించడానికి లేదా మార్చడానికి ఏఎఫ్ఆర్‌సికి స్వేచ్ఛ ఉంటుంది. ఏదైనా రుసుము లేదా రుసుమును నిర్ణయించే ముందు సంస్థకు తన వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. ఫీజును సూచించేటప్పుడు హేతుబద్ధీకరించేటప్పుడు ఏఎఫ్ఆర్‌సి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. బలమైన అంతర్గత నాణ్యత హామీ వ్యవస్థతో విద్య నాణ్యత ఉండాలి. విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు ఉండాలి.. అలాగే ఆధార్ ప్రామాణీకరించిన చెల్లింపుల వ్యవస్థను కొనసాగించాలి. వాటితోపాటు) పరిశోధన, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ, స్టార్టప్‌లు, పరిశోధన ప్రచురణలు, అవార్డులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను పరిగణలోకి తీసుకొని ఫీజులను నిర్ణయిస్తారు. 2025-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించి ప్రైవేటు ఇంజనీరింగ్‌తోపాటు ఎంబిఏ, ఎంసిఏ, బిఈడి, ఎంఈడి, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ తదితర వృత్తివిద్య కోర్సులను అందిస్తున్న కాలేజీల్లో ట్యూషన్ ఫీజును నిర్ధారణ చేయడం కోసం ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఛైర్‌పర్సన్‌గా, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ మెంబర్ సెక్రటరీగా ఉన్నారు. సభ్యులుగా సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఎస్‌సిడిడి కమిషనర్ ఎన్ క్షితిజ, స్టేట్ ఆడిట్ శాఖ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, డిటిసిపి డైరెక్టర్ ఎస్ దేవేందర్ రెడ్డి, జెఎన్‌టియు హైదరాబాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె వెంకటేశ్వరరావు, ఓయూ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన ఇంజనీరింగ్ విభాగాపు డీన్ ప్రొఫెసర్ ఏ కృష్ణయ్య సభ్యులుగా ఉన్నారు.

## రాష్ట్రాల ఆదాయం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలి

### జాతీయ ఆదాయంలో వాటాకు తగిన విధంగా నిధుల పంపిణీ లేదు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త: జీఎస్టీలో రాష్ట్ర ఆదాయం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. జీఎస్టీ కౌన్సిల్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ బృందంలో సభ్యులుగా ఉన్న విక్రమార్క గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ, జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో ఆ మేరకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించడానికి, రాష్ట్రాలు స్థిరంగా 14 శాతం వృద్ధిని సాధించేందుకు, మొదటి 5 సంవత్సరాలపాటు జీఎస్టీ పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని వివరించారు. అయితే, ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ రేట్ల సరళీకరణ, మరియు పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా రక్షించే చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో, పేద మరియు మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రజల కోసం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతింటాయని హెచ్చరించారు. అలాగే, ఆదర్శ వృద్ధి రేటు 14 శాతం, ప్రస్తుత 8 నుండి 9 శాతం వృద్ధి రేటును పక్కన పెడితే గాని, ప్రతిపాదనలు ఒంటరిగా పరిశీలిస్తే రాష్ట్రాలకు ప్రతికూల ఆదాయ వృద్ధికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# కట్టడి చేసే 'పోలీస్లే కే టోపీ

### పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో నకిలీసర్టిఫికేట్ల బాగోతం

### యాభైతొమ్మిది మంది కానిస్టేబుల్ అభ్యర్థులపై సిసిఎస్‌లో కేసు

హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త: సమాజంలో నేరాలను కట్టడి చేసేందుకు ఎంతో కష్టపడి వచ్చిన కానిస్టేబుల్స్ ఉద్యోగ జాయినింగ్‌లో మొదటి నేరం చేశారు.2022 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన సుమారు 59 మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లతో పట్టుబడ్డారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిజిపిఆర్‌బి)లో తనిఖీల్లో వెలుగుచూడడంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చానీయంశమైంది. ఈ మేరకు అభ్యర్థులపై హైదరాబాద్‌లోని సిసిఎస్‌లో కేసు నమోదు చేయడంతో వారి శిక్షణను ఆపేశారు. పోలీస్ కానిస్టేబుల్స్ (సివిల్, ఏఆర్,టీఎస్ఎస్‌పి), ఫైర్‌మెన్ మరియు వార్డర్ల నియామక పరీక్షలో ఉద్యోగాలు పొందడానికి నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్లను సమర్పించారని ఆరోపిస్తూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి) జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి ఉమాకాంత్ సిసిఎస్‌లో పిర్యాదు చేయడంతో క్రిమినల్ కేసు నమోదు చేశారు. అయితే ఖాళీగా ఉన్న కానిస్టేబుల్, ఫైర్‌మెన్ మరియు వార్డర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత,తుది పత్రాల పరిశీలన సమయంలో, తాత్కాలికంగా ఎంపికైన 59 మంది అభ్యర్థులు సమర్పించిన బోనఫైడ్ సర్టిఫికెట్లు నకిలీవని బోర్డు కనుగొంది. షోకాజ్ నోటీసులపై వివరణలు సంతృప్తికరంగా లేవని భావించినట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు.స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ (ఎస్‌సిటి) నిబంధనల ప్రకారంతో అభ్యర్థులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఏ సర్వీసుకు నియామకం పొందేందుకు అర్హులు కారని వివరించారు. 59 మంది నిందితులపై 54 మంది పోలీస్ కానిస్టేబుల్స్,ముగ్గురు ఫైర్‌మెన్, ఇద్దరు వార్డర్‌లపై సెక్షన్లు 420,468,471 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును సిట్‌కు బదలీ చేశారు. కానిస్టేబుల్ నియామకాలలో సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్,తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్,కమ్యూనికేషన్స్ విభాగాల అభ్యర్థులు ఉన్నారు. ఇదిలా ఉండగా నిందితుల ఎంపిక ఇప్పటికే రద్దు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన 59మంది విచారించనున్నట్లు వెల్లడించారు.

# డిజిపిని కలిసిన మార్వాడీలు

హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త: అగర్వాల్ సమాజ్, మార్వాడీలపై జరుగుతున్న విద్వేష ప్రచారంపై కఠినచర్యలు తీసుకోవాలని అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు గురువారం డిజిపి జితేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అగర్వాల్ సమాజ్, మార్వాడీలు బయటవారు కాదని, తామంతా తెలంగాణ వారమన్నారు. సికింద్రాబాద్, ఆమన్‌గల్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘటనలపై ఉద్వేశపూర్వకంగా రెచ్చగొట్టే వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని వివరించారు, తమ సామాజిక వర్గాన్ని భయాభ్రాంతులకు గురిచేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. మార్వాడీ, అగర్వాల్ సమాజ్ కుటుంబాలు వంద ఏళ్లకు పైబడే తెలంగాణలో నివసిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రాభివృద్ధిలోనూ సైతం భాగస్వామ్యయామని డిజిపికి వెల్లడించారు. స్వచ్ఛంద సేవలో భాగంగా అనేక దవఖానాలు, విద్యాసంస్థలు, ఓల్డ్ ఏజ్ హోంలు నడిపిస్తున్నామని, చాలా మంది ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. గోబ్యాక్ అంటూ తమపై దాడిచేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD

O.A. No. 252 of 2023

Axis Bank Ltd ...Applicant

And

M/s. Saboo Cars Private Limited ..Defendant

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s. Saboo Cars Private Limited Represented by its Managing Director Rail Kalyan, 12-8-452/453/5 Modi Compound Opp. Mettuguda, Hyderabad, Telangana - 500017
Also at: Saboo Cars Private Limited Represented by its Managing Director Plot: 9/3, Ida Nacharam, Opp Hp Petroleum Bunk, Nacharam, Hyderabad, Telangana - 500076
3. Mr. K VEERENDHER REDDY, Plot Number-19 And 20, Waheb Nagar Exten Tirumalagiri Telangana 500009 India.

...Defendants

Please take the summons in the above OA.No.252/2023 filed by the Applicant for Recovery of money of Rs.1,32,27,437.37 Ps/ against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vartha" Telugu Daily newspaper and posted the matter to 28-10-2025 In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 28-10-2025 at 10.30 a.m at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni complex Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be grante.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
ouen nereiyhae a tets tat tand on this day 14th August 2025
(By order of the Court)

Sd/- Asst. Registrar
Debts Recovery Tribunal - II, Hyderabad.

వార్త

జ్ఞానులు పొందలేని దానిని కోరరు, నశించిపోయిన దానిని గురించి విచారించడానికి ఇష్టపడరు. ఆపదలలో కూడా చలించరు.

-హెన్రీఫోర్డ్

# ప్రజారోగ్యాన్ని పట్టించుకోరా?

ఎవరి గోల వారికి ఆనందం అంటారు. దేశంలో వివిధ వ్యాధులతో కోట్లాది మంది ప్రజలు విలవిల్లాడుతుంటే రాజకీయాలతో వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ఎత్తుగడలతో నేతలు మునిగితేలుతున్నారు. దేశంలో డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విషజ్వరాలతోపాటు డయేరియా, మలేరియా, ఒకటేమిటి అన్నిరకాల వ్యాధులు ప్రజారోగ్యంపై దాడి చేస్తున్నాయి. ఈ విషజ్వరాల బారినపడి ఎందరో అసువులు బాస్తుండగా కోట్ల సంఖ్యలో ఆస్పత్రిపాలవుతున్నారు. ఎడతెరిపిలేని వర్షాల వెన్నంటే విజృంభిస్తున్న విషజ్వరాలతో దేశంలో ప్రజలు వణికిపోతున్నారు. చల్లబడిన వాతావరణం, ఎక్కడికక్కడ గుట్టలు, గుట్టలుగా పేరుకుపోయిన చెత్తా చెదారం, పొంగిపొర్లుతున్న మురుగునీరు తోడు కావడంతో కుప్పలు కుప్పలుగా పుట్టుకొస్తున్న దోమలే ప్రాణాంతక వ్యాధులను మోసుకు వస్తున్నాయి. ప్రజారోగ్యం ఇంతటి తీవ్ర పరిస్థితులను ఎదుర్కొంటున్నా బాధ్యత కలిగిన పాలకులు ఏదో సూచనలు, సలహాలతో కాలం వెళ్లదీస్తున్నారే తప్ప ఆ విషజ్వరాల బారి నుండి కాపాడేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారనే చెప్పొచ్చు. ఈ వ్యాధులతోపాటు కేన్సర్, ఎయిడ్స్‌వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా ప్రబలిపోతున్నాయి. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవ జాతిపై ప్రకృతి విసురుతున్న సవాల్‌కు వారూ వీరు అని కాకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పటికప్పుడు తలవంచుకోవాల్సిన వాస్తవాలను చాటుతూ వ్యాధులు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుండా పదేళ్లలోపు చిన్నారులు కూడా గుండెపోటుతో తనువులు చాలిస్తున్నారు. అత్యున్నత వైద్యసేవలు అందుబాటులో ఉండి కూడా నిష్ప్రయోజనమవుతున్నాయనేందుకు చికిత్స అందుకుంటూనే ప్రాణాలు కోల్పోతున్నారు. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిందని కొత్త కొత్త మందులు కనుగొంటున్నామని చెప్పుకుంటున్న మానవుడి మేధశక్తిని సవాల్ చేస్తూ ఎప్పటికప్పుడు కొత్త జబ్బులు వస్తూనే ఉన్నాయి. ఈ యేడాది గత రెండు నెలలుగా రకరకాల జ్వరాలు విజృంభించాయి. అవి ఎందుకు వస్తాయో? ఎలా వస్తాయో? చెప్పలేని పరిస్థితి. కనుమరుగవుతుందనుకున్న మలేరియా వ్యాధి కూడా ప్రబలిపోతున్నది. మూడు రకాల దోమల కారణంగా మలేరియాతోసహా ఆరు ప్రాణాంతక వ్యాధులు దాపురిస్తున్నాయని డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. చికెన్‌గున్యా లాంటి వ్యాధులతో ప్రాణాలకు ఇబ్బందిలేకపోయినా ఒకటి, రెండు రోజులు కాదు వారాల తరబడి, నెలల తరబడి మంచానికే పరిమితం కావాల్సి వస్తున్నది. మరొకరి సహాయం లేకుండా కాలకృత్యాలు తీర్చుకోలేని పరిస్థితి. వాస్తవంగా చికెన్‌గున్యా ఇప్పటికిప్పుడు పుట్టింది కాదు. డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి జ్వరాలు కూడా వీర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇంతటి తీవ్ర రూపం దాల్చు తున్నా ప్రజారోగ్యం ఆందోళనకరంగా మారినా పాలకులు అవసరం మేరకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఈ వ్యాధులు సోకిన లక్ష్మీప్రసన్నుల సంగతి అలా ఉంచినా మధ్యతరగతి, ముఖ్యంగా రెక్కాడితే కానీ డొక్కాడని రోజువారీ కూలీలు, చిన్నాచితక వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగించేవారి పరిస్థితి దారుణంగా ఉంది. అసలు వ్యాధి నిర్ధారణకు జరిపే పరీక్షలకే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ రంగంలో ఉన్న ఆస్పత్రులు కొంత మేరకు చేయూతనిస్తున్నా అది ప్రజల అవసరాలను తీర్చ లేకపోతున్నాయి. మందుల కొరత, చాలీచాలని సిబ్బంది, బెడ్‌లు లేమి ఒక్కటేమిటి అన్నీ సమస్యలే. ఇలా రకరకాల సమస్యల వలయంలో ప్రభుత్వ రంగంలోని ఆస్ప త్రులు మునిగితేలుతున్నాయి. ఇక ప్రైవేట్ రంగంలోని ఆస్పత్రుల గూర్చి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. డెంగ్యూ లాంటి వ్యాధి సోకితే నిర్ధారణకే వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆ తర్వాత చికిత్సకు లక్షల్లో వ్యయం చేయా ల్సి వస్తున్నది. ఇలా జ్వరాలకే కాదు గుండె జబ్బులు, కిడ్నీ రోగాలు, ఇతర వ్యాధులకు డాక్టర్లు, వైద్యం ఉన్నా వాటికి అయ్యే వ్యయం సామాన్యులు అందుకోలేనంతగా పెరిగిపోయింది. వైద్యం ఒక వ్యాపారంగా రూపాంతరం చెందింది. కార్పొరేట్ రంగం ప్రవేశించినప్పటి నుండి బీదాబిక్కి బడుగు వర్గాలకే కాదు మధ్యతరగతి వారికి కూడా అందని పండుగా తయారైంది. రోగిని, రోగాన్ని పరిశీలించి, పరీక్షించి చికిత్స చేసే రోజులు పోయి ఇన్సూరెన్స్, రోగి జేబును చూసి వైద్యం అందించే దురదృష్టపు రోజులు దాపురించాయి. సొంత డబ్బో, లేక బ్యాంకుల నుండి అప్పోసొప్పో చేసి నక్షత్రపు హోటళ్ల స్థాయిలో ఆస్పత్రులను నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడిని వడ్డీతో సహా రాబట్టుకోవడం కోసం చేయరాని, చేయకూడని పనులు కూడా చేయడానికి కొన్ని యాజమాన్యాలు వెను కాడడంలేదు. ఈ సంపాదన ఆరాటపు పోటీలో నైతిక విలువలను కూడా పాటించడం లేదు. అందరూ అలానే ప్రవర్తిస్తున్నారని చెప్పడం లేదు కానీ అధిక శాతం కార్పొరేట్ రంగంలోని ఆస్పత్రులు అదే మార్గంలో పయనిస్తున్నాయి. ఈ విషయంలో పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లుతెరవాలి. వైద్య, ఆరోగ్య శాఖ రోగులకు చికిత్స అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రజారోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై మాత్రమే వదలకుండా వ్యాధులు సోకడానికి కారణాలైన పారిశుద్ధ్యం, కలుషిత నీరు లాంటి విషయాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పాలుపంచుకోవాలి.

చదువులో ఆనందాన్ని పొందితే, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటావు.



మహాత్మా గాంధీ

ఆదర్శాన్ని నిలపడానికి వెయ్యిసార్లు ప్రయత్నించండి. ఆ వెయ్యి సార్లు విఫలమయితే మరోసారి ప్రయత్నించండి.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### బాత్ రూం ప్రమాదాలు స్వయంకృతమే

కాలుజారితే కలెక్టర్ అయినా పడతాడు అనుపల్లె సామెత వలె ఈ మధ్య సామాన్యుల నుండి ప్రముఖుల వరకు బాత్ రూమ్స్ లో పడిపోయి తీవ్ర గాయాల పాలవటం, కొన్ని సందర్భాల్లో మరణించటం వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. అందుకుకారణం గతంలో ఇళ్ళు, బాత్ రూమ్స్ సిమెంటు ఫ్లోరింగ్ తోనో నాపరాళ్ళ ఫ్లోరింగ్ తో గానీ వుండటం వల్ల నడిచి వెళ్ళేటప్పుడు జారి పోకుండా పట్టుదొరికేది. ఐతే నేడు ఆధునిక హంగులతో నిర్మించే ఇళ్ళు, అపార్ట్ మెంట్లలో ఇంటి ఫ్లోరింగ్‌తో పాటు అటాచ్డ్ బాత్ రూముల్లో కూడా తమ అభిరుచికి తగిన విధంగా ఖరీదైన నున్నటి ఫ్లోరింగ్ వేయిస్తున్నారు. వయసు పెరిగే కొద్దీ కొద్దీ మనుషుల వేలి ముద్రలు, పాదముద్రలు కూడా అరిగిపోయి, నునుపుగా మారతాయి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఖాళీలను భర్తీ చేయాలి

అనివార్యంగా ఏర్పడ్డ ఉపరాష్ట్రపతి పదవి ఖాళీను భర్తీ చేయడానికి బిజెపి ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నరుగా పని చేస్తున్నఆర్.ఎస్.ఎస్.క్యాడర్‌కు చెందిన సి.పి.రాధాకృష్ణన్‌ను ప్రతిపాదించింది. ఈయనఎన్నిక నల్లేరుపై బండి నడక అయినప్పటికీ ప్రతిపక్షాలు కూడా పోటీ చేయడం కోసం పోటీ పడుతున్నాయి. ఇండియా కూటమి తమ తరఫున తెలంగాణా రాష్ట్రానికి చెందినసుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన బి.సుదర్శనరెడ్డిని నిలబెడుతోంది. వీరు రాజ్యాంగ విలువలకు ఉన్నతస్థానం ఇచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఈ పోటీలు తమ అస్థిత్వం చాటుకోడానికి మాత్రమేనని అందరకు తెలుసు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సామాజిక భద్రతకు విస్తృత వ్యాప్తి

భారతదేశం సామాజికభద్రతారంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిని దాటింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 95 కోట్లకు పైగా పౌరులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి లాభం పొందుతున్నారు. ఇది కేవలం ఒక గణాంకం కాదుఇది ఒక మారుతున్న భారత దేశ కథ – సమగ్ర అభివృద్ధిప్రజాసంక్షేమానికి అంకితమైన దృక్పథాన్ని ప్రతిబింబించేది. ఈ గొప్ప విజయానికి కేంద్ర ప్రభుత్వపు దూరదృష్టి నిబద్ధత కారణం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### కుక్క కాటుకి తీర్పు దెబ్బ

సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉన్న వీధికుక్కల్ని తరలించి రక్షిత కేంద్రాల్లో ఉంచాలని తీర్పునిచ్చింది. వీధికుక్కల బారినపడి గాయాలపాలై ప్రాణాలు పోగొట్టుకున్న ఉదంతాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ఈ విధంగా ఆదేశాలిచ్చింది. ఈ తీర్పు పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమోతున్నా, కారణం పరిశీలిస్తే ధర్మాగ్రహమే అన్న అభిప్రాయం కలుగుతోంది. ఇది ఢిల్లీకి మాత్రమే పరిమితమైన సమస్యకాదు. దేశమంతాఎదుర్కొంటున్నది. సమస్య ఎంత తీవ్రమైనదంటే తీర్పు వచ్చిన వారంలోనే నాలుగైదు కుక్క కాట్లు, ఒక మరణం సంభవించిన వార్తలు వచ్చాయి. దేశవ్యాప్తంగా కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఒక్క రాజధాని నగరంలోనే అవి పది లక్షలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రేబీస్ మరణాల్లో 37 శాతం భారత్ లోనే. ఒక్క ఏడాదిలో భారత్‌లో నమోదైన కుక్క కాట్ల కేసులు 37 లక్షలంటే సమస్య తీవ్రతఎంతన్నది తెలుస్తోంది. ఇవి నమోదైన లెక్కలు మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో జరిగి, రికార్డ్ కానివి ఇంకా ఎక్కువగా ఉంటాయి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### రైతులకు యూరియా అందించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. వ్యవసాయం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడింది. రైతులు బారులు తీరి యూరియా కోసం లైన్లో గంటలు తరబడి నిలబడుతున్నారు. అయినా రైతులకు యూరియా బస్తాలు అందడం లేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సంబంధిత వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసి కేంద్ర, ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుని రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ట్రైబల్ టూర్ నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైబల్ టూర్ నిర్వహించాలి. గిరిజనుల ఆర్థిక సామాజిక రాజకీయ విద్య వైద్యం రవాణా సౌకర్యాలు మౌలిక వసతులు వంటి అంశాలతోపాటుగా ప్రభుత్వ పరంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలగురించి అవగాహనచైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. కొమురం భీం, బిర్సా ముండా జీవిత చరిత్రలపై అవగాహన కల్పించాలి. గిరిజన సంక్షేమశాఖలో గురుకులాలు వివిధ స్థాయిలో పనిచేస్తున్న వారిని గుర్తించి ట్రైబల్ టూర్ నిర్వహించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రాజకీయాల కోసం రైతు బలికావాలా?

**ఎరువుల సరఫరా వంటి అంశాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు. ఒక రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే యూరియా ముందుగా ఆ రాష్ట్ర రైతులకు ఇవ్వాలి. మిగతావి ఇతర రాష్ట్రాలకు పంపాలి అని వారు సూచిస్తున్నారు. ఈ విధమైన వివక్ష రైతుల మనసుల్లో కేంద్రంపై అవిశ్వాసం పెంచుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో దాదాపు 70 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. యూరియా సరఫరాలో లోటు వలన మూడు లక్షల టన్నుల లోటు ఏర్పడింది. ఈ లోటు రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత కష్టాల్లోకి నెడుతోంది. పంట దిగుబడి తగ్గిపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలవుతుంది. విత్తనం వేసిన రైతు అప్పులు తీర్చలేకపోతాడు. ఇది వ్యక్తిగత సమస్య కాదు, సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్య అని మేధావులు హెచ్చరిస్తున్నారు. రైతాంగ సంస్థలు కేంద్రానికి గట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. రామగుండం ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాను ముందుగా రాష్ట్ర రైతులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.**



మన్నారం నాగరాజు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలు కొత్త రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, ఐటీ రంగం అభివృద్ధి చెందినా, రాష్ట్ర రైతాంగం మాత్రం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూనే ఉంది. దేశవ్యాప్తంగా ఎరువుల ఉత్పత్తి పెరుగుతూనే ఉన్నా, తెలంగాణ రైతులకు సరిపడా యూరియాఅందకపోవడం వారిలో తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. వ్యవసాయం రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు వెన్నెముక. రాష్ట్రంలో సగానికి పైగా ప్రజలు నేరుగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. కానీ రైతులకు అత్యవసరమైన ఎరువుల సరఫరా విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందనే భావన బలపడుతోంది. యూరియా సరఫరా విషయంలో కేంద్రం రాజకీయాలను మేళవిస్తోందనే ఆరోపణలు నిరంతరం వినిపిస్తున్నాయి. నిపుణుల లెక్కల ప్రకారం ఖరీఫ్ సీజన్లో తెలంగాణలో దాదాపు 10.4 లక్షల టన్నుల యూరియా అవసరం ఉంటుంది. కానీ అంత అవసరం ఉన్న రాష్ట్రానికి సరిపడా యూరియా అందించడం లేదు. ఇతర రాష్ట్రాలకు మళ్లించడం అన్యాయం అని రైతులు, ప్రతిపక్షాలు, మేధావులు ఒకే స్వరంతో చెబుతున్నారు. 2024 ఏప్రిల్ నుండి జూన్ వరకు కేంద్రం తెలంగాణకు 1.3 లక్షల టన్నుల యూరియాను కేటాయించగా, 2025 లో అదే కాలానికి కేవలం 71,773 టన్నులు మాత్రమే కేటాయించడం రైతుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. గతేడాదితో పోలిస్తే ఇది దాదాపు 45 శాతం తగ్గింపుగా ఉంటుంది. రైతులు ఆశ్చర్యపోతున్నారు – దేశవ్యాప్తంగా యూరియా ఉత్పత్తి పెరుగుతూనే ఉండగా, తమ రాష్ట్రానికి మాత్రం సరఫరా తగ్గించడం ఎందుకు జరుగుతోంది అని. రామగుండం ఆర్ఎఫ్‌సి ప్లాంట్ నుండి ప్రతి నెల 60 వేల టన్నుల యూరియా రావాలి. కానీ ఈసారి కేవలం 30వేల టన్నులు కేటాయించగా, అందులో ఇప్పటివరకు 10 వేల టన్నులు మాత్రమే వచ్చాయి. రామగుండం ఆర్ఎఫ్‌సి ప్లాంట్ తెలంగాణ గర్వకారణం. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో ఉన్న ఈ ప్లాంట్ ఏటా 12.7 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. రాష్ట్ర రైతుల అవసరాలను ముందుగా తీర్చాల్సిన ఈ ప్లాంట్ నుండి ఎక్కువ భాగం యూరియా ఇతర రాష్ట్రాలకు వెళ్తోందని గణాంకాలు చూపుతున్నాయి. 2023 మే నెలలోనే ఆర్ఎఫ్‌సి ప్లాంట్ 1.17 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగా, రాష్ట్రానికి కేవలం 44,701 టన్నులు మాత్రమే అందించారు. మిగతా యూరియాను ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలకు పంపడం రైతులలో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఈ ఏడాది కూడా అదే విధానం కొనసాగుతుండటంపై రైతులు మండిపడుతున్నారు. తమ నేలలో ఉత్పత్తి అవుతున్న యూరియానే తెలంగాణ రైతులకు అందకపోతే, మరెక్కడి రైతులకు వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. యూరియా సరఫరాలో కొరత కారణంగా రైతులు గోదాముల ముందు క్యూలలో గంటల తరబడి నిలబడవలసి వస్తోంది. మధ్యవర్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బ్లాక్ మార్కెట్‌లో యూరియాను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. దానివల్ల రైతులు అధిక ధరలు



చెల్లించవలసి వస్తోంది. ఎరువు సమయానికి రాకపోవడం వలన పంటల పెరుగుదల మందగిస్తుంది. పంటలు ఆశించిన విధంగా పండకపోతే దిగుబడులు తగ్గుతాయి. అప్పులు తీసుకుని విత్తనాలు వేసిన రైతులు లాభాలు పొందలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ పరిస్థితులు మానసిక ఒత్తిడికి దారితీస్తూ, రైతు ఆత్మహత్యల ముప్పు మరింత పెరుగుతుందనే భయాందోళనలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలు కేంద్రప్రభుత్వంపై విరుచుకుపడుతూ, రైతుల జీవితాలతో ఆటలు ఆడుతోంది అని ఆరోపిస్తున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలకు సరఫరా సజావుగా జరుగుతుంటే, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు కోతలు విధించడం అన్యాయం అని చెబుతున్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బిజెపి ఎంపీలు గెలిచినా, వారు రైతులసమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి మౌనం రైతుల్లో మరింత అసంతృప్తిని పెంచుతోంది. ఇక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల పక్షాన నిలిచి కేంద్రాన్ని నిరంతరం నిలదీస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదే పదే ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలుస్తున్నారు. అనేకసార్లులేఖలు రాసి తెలంగాణకు సరిపడా యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కానీ ఫలితంగా పెద్ద మార్పు కనిపించకపోవడం రైతుల్లో ఆవేదన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతగా కృషి చేసినా, కేంద్రం పట్టించుకోకపోవడంనగ్నసత్యంగా రైతులు చెబుతున్నారు. వ్యవసాయ నిపుణులు కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు. ఎరువుల సరఫరా వంటి అంశాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు. ఒక రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యేయూరియా ముందుగా ఆ రాష్ట్ర రైతులకు ఇవ్వాలి. మిగతావి ఇతర రాష్ట్రాలకు పంపాలి అని వారు సూచిస్తున్నారు. ఈ విధమైన వివక్ష రైతుల మనసుల్లో కేంద్రంపై అవిశ్వాసం పెంచుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో దాదాపు 70 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. యూరియా సరఫరాలో లోటువలన మూడు లక్షల టన్నుల లోటు ఏర్పడింది. ఈలోటు రైతుల ఆర్థికపరిస్థితిని మరింత కష్టాల్లోకి నెడుతోంది. పంట దిగుబడి తగ్గిపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలవుతుంది. విత్తనం వేసిన రైతు అప్పులు తీర్చలేకపోతాడు. ఇది వ్యక్తిగత సమస్య కాదు, సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్య అని మేధావులు హెచ్చరిస్తున్నారు. రైతాంగ సంస్థలు కేంద్రానికి గట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. రామగుండం ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాను ముందుగా రాష్ట్ర రైతులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సరఫరాలో పారదర్శకత ఉండాలని, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల అవసరాలు రాజకీయ లాభ నష్టాలకు బలికాకూడదని, వారి సమస్యల పట్ల నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందని వారు నొక్కిచెబుతున్నారు. ఇక కేంద్రం ఈ విధమైన కక్షపూరిత వైఖరిని కొనసాగిస్తే తెలంగాణ రైతులు ఆవేదనను ఉద్యమాల రూపంలో వ్యక్తపరచక తప్పదని భావిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సమావేశాలు నిర్వహిస్తూ కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ఒకవేళ సరఫరా సమస్యలు కొనసాగితే రాబోయే నెలల్లో రైతాంగ ఉద్యమాలు ఉధృతమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రైతు కడుపు నిండితేనే దేశం కడుపు నిండుతుంది అనే సామెత నేడు మళ్లీ మళ్లీ వినిపిస్తోంది. పంటల కోసం యూరియా అత్యవసరం అయిన ఈ సమయంలో కేంద్రం రైతుల అవసరాలను విస్మరించడం న్యాయం కాదు. ఇది కేవలం ఎరువుల సమస్య కాదు, రైతు జీవన సమస్య. పంటలు పండకపోతే దేశానికి అన్నం రాదు. రైతులు బ్రతకకపోతే దేశం బ్రతకదు. అందుకే కేంద్రం తన వైఖరిని మార్చుకుని, రాజకీయాలను పక్కన పెట్టి తెలంగాణ రైతుల పక్షాన నిలబడాలి. రైతు బ్రతికితేనే దేశం బ్రతుకుతుంది. రైతు కడుపు నిండితేనే ప్రజల కడుపు నిండుతుంది. రాజకీయాలు పక్క నబెట్టి రైతాంగాన్ని కాపాడడం దేశ భవిష్యత్తును కాపాడటమే అవుతుంది. •

# అణగారిన వర్గాలపై ఆగడాలకు అంతం ఎప్పుడు?

బుగ్గన మధుసూదనరెడ్డి


గత అనేక సంవత్సరాలుగా అణగారినవర్గాలపై, నిరుపేదలపై కొంత మంది ఉన్నత వర్గాలవారి పెత్తనమే రాజ్యం ఏలుతున్నది. వారుచెప్పేదే వేదం, వారు చేసేదే న్యాయం, మరొక ప్రశ్నకు తావులేదు. చట్టం, న్యాయం అంటే వారికి లెక్కేలేదు. ఎందుకంటే వారు తమ అధిపత్య ధోరణిని తమకు అనువుగా మార్చుకొని వారు ఎర వేసే కరెన్సీ నోట్లకు కొంతమంది పోలీసుశాఖకు చెందినవారు గాని, న్యాయవ్యవస్థకు సంబంధించిన వారు కాని లొంగిపోవాల్సిందే. ఇక పేదవారికి, అణగారినవర్గాలకు న్యాయం ఎలా లభిస్తుంది. వారికి న్యాయం అనేది ఎప్పటికి అందని ద్రాక్షనే? ఈ మధ్యకాలంలో మనం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ ఇప్పటికి అనేక గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు అంటే ఇంకా అక్కడ పెత్తందారీ, జమిందారీ పోకడలు, ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తుండటమే. అంటే లేనివారు ఇంకా బీదవారిగా మారిపోతున్నారు. ఉన్నవారు తమకున్న వనరులతో రాజకీయంగా అత్యున్నత పదవులు పొందుతూ, భవంతులపై భవంతులు కడుతూ తమ ఆస్తిపాస్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. పేద, సామాన్య ప్రజానీకం బలహీనతలను ఆధారం చేసుకొని తమతమ పబ్బం గడుపుకుంటూ కోట్లాది రూపాయల ప్రభుత్వ, సామాన్య ప్రజానీకం ఆస్తులను అన్యాక్రాంతం, కబ్జా చేస్తూ ప్రజల, ప్రభుత్వాల నోట్లో మట్టికొడుతున్నారు. అధికారమదంతో విర్రవీగుతూ తామేమి చేసిన అడిగేవారులేరనే అహంభావంతో పేదవారిపై దౌర్జన్యాలు పాల్పడుతూ వారికి అడ్డువస్తే డబ్బుకు అమ్ముడుపోయిన తమ అనుచరులతో వారి జీవితాలకు చరమగీతం పాడుతున్నారు వారి అడ్డుతొలగించుకుంటున్నారు అనేది నూటికి నూరుపాళ్లు నిజం. ఏదిఏమైనా సామాన్య, పేద ప్రజానీకంపై కొంతమంది ఉన్నతవర్గాల వారు అనుసరిస్తున్న ఈ అత్యంత దుర్మార్గపు వైఖరికి చెక్ పెట్టాలంటే, వారి అధిపత్యానికి గండి కొట్టాలంటే మన పెద్దలు సెలవిచ్చిన ఐక్యమత్యమే మహాబలం అనే రాజనీతి సూత్రం ఆధారంగా ఏ ఒక్కరికి అన్యాయం జరిగిన అందరు ఏకతాటిపై నిలిచి వారి దుష్టపన్నాగాలను ఎప్పటికప్పు డు త్రిప్పికొట్టి ఉన్నత వర్గాలవారిపై పైచేయి సాధించే దిశ గా, అత్యంత వివేకంగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ వారికి తగినగుణపాఠం చెప్పాల్సిన అవశ్యకత ఎంతయినా వుంది. అప్పుడే కొంతమంది ఉన్నత వర్గాల వారి దాష్టీకాలకు, వారి కిరాతక చర్యలకు ఫుల్స్టాప్ పెట్టవచ్చు. లేకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నాచందన వారి పైశాచిక చర్యలు ఎప్పటిలాగే కొనసాగుతూనే ఉంటాయి. అందుకుపేదవారు, సామాన్య ప్రజలు ప్రేక్షక పాత్ర వహించాల్సిందే. ఏమైనా ఎన్ని తరాలు, యుగాలు మారిన ఈ పెత్తందారి పోకడలకు కాలంచెల్లే రోజులు రావడం లేదు. సామాన్య ప్రజలకు ఈ రాక్షస ధోరణిల నుంచి విముక్తి లభించడం లేదు. దురదృష్ట వశాత్తు ఇలాంటి అనారోగ్య, అనాగరిక వాతావరణలోనే సామాన్య ప్రజలు కాలం వెళ్లదిస్తుండటం ఈ ప్రజాస్వామ్య నికి సంబంధించి ఓ మాయని మచ్చ వంటిది అనే మాట అక్షర సత్యం!. •

# హైడ్రాతో వరద ముంపు తగ్గిందా!



డాక్టర్ సంగని మల్లేశ్వర్

మేఘాలకు చిల్లు పడిందా అన్నట్లు రాష్ట్రంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. చరిత్రలో ఎన్నడూ లేనంత కుంభవృష్టి పడుతోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత పది రోజులుగా కురిసిన జడివానలో దాదాపు అన్ని జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా మారి రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇప్పటికే పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వర్షం ఎప్పుడూ వస్తదో తెలియదు. ప్రాణం ఎప్పుడూ పోతదో తెలియదు అన్న సామెతలా రాత్రింబవళ్లు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరంగల్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని లోతట్టు ప్రాంతం జలమయం అయింది. మహానగరానికి వస్తే మూసి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. సెలవుల్లో ఉన్న అధికారులు సైతం విధుల్లో చేరి అప్రమత్తం చేస్తున్నారు. ఇంకా అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తుంది. ప్రతి రోజు ఎక్కడో ఒకదగ్గర పడుతున్న భారీ వర్షాలకు రాష్ట్రంలో ఉన్న జలపాతాలు సైతం పరవళ్ల తొక్కుతున్నాయి. ఐదు రోజులు వరసగా సెలవుల వల్ల పర్యాటకుల తాకిడి నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు ముందు జాగ్రత్తతో అనుమతించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ పెట్టి ప్రాణనష్టం జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ప్రధానంగా విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల్లో అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం ఒక్కడుగు ముందుకేసి పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీచేసింది. రాష్ట్రంలో జల ప్రళయానికి విలవిలాడింది తెలంగాణ తల్లి. అకాల వర్షాలతో శివుని సిగలోని గంగమ్మకు కోపమొచ్చి చిల్లులు పడిన మేఘాలకు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న అన్నదాతలపై ప్రకృతి కాటేసిందా? అంటే నిజమే అనిపిస్తున్నది. రోజుల వారీగా రాత్రివేళ దంచికొట్టిన వానలతో భారీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో 21.76 సెంటీమీటర్ల అత్యధికంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా సంగెంలో, నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 20సెంటీమీటర్ల వర్షపాతం రికార్డ్ అయింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగారం, తిరుమలగిరిలో అతి భారీ 19 సెంటీమీటర్ల వర్షపాతం, ఆదిలాబాద్ జిల్లా తాంసీ మండలంలో 17.3 నమోదు అయింది. అతి తక్కువ10 సెంటిమీటర్ల వర్షానికి తగ్గకుండా నమోదు అయింది. ప్రకృతి విలయతాండవంతో గోదావరి ప్రాజెక్టులకు వరదతాకిడి ఎక్కువైంది. ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని కిందకి విడుదల చేస్తున్నారు. నగరంలోఉన్న జంట జలాశయాలకు వరద ఉధృతి పెరిగింది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు ఎగువ ప్రాంతాల్లో చెరువులు, వాగులు పొంగి, పొర్లి ప్రవహిస్తుండడంతో గురువారం 10గేట్లను



ఎత్తి దిగువ మూసీ నదిలోకి విడుదల చేసారు. నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్‌కు కూడా భారీగా వరద నీరు చేరుతున్న కారణంగా నాలకు ఇరువైపులా ఉన్న బస్తి వాసులను కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేసారు. రాష్ట్రంలో విస్తారంగా కురిసిన భారీ వర్షాలతో తెలంగాణ రాష్ట్రాన్ని అతలాకుతులం చేసింది. వరద కట్టడిలో హైడ్రా కీలకంగా మారింది. నాడు దుడ్డు ఉన్నోడిదే బఱ్ఱె అన్నట్టుగా ప్రభుత్వ పెద్దల అండదండలతో రహదారులకు అడ్డంగా కట్టుకున్న అనధికారిక నిర్మాణాలను కూల్చివేసి వరద కాలనీలోకి రాకుండా మార్గం సుగమం చేసారు. ప్రకృతి ప్రళయం సృష్టిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఏజెన్సీ (హైడ్రా) తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించింది. గతేడాది ఆర్డినెన్స్‌తో ప్రత్యేక ఏజెన్సీగా హైడ్రా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. విపక్షాల విమర్శలు, వివాదాలను ఎదుర్కొని ప్రభుత్వ స్థలాలు, నీటి వనరులను అక్రమార్కుల చెర నుడి విముక్తి చేసింది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని పెంచిన హైడ్రా రాజకీయ విమర్శలు ఎదుర్కొని, వివాదాల్లో న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటూ వేల కోట్ల భూములను కాపాడింది. అన్యాక్రాంతమైన భూముల్లో ఆక్రమణలను గుర్తించి హైడ్రా నెలమట్టం చేసింది. చెరువుల పునరుద్దరణ, ఎఫ్టీల్ పరిధిలో, బఫర్ జోన్లలోని ఆక్రమణల తొలగింపు ద్వారా వరదనీరు సాఫీగా వెళ్లి విశ్వనగరం ముంపుకు గురికాకుండా ఉందనే అభిప్రాయం ఏర్పడింది. ప్రజలుఅవసరం అయితే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని తీవ్రమైన సూచనలు జారీ చేసింది. ప్రధానంగా సైబరాబాద్ పరిధిలో భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు ప్రజానీకానికి సమాచారం అందిస్తుంది. ఇంకా భారీ వర్షాలు కురిసి సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైతే మహానగరంలో జలప్రళయానికి దారితీసే ప్రమాదం ఉంది. లోతట్టు ప్రాంతాల్లో, నాలాల సమీపంలో నివసించే ప్రజలు ప్రమాదంలో చిక్కుకోకుండా అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించింది. హైడ్రా అంటే కూల్చివేతలకే కాదు నగరంలో విపత్తుల నిర్వహణ కూడా భుజానికెత్తుకుంది. విపక్షాలు చేసిన విష ప్రచారంతో పీకల్లోతు కోపంతో ఉన్న ప్రజలు అభినందించడం ముదావహం. భారీ వర్షాలకు మొన్నటి వరకు బోసిపోయి కనిపించిన చిన్ననీటి వనరులు, ఒక్కసారిగా నీటితో నిండిపోయాయి. వరద నష్టంతో గండ్లు పడిన చెరువులు, కాల్వలు, లిఫ్టుల మరమ్మతు కోసం ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇప్పటికే కేంద్రం వివక్ష కారణంగా యూరియా కొరతపై ఆందోళన చెందితే భారీ వర్షాలతో అన్నదాతల ఆశలు అడియాసలు అయ్యాయి. వ్యవసాయ భూముల్లో నీళ్ల నిలిచి పత్తి, మిర్చి, కంది, మొక్కజొన్న, కూరగాయలు లాంటి పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి మూడు దఫాలుగా వర్షాల కారణంగా పంటలు నీట మునిగి, రైతులకు అపార నష్టం వాటిల్లిందనే అభిప్రాయం నెలకొంది. ఇప్పటికే ప్రతిజిల్లాకు వరదసాయం కోసం కోటిరూపాయల నిధులు ప్రభుత్వం విడుదలచేసింది. వర్షాలు పూర్తిగా తగ్గితేకానీ, అన్నదాతలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయలేరు. అన్నదాతలకు జరిగిన నష్టం మూలిగే నక్కమీద తాటిపండుపడ్డట్టు ప్రభుత్వానికి అదనంగా భారం పడింది. హైడ్రా ద్వారా రియల్ ఎస్టేట్ పడిపోయినదని, రెచ్చగొట్టి గోబెల్స్ ప్రచారం చేసారు. హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై సర్వేఆఫ్ ఇండియా సాయంతో హైడ్రా కొరడా ఝుళిపించడం ప్రారంభించాక చెరువులు, కుంటల కబ్జాల బాగోతం బయటపడింది. హైడ్రా పుణ్యమాని నాలాలో ఆక్రమణలు తొలగించడం వల్ల వరద ముప్పు తప్పిందనే అభిప్రాయం ఉంది. రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు హైడ్రాను విస్తరించాలని రాష్ట్ర ప్రజలు కోరడం గమనార్హం. •

# పార్లమెంటు నిరవధికంగా వాయిదా

## విపక్ష ఎంపీల తీరుపై స్పీకర్ ఓంబిర్లా అసహనం

### ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించిన రాజ్యసభ

### 14లో 12 బిల్లులను ఆమోదించిన లోక్‌సభ



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనపై అసహనం వ్యక్తం చేసిన స్పీకర్ ఓం బిర్లా, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి. దీంతో సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా పరిస్థితి మారకపోవడంతో నివధికంగా వాయిదా వేశారు. అటు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించిన తర్వాత రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రతిపక్ష ఎంపీల తీరుపై స్పీకర్ అసహనం లోక్‌సభ వర్షాకాల సమావేశాల ముగింపు సందర్భంగా నినాదాలు, తగువులు, ప్లకార్డులు ప్రదర్శించడం వంటివి పార్లమెంట్ గౌరవానికి విఘాతం కలిగిస్తున్నాయని స్పీకర్ ఓం బిర్లా విచారం వ్యక్తం చేశారు. సభ్యులంతా మర్యాద, శాంతి, గౌరవం పాటించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తన పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలకు పదే పదే అంతరాయం కలిగించారని విచారం వ్యక్తం చేశారు. దాదాపు నెల రోజులపాటు జరిగిన ఈ సమావేశాల్లో పెద్దగా చర్చ జరగలేదని, దీనిపై అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం మరోవైపు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. బుధవారం లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందగా గురువారం రాజ్యసభలో ఆమోదం లభించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు2025ను ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యుల నిరసనల మధ్య ఎటువంటి చర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం లభిస్తే బిల్లు చట్టరూపం దాల్చనుంది. కేంద్రం ప్రవేశపెట్టిన 14 బిల్లుల్లో 12 బిల్లులకు లోకసభ ఆమోదం జూలై 21 నుంచి ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టిన 14 బిల్లుల్లో 12 బిల్లులకు లోకసభ ఆమోదం తెలిపింది. ఆపరేషన్ సిందూర్‌పై అత్యధికంగా 37 గంటలపాటు జూలై 28, 29 తేదీల్లో ప్రత్యేక చర్చ నడిచింది. ఆగస్టు 18న భారత అంతరిక్ష కార్యక్రమ విజయాలపై కూడా ప్రత్యేక చర్చ మొదలైనా ప్రతిపక్ష ఎంపీల నిరసనల కారణంగా చర్చ పూర్తికాలేదు. ఈ సమావేశాల్లో చర్చించాల్సిన జాబితాలో 419 ప్రశ్నలు ఉన్నా, కేవలం 55 ప్రశ్నలపై మాత్రమే చర్చ జరిగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చ చేపట్టాలంటూ ప్రతిపక్షాలు సభ మొదలైన నాటి నుంచి రోజూ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. మరోవైపు ప్రతిపక్షాల నిరసనల మధ్యే కేంద్రం 14 బిల్లులను సభలో ప్రవేశపెట్టగా అందులో 12 బిల్లులకు ఆమోదం తెలిపింది. గోవా అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్యం పునర్వ్యవస్థీకరణ బిల్లు 2025. మర్చంట్ షిప్పింగ్ బిల్లు 2025. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు 2025. మణిపూర్ కేటాయింపుల (నం.2) బిల్లు, 2025. జాతీయ క్రీడా పాలన బిల్లు 2025. జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025. ఆదాయపు పన్ను బిల్లు 2025. పన్ను చట్టాలు (సవరణ) బిల్లు 2025. ఇండియన్ పోర్ట్స్ బిల్ 2025. గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు 2025. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025. ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్, నియంత్రణ బిల్లు 2025.

# ట్రంప్ శాంతి చర్చల వేళ..

## - ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడిన రష్యా

## - 574 డ్రోన్లతో భారీ దాడి



**కీవ్, ఆగస్టు 21:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీనిపై ఇరు దేశాల అధినేతలతో భేటీ అయి చర్చలు కూడా జరిపారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దాదాపు 500కు పైగా డ్రోన్లతో రష్యా విరుచుకుపడిందని కీవ్ ఆరోపించింది. ఉక్రెయిన్ వైమానిక దళం ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. తమ దేశంలోని పశ్చిమ ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలిపింది. 574 డ్రోన్లు, 40 క్షిపణులు తమవైపు దూసుకువచ్చాయని వెల్లడించింది. రష్యా చేసిన వైమానిక దాడుల్లో ఈ యేడాది ఇదే అతిపెద్దదని పేర్కొంది. ఈ దాడుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. 15 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. కాగా.. పశ్చిమ ఉక్రెయిన్‌లోని ప్రధాన అమెరికన్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థపై రష్యా దాడి చేసిందని ఆ దేశ విదేశాంగమంత్రి ఆండ్రీ సిబిహా పేర్కొన్నారు. అయితే, దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. సుమారు నాలుగేళ్లుగా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. దీని ముగింపునకు ఇటీవల కీలక అడుగులు పడ్డాయి. అలాస్కా వేదికగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ భేటీ అయి కీవ్‌లో శాంతి నెలకొల్పడంపై చర్చించారు. ఆ చర్చల్లో ఎలాంటి ఒప్పందం జరగనప్పటికీ.. అవి సానుకూలంగా జరిగాయని ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ క్రమంలో వాషింగ్టన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోపాటు యూరోపియన్ నేతలతో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌తోపాటు ఐరోపాకూ అమెరికా మధ్య త్రైపాక్షిక భేటీ ఏర్పాటు చేస్తానని ట్రంప్ చెప్పారు. ఇది ఎప్పుడు, ఎక్కడ ఉంటుందనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో రష్యా దాడులు చేయడం గమనార్హం.

# బైక్ టాక్సీ లగ్జరీ కాదు.. అవసరం: కర్ణాటక హైకోర్టు



**బెంగళూరు, ఆగస్టు 21:** రాష్ట్రం ప్రభుత్వం బైక్ టాక్సీలపై నిషేధం విధించడాన్ని కర్ణాటక హైకోర్టు తప్పుబట్టింది. బైక్‌టాక్సీ లగ్జరీ కాదని నగర ప్రజలకు అది అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభు బఖ్రు నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. మధ్యతరగతి ప్రజలకు బైక్‌టీక్సీలు ఎంతో ఉపయోకరమైనవి. దేశంలోని దాదాపు 13 రాష్ట్రాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. మోటారు వాహనాల చట్టం బైక్‌టాక్సీలను నిషేధిస్తుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. బైక్ టాక్సీలపై నిషేధం విధించడంవల్ల వాటిపైనే ఆధారపడిన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడతాయని, ప్రజల జీవనోపాధి హక్కును పూర్తిగా హరించే అధికారం ఎవరికీ ఉండదని ఆగ్రహం వ్యక్తంచేసింది. బైక్‌టాక్సీలను మినహాయించడానికి రాష్ట్రం ఉద్దేశపూర్వకంగా విధాన వైఖరిని తీసుకుందా అని కోర్టు ప్రశ్నించింది. బైక్‌టాక్సీ డ్రైవర్లపై ప్రస్తుతానికి ఎటువంటి బలవంతపు లేదా శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా చూసుకోవాలని అడ్వకేట్ జనరల్‌కు న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 22కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేయాలని సూచించింది. కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్లు బైక్ టాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. చట్టబద్ధమైన, సురక్షిత కార్యకలాపాలను కొనసాగించడానికి తాము ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.



# నటి ఆరోపణలతో కేరళ యూత్ కాంగ్రెస్ చీఫ్ రాహుల్ మామకుటత్తిల్ పదవికి రాజీనామా!

**తిరువనంతపురం, ఆగస్టు 21:** కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి ఆరోపణలు కలకలం రేపాయి. దీంతో ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాహుల్ మామకుటత్తిల్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగానూ ఉన్నారు. అదూర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తన రాజీనామాను ప్రకటించారు. తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తున్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమె నేరుగా ప్రస్తావించనప్పటికీ బిజెపి, సిపిఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపిస్తున్నాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపడుతున్నాయి. ఈ వ్యవహారంపై పార్టీలో అంతర్గత విచారణ చేపట్టినట్లు, దోషులు తప్పించుకోలేరని కాంగ్రెస్ సీనియర్ నేత విడి సతీశన్ ప్రకటించారు. ఈ పరిణామాల నడుమే యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు. 'నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను వారెవరూ నన్ను రాజీనామా చేయాలనిడిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేను కాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదు' అని పేర్కొన్నాను.

# భావజాల శత్రువు బిజెపి.. రాజకీయ విరోధి డిఎంకె

## మదురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తా: టివికె అధ్యక్షుడు విజయ్



**చెన్నై, ఆగస్టు 21:** తమ భావజాల శత్రువు బిజెపి.. రాజకీయ విరోధి డిఎంకె అని టివికె అధ్యక్షుడు, నటుడు విజయ్ పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకెకు, తమ పార్టీ టివికెకు మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపు తడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికకల సన్నాహాలను ఉద్ధృతం చేసిన ఆయన.. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఈ మేరకు ప్రసంగించారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. తాను మదురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. 'కులం కాదు.. మతం కాదు.. తమిళుడికే ప్రాధాన్యం ఇస్తాం. బిజెపితో పొత్తు ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీ పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి? తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. మీరు కచ్చతీవు దీవులను తీసుకురాగలరా? అని ప్రధానిని ప్రశ్నించారు. బిజెపి తన సైద్ధాంతిక శత్రువని..డిఎంకె రాజకీయ ప్రత్యర్థి అని విజయ్ స్పష్టం చేశారు. టివికె తక్షణ రాజకీయ లాభం కోసం స్థాపించలేదని.. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పోరాడుతుందన్నారు. టివికె చీఫ్ తన ప్రసంగంలో సామాజిక సమస్యలను ప్రస్తావించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతే తమ పార్టీ తొలి ప్రాధాన్యమని.. రైతులు, యువత, లింగమార్పిడి సమాజం, నిస్సహాయ వృద్ధులు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి ప్రత్యేక మద్దతు ఇచ్చే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉందని విజయ్ అన్నారు. విజయ్ తన ప్రసంగాన్ని 'సింహం ఎప్పుడూ వినోదం కోసం బయటకు రాదు.. వేటాడేందుకు బయటకు వస్తుంది' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. టివికె కేవలం రాజకీయాల కోసం కాదని.. ప్రజల కోసం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందని విజయ్ సందేశమిచ్చారు. 2024 ఫిబ్రవరిలో టివికెను స్థాపించినప్పటి నుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గతేడాది విల్లుపురం జిల్లాలో విక్రవందిలో తొలి సభ నిర్వహించారు.

# ఆస్పత్రి నుంచి నవీన్‌పట్నాయక్ డిశ్చార్జ

## బిజెడి చీఫ్ కృతజ్ఞతలు



**భువనేశ్వర్, ఆగస్టు 21:** ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజు జనతా దళ్ (బిజెడి) అధినేత నవీన్ పట్నాయక్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అస్వస్థత కారణంగా ఆస్పత్రిలో చేరిన ఆయన మూడు రోజుల అనంతరం బుధవారం సాయంత్రం డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా తాను త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ బీజేడీ చీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 17న ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి (ఆగస్టు 16) నవీన్ పట్నాయక్ అసౌకర్యానికి గురికావడంతో వైద్యులు ఆయన నివాసానికి వెళ్లి పరీక్షి ంచారు. అయితే, పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం తర్వాత భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. నవీన్ పట్నాయక్ డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. చికిత్సకు సహకరిస్తున్నారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపాయి. ఇక మూడు రోజులు చికిత్స అనంతరం నిన్న సాయంత్రం నవీన్ పట్నాయక్ డిశ్చార్జ్ అయ్యారు. కొంతకాలంగా వయసు సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, ఇటీవలే ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. ఆర్థరైటిస్ సమస్య కారణంగా వెన్నెముకకు జూన్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే, రెండు నెలల్లోనే ఆయన అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సుదీర్ఘకాలం ఒడిశా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నవీన్ పట్నాయక్, వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించారు. మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు ఆయన సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే, 24 ఏళ్లు ఒడిశాకు సీఎంగా సేవలందించిన నవీన్ పట్నాయక్ దూకుడుకు బీజేపీ అడ్డుకట్టవేసింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజు జనతాదళ్ పార్టీ పరాజయం పాలైంది. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం కొలువుదీరింది.

# రైళ్ల టాయిలెట్లలో నీళ్ల సమస్య..

## యేడాదిలో లక్ష ఫిర్యాదులు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారతీయ రైల్వేలో ప్రయాణికుల సమస్యలకు సంబంధించి భారీ స్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక ఏడాదికాలంలో టాయిలెట్‌లు, వాష్ బేసిన్‌లలో నీళ్లలేవని పేర్కొంటూ లక్ష ఫిర్యాదులు వచ్చినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికను కాగ్ పార్లమెంటుకు అందించింది. సుదూరం ప్రయాణించే రైళ్లలో పరిశుభ్రతకు సంబంధించి 2018-19 నుంచి 2022-23 వరకు భారతీయ రైల్వే పనితీరుపై కాగ్ నివేదిక రూపొందించింది. ఇందులో భాగంగా కేవలం ఒక్క 2022-23ఏడాదిలోనే టాయిలెట్లు, వాష్‌బేసిన్‌లలో నీళ్ల లేవని 1,00,280 ఫిర్యాదులు వచ్చినట్లు గుర్తించింది. వీటిలో 33,937 కేసులను సకాలంలో పరిష్కరించినట్లు తెలిపింది. నిర్దేశిత స్టేషన్లలో నీరు నింపడంలో వైఫల్యం కారణంగానే ఈ సమస్య తలెత్తుతున్నట్లు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. అయితే ఆన్‌బోర్డు హౌస్‌కీపింగ్ సర్వీసులపై మాత్రం ప్రయాణికులు సంతృప్తితో ఉన్నట్లు తెలిపింది.

# నేపాల్ అభ్యంతరాన్ని తోసిపుచ్చిన భారత్

## చైనాతో సరిహద్దు వాణిజ్యం సబబేనన్న విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారత్-చైనా మధ్య సరిహద్దు వివాదాలు తగ్గించుకుంటున్న క్రమంలో తెరపైకి నేపాల్ వచ్చింది. లిపులేఖ్ కనుమ ద్వారా చైనాతో భారత్ సరిహద్దు వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించడంపై నేపాల్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వశాఖ నేపాల్ అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఈ విషయంలో నేపాల్ వాదనలు అసమగ్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. భారత్-చైనా మధ్య సరిహద్దుల్లో ఘర్షణలను తగ్గించుకునేందుకు ఇరుదేశాలు చర్చలద్వారా ముందుకు సాగుతున్నాయి. ఈక్రమంలో హిమాలయ పర్వత ప్రాంతం ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ ప్రాంతం మీదుగా వాణిజ్య సరిహద్దులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలిపింది. ఈ క్రమంలో నేపాల్ వ్యవహారంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. లిపులేఖ్ కనుమ ద్వారా భారత్, చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం 1954లో ప్రారంభమైంది. ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉంది. ప్రాదేశిక వాదనలను ఏకపక్షంగా విస్తరించడం సాధ్యం కాదు. వాణిజ్య మార్గంపై కఠ్మాండు ప్రాదేశిక వాదన అనుకూలమైనదికాదు. చారిత్రక వాస్తవాలు అధారంగా లేవు. కోవిడ్, ఇతర పరిణామాల కారణంగా వాణిజ్యానికి ఇటీవలి సంవత్సరాల్లో అంతరాయం కలిగింది.

# చైనా సమీపంలో ఉత్తర కొరియా క్షిపణి స్థావరం

**ప్యాంగ్‌యాంగ్, ఆగస్టు 21:** ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తతలు నెలకొంటున్న సమయంలో తమ అణ్వాయుధ శక్తిని విస్తృతం చేయడానికి ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ పలు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఉత్తర కొరియా ఆయుధ సంపత్తికి సంబంధించిన మరో విషయం వెలుగులోకి వచ్చింది. కిమ్ సేనలు చైనా సమీపంలోని తమ రహస్య స్థావరంలో దీర్ఘశ్రేణి క్షిపణులు, అధునాత ఆయుధాలను మోహరించినట్లు పలు నివేదికలు ఉన్నట్లు తెలుస్తోంది. చైనా సరిహద్దు నుంచి 27 కి.మీ. దూరంలో ఉన్న సిన్‌పుంగ్‌లోని స్థావరంలో అణ్వాయుధ సామర్థ్యంగల ఆరునుంచి తొమ్మిది ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, వాటి మొబైల్ లాంచర్‌లతో ఉత్తర కొరియా ఓ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీనిద్వారా కిమ్ ప్రభుత్వం తమ సైనిక, అణుసామర్థ్యాలను వేగంగా మరింత విస్తరించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ప్రస్తుతం అంచనాల ప్రకారం.. సంక్షోభం లేదా యుద్ధసమయాల్లో, ఈ లాంచర్లు, క్షిపణులను రహస్య స్థావరం నుంచి తరలించి ప్రత్యేక వార్‌హెడ్ నిల్వ, రవాణా యూనిట్లలో చేర్చే అవకాశం ఉంది. అయితే ఇలాంటి ప్రమాదకర ఆయుధాలతో తూర్పు ఆసియా, అమెరికాకు ముప్పు పొంచి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.
ఇటీవల అమెరికా, దక్షిణకొరియా చేపట్టిన సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ప్రత్యర్థుల సైనిక కసరత్తులు శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని, యుద్ధాన్ని ప్రేరేపించేలా ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి మునుపటికంటే ఎక్కువ ఉద్రిక్తతలు పెంచేవిగా ఉన్నాయని, వాటికి దీటుగా ప్రతిస్పందించేందుకు తమ అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రహస్య స్థావరం గురించి వార్తలు బయటకు రావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇపిఎఫ్ 'డెత్ రిలీఫ్' ఫండ్ రూ. 15 లక్షలకు పెంపు

## నిబంధనలలో మార్పులు చేసిన భవిష్యనిధి సంస్థ

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఇపిఎఫ్ఒ ఖాతాదారులకు గుడ్‌న్యూస్. సర్వీస్‌లో ఉన్నప్పుడు చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను ఇపిఎఫ్ఒ భారీగా పెంచింది. ప్రావిడెంట్ ఫండ్ అనేది ఉద్యోగులకు బంగారు నిధిలాంటిది. దేశంలో పనిచేసే దాదాపు ప్రతి ఉద్యోగికి పిఎఫ్ ఖాతా తప్పనిసరిగా ఉంటుంది. పిఎఫ్‌కు సంబంధించి ఇపిఎఫ్ఒ ఎప్పటికప్పుడు మార్పులు తీసుకొస్తుంటుంది. తాజాగా ఇపిఎఫ్ఒ ఖాతాదారు లకు, వారి కుటుంబ సభ్యులకు గుడ్‌న్యూస్ చెప్పింది. పిఎఫ్ ఖాతాదారుడు మరణిస్తే అతని కుటుంబానికి లభించే డెత్ రిలీఫ్ ఫండ్‌నుభారీగా పెంచింది. గతంలో ఉన్న రూ.8.8 లక్షలనుంచి రూ. 15 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మొత్తాన్ని సిబ్బంది సంక్షేమ నిధి నుంచి ఇవ్వనున్నట్లు వెల్లడిం చింది. ఈ కొత్త నిబంధన 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. అంటే ఎవరైనా ఉద్యోగి ఈ తేదీ తర్వాత మరణిస్తే, అతని కుటుంబానికి రూ. 8.8 లక్షలకు బదులుగా రూ. 15 లక్షలు వస్తాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నుంచి ఈ మార్పుకు ఆమోదం లభించింది. ఈ మేరకు ఆగస్టు 19న సర్క్యులర్ జారీ చేసింది.

**ఇపిఎఫ్ఒ సర్క్యులర్‌లో ఏముందంటే..**

'డెత్ రిలీఫ్ ఫండ్ కింద ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.8.80 లక్షలనుంచి రూ.15లక్షలకు పెంచడానికి సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్/ ప్రెసిడెంట్, సెంట్రల్ స్టాఫ్ వెల్ఫేర్ కమిటీ, ఎంప్లాయిస్ ప్రావి డెంట్‌ఫండ్ ఆర్గనైజేషన్ ఆమోదం లభించింది. సెంట్రల్‌బోర్డ్‌లో మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు (నామినీ లేదా చట్టపరమైన వారసులు) సిబ్బంది సంక్షేమ నిధి నుంచి రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియాను చెల్లించాలి' అని ఇపిఎఫ్ఒ సర్క్యులర్‌లో పేర్కొంది. అలాగే ఇపిఎఫ్ఒ మరో గుడ్‌న్యూస్ కూడా చెప్పింది. 2026 ఏప్రిల్1నుంచి ఈ ఎక్స్‌గ్రేషియా ప్రతియేటా 5శాతం పెరుగుతుందని వెల్లడించింది. దీంతో మృతులకుటుంబాలకు అందించే ఆర్థిక సహాయం కాలక్రమేణా పెరుగుతుంది.

**2025లో ఇపిఎఫ్ఒలో ప్రధాన మార్పులు**

పీఎఫ్ ఖాతాదారుడు మరణించిన తర్వాత డబ్బు మైనర్ పిల్లలకు చెందాల్సి వస్తే, డెత్ క్లెయిమ్ ప్రక్రియను ఇప్పుడు మరింత సులభతరమైంది. ఇంతకుముందు గార్డియన్ షిప్ సర్టిఫికేట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉండేది. దీంతో క్లెయిమ్ ప్రక్రియ ఆలస్యమయ్యేది. కానీ, ఇప్పుడు ఈ నిబంధనను తీసేశారు. ఈ మార్పుతో మైనర్ పిల్లలు డబ్బును త్వరగా పొందొచ్చు.

## సంక్షిప్తంగా..

### అంతరిక్ష సమాచారం గగన్‌యాన్‌కు ఎంతో ఉపయోగం : శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** అంతరిక్షయానం కోసం చాలా శిక్షణ తీసుకున్నట్లు భారత వ్యోమగామి కెప్టెన్ శుభాంశు శుక్లా తెలిపారు. ఢిల్లీలో ఆయన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అంతరిక్షంలో తన అనుభవాలను పంచుకున్నారు. 'ఇది దేశం మొత్తానికి చెందిన మిషన్. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న దానికంటే అంతరిక్షంలో అనుభవం చాలా భిన్నంగా ఉంటుంది. అక్కడి నుంచి చూస్తే భూమి చాలా అద్భుతంగా కనిపించింది. యాక్సియ ం మిషన్ కోసం చాలా కష్టపడి పనిచేశాం. మన శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడ్డారు. ఐఎస్ఎస్ నుంచి కొన్ని ఫొటోలో తీసుకొచ్చాం. ఏడాదిగా ఈ మిషన్ కోసం ఎంతో సమాచారం సేకరించాను. ఈ సమాచారం గగన్‌యాన్ మిషన్‌కు ఉపయోగపడుతుంది. ప్రతి భారతీయుడి కలను నెరవేర్చడం నాకు గర్వ కారణం' అని తెలిపారు. 'అంతరిక్షయానం కోసం శరీరాన్ని సిద్ధం చేసుకోవడం మరచిపోలేని అనుభవం. అంతరిక్షయానం ఎంతో జ్ఞానాన్ని ఇచ్చింది. ఈ మిషన్‌ను చేపట్టడంపై భారత ప్రభుత్వానికి, ఇస్రోకు, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు' అని శుభాంశు తెలిపారు. ఇక డిసెంబర్‌లో తొలి గగన్‌యాన్ టెస్టు మిషన్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని ఇస్రో చీఫ్ వి.నారాయణన్ తెలిపారు.

### ఢిల్లీ సిఎం రేఖా గుప్తాకు జెడ్ కేటగిరీ భద్రత



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై జరిగిన దాడి ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటనపై స్పందిస్తూ రేఖా గుప్తాకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ రోజు ఉదయం సిఆర్పీఎఫ్ బలగాలు సిఎం నివాసానికి చేరుకున్నాయి. సిఎం భద్రత బాధ్యతలను ఢిల్లీ పోలీసుల నుంచి స్వీకరించాయి. సిఎం వ్యక్తిగత భద్రతతో పాటు సిఎం నివాసానికి, క్యాంపు కార్యాలయానికి 24 గంటలూ భద్రత కల్పించేందుకు అధికారులు అదనపు బలగాలను మోహరించారు. జెడ్ కేటగిరీ భద్రతలో 20 మందికి పైగా సిబ్బంది, స్పెషల్ గార్డులు, డ్రైవర్లు, ఎస్కార్ట్ వామనాలను ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు సమకూర్చారు. కాగా, ఢిల్లీ సిఎంరేఖా గుప్తా 'జన్ సున్ వాయి' కార్యక్రమం నిర్వహిస్తుండగా ఆమెపై దాడి జరిగిన విషయం తెలిసిందే. తన సమస్యలు చెప్పుకోవడానికి వచ్చినట్లు నటించిన ఓ వ్యక్తి ఆమె చెంపపైకొట్టాడు. వెంటనే స్పందించిన సిఎం సెక్యూరిటీ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. సిఎంను ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

### నా పోరాటం మహిళల కోసమే: మలయాళ నటి రిని జార్జ్

**పాలక్కాడ్ (కేరళ), ఆగస్టు 21:** నా పోరాటం ఏ వ్యక్తిపైనా కాదు, నా పోరాటం మహిళల కోసమే అని కేరళ టివి జర్నలిస్ట్, సినీ నటి రిని ఆన్ జార్జ్ చెప్పారు. పాలక్కాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, యువ జన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ మమ్‌కూటథిల్ తన పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'నాపోరాటం మహిళల కోసమే, ఏ వ్యక్తికి వ్యతిరే కంగా కాదు. మహిళలు ముందుకువచ్చినప్పుడు, సమాజం దానివెనుకఉన్న సత్యాన్ని గుర్తించి అర్థం చేసుకోవాలి. మొదట్లో, నేను మాట్లాడినప్పుడు, నన్ను కొంతమంది అవమానించారు. కానీ తరువాత చాలా మంది ఇతరులు కూడా ఫిర్యాదులతో ముందుకు రావడం ప్రారంభించారు.' అని రిని చెప్పారు. ఇది ఏ రాజకీయ పార్టీచే స్పాన్సర్ చేయబడలేదని కుండబద్దలు కొట్టిన రిని తన ఆరోపణల వెనక ఎలాంటి కుట్ర, ఇతరుల ప్రోద్బలం లేదన్న విషయాన్నిచెప్పకనే చెప్పారు. 'నేను ఏ వ్యక్తిని లేదా సంస్థను లక్ష్యంగా చేసుకోవడానికి ఇక్కడలేను. ఇది సమాజంలోని తప్పుడుధోరణులకు వ్యతిరేకంగా. ఒక రాజకీయ నాయకుడు ఎలా ఉండాలనే దాని గురించి నా ఆందోళన. ఇది ఒక వ్యక్తి గురించి కాదు. అలాంటి పరిస్థితులు తలెత్తినందుకు నేను ఎంతో బాధ పడ్డాను.' అని జార్జ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. రిని జార్జ్ తన ప్రకటనలో ఇంకా ఏమన్నారంటే.. 'రాజీనామాలు వంటివి నైతిక ప్రాతిపదికన ఉండాలి. ఆ వ్యక్తిలో స్వతహాగా మంచి మార్పులు రావాలి. నేను ఇప్పటికీ అతన్ని మంచి స్నేహితుడిగా భావిస్తున్నాను. కానీ సమాజానికి మంచి చేయడానికి రాజకీయ నాయకులు అవసరం. దానిని వారు గుర్తుంచుకుని మెలగాలి. సన్మార్గంలో మెలగాలి' అని ఆమె అన్నారు.

# భారీగా పెరిగిన టమాటా ధరలు

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టమాటా ధరలు భారీగా పెరిగాయి. మొన్నటి వరకు ధరలు పడిపోయి కిలో టమాటా ధర రూ.20 నుంచి 30 ఉండగా, తాజాగా ఒక్క సారిగా పెరిగింది. ప్రస్తుతం హోల్ సేల్ మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.60 నుంచి 70పలుకుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కు రాష్ట్రంతో పాటు, వివిధ రాష్ట్రాల్లో సైతం టమాటా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో డిమాండ్‌కు తగ్గ టమాటా లేకపోవడంతో దాని ప్రభావం ధరలపై పడి ఈ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో కూడా వర్షాలకు తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది. దీంతో రాష్ట్రానికి వచ్చే టమాటా సరఫరా కూడా ఆగిపోవటం ధరల పెరుగుదలకుకారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు గతంతో పోల్చితే సగం మాత్రమే దిగుమతి అవుతోంది. మరికొన్ని రోజులపాటు వర్షాలు ఇలాగే కొనసాగితే పంట తీవ్రంగా దెబ్బ తినే అవకాశంఉందనే ఆందోళనవ్యక్తమవు తోంది. దీంతో దిగుబడి తగ్గిధరలు మరింత పెరిగే అవ కాశం ఉందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

# సర్కార్ దృష్టికి గిరిజన రైతుల సమస్యలు

## రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని గిరిజన రైతుల సమస్యలు పరిష్కరిం చడానికి కృషి చేస్తానని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు. ఇందుకు గాను గిరిజన రైతు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. హైదరా బాద్‌లోని తమ కార్యాలయంలో గిరిజన రైతులు సాగు సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గెట్టు సమస్యలు ఉన్నచోట రీసర్వే వెంటనే జర గాల్సి న అవసరం ఉందన్నారు. అటవీ హక్కుల చట్టంలో పేర్కొన్న విధంగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ రికా ర్డును రెవెన్యూ రికార్డును అనుసంధానం చేయడం ద్వారా చాలా వరకు గిరిజన రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. భూ భారతి చట్టాన్ని గిరిజన ప్రాంతంలో అమలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. బ్యాంకర్లు కూడా అటవీహక్కుల రికార్డు ఆధా రంగా రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఫారెస్టు సెటిల్మెంట్ ప్రక్రియ త్వరతిగతిన పూర్తి చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని వెల్లడించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులతో పాటు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఫారెస్ట్ డీసీఎఫ్ రాజారమణ రెడ్డి, సీసీఎల్‌ఏ, ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ తదితర అధికారులు హాజరయ్యారు.

# ప్రభుత్వాల వైఫల్యం వల్లే యూరియా కొరత

## తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే రాష్ట్రంలో యూరియా కొరతా ఏర్పడి రైతులు అష్ట కష్టాలు పడుతు న్నారని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వాలకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో రైతులు ఒక్క యూరియా బస్తా కోసం తిండి తిప్పలు లేక క్యూలైన్లు కడుతున్నారని ఏ రాష్ట్రం లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎం దుకు ఉందో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో యూరి యాను నిలువవుంచి రైతులకు ఎన్ని బస్తాలైనా అందజేసేవారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని. రైతులు ఒక్క యూరియా బస్తా కోసం రోడ్డు ఎక్కే దుస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి ఇస్తున్నట్లు ప్రకటించిందని ఇది సరిపోదని రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఇచ్చి రైతుల కష్టాలను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి బండి సంజయ్ లు మిగతా బిజెపి ఎంపీలు యూరియా కొరతపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు.

# ఎస్‌జిటిలకు పిఎస్‌హెచ్‌ఎం పదోన్నతులివ్వాలి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21:** రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యా యులుగా బిఇడి అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జిటి)కి అవకాశం కల్పించాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాం డ్ చేశారు.

ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి గురువారం ఎమ్మెల్సీ బాధిత ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం సమర్పిం చారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యుల (పిఎస్‌హెచ్‌ఎం) పదోన్నతుల విషయంలో బిఇడి అర్హత కలిగిన ఎస్‌జిటిలకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అర్హతలు, సీనియారిటీ, అనుభవం ఉన్నప్పటికీ బిఇడి ఉపాధ్యాయులను పదోన్నతుల నుండి వంచించడం తీవ్రమైన అన్యాయమన్నారు. పదోన్నతులు కల్పించకపోవడంతో అర్హులైన ఎస్‌జిటిల్లో నిరుత్సాహం పెరుగుతోందన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే తెలంగాణ హైకోర్టు (డబ్ల్యూపి నంబర్ 24087/2025, డేట్ 14.08.2025)లో పిటిషన్ కొనసాగుతోందని నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించినందున, వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు.

# యూరియా ఇచ్చినవాళ్లకు కెటిఆర్ సపోర్టా!

## వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** యూరియా ఇచ్చినవాళ్ళకు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సపోర్టు చేస్తామంటూ కెటిఆర్ చేస్తున్న వ్యాఖలు ఆయన రాజకీయ అజ్ఞానంకు నిదర్శనం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యాక్రమంలో పాల్గొని విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపిం చాలని సిఎం రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ చేస్తున్నారని ఐతే బిజెపితో కుమ్మక్కై కెటిఆర్ అలా మాట్లాడు తున్నారని ఆరోపించారు. 30 రోజులు జైల్లో ఉంటే అనర్హులు బిల్లును మేము వ్యతిరేకిస్తున్నా మని చెప్పారు. ఓట్ చోరీని కప్పి పుచ్చుకోవడానికి ఆ బిల్లును తెచ్చారని ఆయన తెలిపారు. దొంగ నాటకాలను బయట పెట్టడానికి రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని ఆయన అన్నారు. రాజ్యాంగ హక్కులను కాపాడడానికి యువ నేత రాహుల్ గాంధీ ముందు ఉండి ప్రజల తరుపున పోరాటంచేస్తున్నారని ఆయన అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు రాజ్యాంగహక్కుల కోసం పోరాటం చేస్తాం అని ఆయన వివరిం చారు. ఇడి, సిబిఐలను అడ్డం పెట్టుకొని మోడీ రాజ కీయ కక్షలతో దాడులు చేస్తున్నారని ఆరో పించారు. యూరియా రాష్ట్రానికి రావాల్సి న వాటా కోసం ఎంపీలు పోరాటం చేస్తున్నారు. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ను దోచుకొని మనకు చిప్ప చేతుల్లో పెట్టారు. సిఎంరేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క జోడెద్దుల్లాగా పాలన సాగిస్తున్నారుప్రజా సమస్యలపై 20 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువ అప్లికేషన్లు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చాయి. ప్రతి నియో జకవర్గంలో 3,500ఇండ్లు ఇచ్చాం త్వరలో వాటి ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు.

# 106 కేజీల గంజాయి, మారణాయుధాలు స్వాధీనం

## వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి




పట్టుబడిన గంజాయి, మారణాయుధాలతో ఎక్సైజ్ పోలీసులు

**పాల్వంచ టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** పాల్వంచ మీదుగా చెన్నై తిరుచ్చికి రూ.53 లక్షల ఖరీదు చేసే 106 కేజీల నిషేధిత గంజాయిని, మారణ ఆయుధాలను ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధి కారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. ఎక్సైజ్ అండ్ ప్రొఫెషన్ శాఖ కమిషనర్ హరి కిరణ్, డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ షా నవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు పాల్వంచలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐచర్ వ్యాన్ లో 53 లక్షల ఖరీదు చేసే 106 కేజీల గంజాయి, అలాగే మరొక వాహనంలో ఒక పిస్తోళ్, 5 రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లు, రూ.35,500లు నగదు లభించినట్లు చెప్పారు. అక్రమ రవాణా వ్యక్తులు కేరళ రాష్ట్రం ఎర్నాకులం వెలుకొండం నావల్ ఆర్నమెంట్ కు చెందిన వి ఎస్ బిలాల్, తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి తొరియూర్ కు చెందిన శ్యాంసుందర్, ఇదే రాష్ట్రానికి చెందిన కాశీ నందన్ సంతోష్ లు పట్టుబడగా, తమిళనాడు తిరుచ్చి కి చెందిన జేమ్స్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. సదరు వ్యక్తులను ప్రశ్నించగా ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని లోడు చేసుకొని పాల్వంచ మీదుగా చెన్నై తిరుచ్చికి, మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో అక్రమంగా మారణాయుధాలను కొనుగోలు చేసి కేరళలోని కొచ్చికి తరలిస్తున్నట్లు నిందితులు వివరించినట్లు ఆయన చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, ఇన్స్పెక్టర్ ఎం రమేష్, సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీహరి రావు, సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజ య్, హరీష్ , వీరబాబు, ఉపేందర్ లను ఆయన అభినందించారు. విలేకరుల సమా వేశంలో జనార్దన్ రెడ్డి తో పాటు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తిరుపతి, జానయ్య పాల్వంచ సీఐ ప్రసాద్ లు పాల్గొన్నారు

# కెటిఆర్! అహంకారం తగ్గించుకో

## దేశ స్వాతంత్రం కోసం కాంగ్రెస్ పోరాటం చేసింది: ఆర్అండ్‌బి మంత్రి వెంకటరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు21,ప్రభాతవార్త:** దేశ స్వాతం త్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని దర్టీ పార్టీ అని మాట్లాడడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెం కటరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. తెలం గాణ ఇచ్చిన పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా? నీ తండ్రిని అడుగు మా పార్టీ గురించి చెప్తాడు అన్నారు. నీ తండ్రి కెసిఆర్, నువ్వు నీ కుటుంబం తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ దగ్గర గ్రూప్ ఫోటో దిగింది మర్చిపో యారా? అని ప్రశ్నించారు. మా పార్టీ పోటీకి నిలిపిన ఉప రాష్ట్రపతి అభ్యర్థిని దేశం మొత్తం హర్షిస్తుంది. సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టు జడ్జిగా ఉంటూనే తెలంగాణ రాష్ట్రఏర్పాటు కోసం గళం ఎత్తిన న్యాయ కోవిదుడని పేర్కొన్నారు. తెలం గాణబిడ్డ ఉప రాష్ట్రపతి అవ్వడం మీకు ఇష్టం లేదు. మీ తెలంగాణ వాదంపై సందేహాలు తలెత్తు తున్నాయి. తెలంగాణ బిడ్డను వ్యతిరేకిం చిన మిమ్మల్ని తెలంగాణ ప్రజలు క్షమించరని హెచ్చ రించారు. లక్షల కోట్ల అవినీతి చేసి ఆ డబ్బు ఉం దని కళ్ళు నెత్తికెక్కి కాంగ్రెస్ పై మాట్లాడుతున్నావ్ అహంకారపూరితమైన మాటలు ఇక మాట్లాడకు అని ఆయన అన్నారు. దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం పై చులకనగా మాట్లాడడం, అమెరికాలో చదివిన నీ చదువు విజ్ఞతకు వదిలేస్తున్నా అని అన్నారు. నాడు ప్రపంచలోనే ద బెస్ట్ పిఎం రాజీవ్‌గాంధీ అనిపించుకున్నారు దేశ ఐక్యత కోసం భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ చేశారని కొనియాడారు. యూరియా ఎందుకు రావట్లేదో నీకు అంత మాత్రం తెలియదా? కేంద్రం ఇవ్వాల్సింది ఇవ్వకుండా చేస్తుంటే నువ్వు అది మాట్లాడక పోగా, అజ్ఞానంతో మాట్లాడుతున్నావని ఆయన అన్నారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఇస్తే దానిపై క్యాబినెట్ లో చర్చించాం, అవినీతి చేయకుంటే ఢిల్లీ నుండి లాయర్లను తెప్పించి హైకోర్టు కు ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. మీ అవినీతి ప్రజల ముందు పెడతామనిహెచ్చరించారు. మీకు ఏ శిక్ష వేయాలో ప్రజలే నిర్ణయిస్తారజగదీష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయికి నేను దిగజారలేదని ఆయన అన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఒక్కనాడు మహాత్మగాంధీ యూనివర్సిటీ కి పోలేదు. నేను ఇప్పుడు లా, ఫార్మసీ కోర్సులు కొత్తగా తెచ్చాను. వైటిపిఎస్ మీద విచారణ జరుగుతుంది. ఆయన వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తెలుస్తాం. ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురించి, నా గురించి మాట్లాడేంత స్థాయా ఆయనది అన్నారు. నల్గొం డకు ఏం చేసాము ప్రజలకు తెలుసు త్వరలోనే నీ బాగోతం బయటపడుతుందని హెచ్చరించారు.

# తెలంగాణ గ్రామీణాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలి

## కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు21, ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామీణాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సింగ్‌కు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ సచివాలయం నుండి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలు సజావుగా జరుగుతోందని, కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని అన్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజనలో భాగంగా కేంద్రం కేటాయించిన రూ.368.7 కోట్లలో ఇప్పటివరకు రూ.129.64 కోట్లు (35 ) వినియోగించామని, మిగిలిన నిధులను నవంబర్ లోపు పూర్తిగా ఖర్చు చేస్తామని తెలిపారు. దక్కన్ పీఠభూమి నేలల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఈ పథకానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. వచ్చే సెప్టెంబర్ 4,5తేదీల్లో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి మంత్రుల చింతన్ శివిర్" జరుగనుందని, అందులో తెలంగాణ అవ సరాలపై ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో అమలవుతున్న వినూత్న పథకాలను ఆ వేదికపై ప్రదర్శించాలని సూచించారు. అలాగే గ్రామీణమహిళల ఆర్థిక బలోపేతం కోసం కేంద్రం నుంచిపూర్తిస్థాయి సహకారం అందిస్తామని హామీ ఇవ్వగా మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్స్

# రెండు బంగారు పతకాలు సాధించిన నారాయణ విద్యార్థులు



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21:** నారాయణ విద్యాసంస్థ ఓ చరిత్రాత్మక విజయాన్ని ఆవిష్క రించింది. నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బణిబ్రత మాజీ, అక్షత్ శ్రీవాస్తవ, ముంబైలో ఆగస్టు 11 నుంచి 21 వరకు జరిగిన ప్రతిష్టాత్మకమైన 18వ ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐఓఏఏ) -2025లో బంగారు పతకాలు సాధించారు. ఈసారి ప్రపంచదేశాలతో పోటీ పడి ఐఓఏఏ- 2025 నిర్వహణకు భారత్ వేదిక అయ్యింది. భారత్ తరఫున గ్లోబల్ వేదికపై పోటీ పడ్డ బణిబ్రత, అక్షత్ 300 మంది ప్రపంచంలోని ప్రతిభావంతులైన విద్యార్థుల మధ్య పోటీపడి ఈ స్వర్ణ విజయాన్ని అందుకున్నారు. భారత్ తరఫున మొత్తం 4 బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించగా అందులో 2 బంగారు పతకాలు నారాయణ విద్యార్థులే సాధించటం విశేషం. ఐఓఏఏ ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన అకడమిక్ పోటీల్లో ఒకటి. ఇందులో పోటీదారులను ఆధునిక సిద్ధాంత జ్ఞానం, డేటా విశ్లేషణ, పరిశీలనా నైపుణ్యాలపై పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో బణిబ్రత మాజీ, అక్షత్ శ్రీవాస్తవ సాధించిన విజయాలు అసాధారణమైన ప్రతిభ, కృషి, పట్టుదలకి నిదర్శనం. ముఖ్యంగా జేఈఈ మెయిన్-2025లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన బణిబ్రత, మరోసారి తన అసాధారణమైన ప్రతి భను ప్రపంచ వేదికపై చూపి అబ్బురపరిచాడు. వీరి విజయాలు వ్యక్తిగత కృషికి తోడు, నారా యణలో లభించే బలమైన అకడమిక్ మద్దతు, వ్యక్తిగత శ్రద్ధకు అద్దంపడుతున్నాయి. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారా యణ మాట్లాడుతూ "బణిబ్రత, అక్షత్‌ల ప్రతిభపై మాకు అపారమైన నమ్మకం ఉంది. అంతే కాదు వారు ఎలాంటి వేదికపై అయినా అలవోకగా విజయం సాధించగలరు అనే విశ్వాసం మాకు ఏర్పడింది. ఐఓఏఏ- 2025లో వీరి విజయం కేవలం ఒక్క నారాయణకే కాకుండా యావత్ భారతావనికే గర్వకారణం అని పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి నారా యణ మాట్లాడుతూ "ఈ రెండు బంగారు పతకాలు మా విద్యార్థుల ప్రతిభ, పట్టుదల, కష్టానికి నిదర్శనం. బణిబ్రత, అక్షత్ తమ తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలిచారు. నారాయణలో మేము ఎల్లప్పుడూ సరైన వాతా వరణం, మార్గదర్శకత, అవకాశాలు అందిస్తూ విద్యార్థులు ఒలింపియాడ్ కలలను నిజం చేసే దిశగా కట్టుబడి ఉన్నామన్నారు. ఈ ఘనవిజయం నారాయణ యొక్క 46 ఏళ్ల విశిష్టమైన విద్యాప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్లతో పాటు జేఈఈ, నీట్ వంటి పోటీల్లోనూ నారాయణ నిరంతర విజయాలు సాధిస్తోంది. ప్రతి విజయం విద్యార్థులను వారి అసలైన సామర్థ్యానికి దగ్గర చేస్తుందన్నారు.

# నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా పంచాయతీరాజ్ పనుల జాతర

## పనుల జాతర-2025 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క




**హైదరాబాద్, ఆగస్టు21 , ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా "పనుల జాతర-2025" శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం మండలంలోని పుట్టల భూపతి గ్రామంలో పనుల జాతరను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించనున్నార. ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు గ్రామీణాభివృద్ధి బాటలో ఈ పనుల జాతర కీలక మైలురాయిగా నిలుస్తుంది. ఇది రాజకీయాలకు అతీతమైన పండుగ. ఎమ్మెల్యేలంతా ఈ పనుల జాతరలో పాలుపంచుకోవాలి" అని మంత్రి సీతక్క ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక లేఖలు రాసి, తమ తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సచివాలయం వేదికగా పనుల జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క, పనుల జాతర లో భాగంగా చేపట్టే పనుల వివరాలను వెల్లడించారు. ఈ జాతరలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు అమలు చేయనున్నారు. పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, చెక్‌డ్యాములు, ఊటకుంటలు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్లు, గ్రామీణ రహదారులు, కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం పాఠశాలల్లో మరుగుదొడ్లు వంటి పనులను చేపడతారు. ఈ పనుల జాతరలో రూ. 2,199 కోట్లతో 1,01,589 పనులను చేపట్టనున్నారు. మార్చ్ 2026 నాటికి అన్ని పనులను పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించారు. గతేడాది నవంబర్‌లో రూ. 4,529 కోట్లతో నిర్వహించిన పనుల జాతర-2024" విజయవంతం అయినట్లుగానే ఈ దఫా పనుల జాతరను విజయవంతం చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. "ఈ పనుల జాతర పల్లెల్లో ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా, జల సంరక్షణ, వ్యవసాయ అభివృద్ధి, జీవన ప్రమాణాల పెరుగుదలకూ దోహదం చేస్తుంది. పల్లెల్లో నిజమైన అభివృద్ధి పండుగ జరగనుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపట్టాల్సి న పనుల జాబితాను జిల్లా డీఆర్డీవీ అధికారులు సిద్ధం చేశారు.

పనుల జాతరలో భాగంగా ప్రతి గ్రామంలో ఇప్పటికే పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు, కొత్త పనులకు శంకుస్థాపన జరగనుంది. దీంతో మరోసారి పల్లెల్లో అభివృద్ధి పండుగ వాతావరణం నెలకొన నుంది.

# తెలుగు ప్రజలకు సాహిత్యభిక్ష పెట్టిన కె.వి.రాఘవాచార్య

## సంస్కృత అకాడమీ అధ్యక్షుడు, సంస్కృతి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య పెన్నా మధుసూదన్



పురస్కారాల స్వీకర్తలతో మధుసూదన్, శ్రీరంగాచార్యులు, కె.వి.రమణాచార్య, ప్రభాకరశర్మ, నరసింహాచార్య తదితర అతిథులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఉభవ వేదాంత ప్రవీణ్య కె.వి.రాఘవాచార్య సంస్కృత గ్రంథాలను తెలుగులోని అనువదించి తెలుగు ప్రజలకు సాహిత్య భిక్షపెట్టారని సం స్కృత అకాడమీ అధ్యక్షుడు, సంస్కృతి విశ్వవిద్యా లయ ఉపాధ్య క్షుడు ఆచార్య పెన్నా మధుసూ దన్ కొనియా డారు. డా. కె.వి. రమణాచారి కని పెంచిన తల్లిదం డ్రులే కనిపించే దైవాలని ప్రగాఢ విశ్వా సమని, వారిని కొలిస్తే ఆ భగవంతుని కొలిచి నట్లేనని నమ్ముతానని ప్రారం భోపన్యాసంలో తెలిపారు. ఆ నమ్మకంతోనే తనతండ్రి రాఘవాచార్యను స్మరించుకొంటూ వారిపేరిట స్మారక పండిత పురస్కారం డా. సముద్రాల వెంకట రంగరామానుజాచార్య స్వీకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాఘవాచార్య మనస్సు మేధస్సును కలిపి అడుగడుగునా తమనుపెంచినతీరే నేటి నా ఉన్నతస్థితికి కారణమని స్పష్టం చేశారు. అలాగే యువతకు స్ఫూర్తిని రేకెత్తించేందుకు స్ఫూర్తి పురస్కారం అందిస్తున్నట్లు విపులీకరించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సాధవ సాహితి స్రవంతి, తిరుమల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీం ద్రభారతిలోని డా. పెరుంబుదూరు శ్రీరంగాచా ర్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య పెన్నా మధుసూదన్ విశిష్ట అతిథులు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, డా.దోర్భల ప్రభాకర వర్మ, డా. సిహెచ్.లక్ష్మీనాథాచార్యులు, ఆచార్య పిల్లలమర్రిరాములు, నరేంద్రాచార్య సంస్థ అధ్య క్షుడు సాధన నరసింహాచార్య, కార్యదర్శి శంభ నికుమార్ తదితరులతో కలిసి డా. సముద్రాల వెంకట రంగరామానుజాచార్యను ఘనంగా సత్కరించి కె.వి.రాఘ వాచార్య స్మారక పండిత పురస్కారం; వర్తమాన యువ ప్రవచనకర్త డా. గంగిశెట్టి లక్ష్మినారాయణను ఘనంగా సన్మానించి డా. కె.వి. రమణాచార్య స్ఫూర్తి పురస్కారం 2025లను ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు. ముందుగా సాధన నరసింహాచార్య స్వాగతోపన్యాసంలో గత 8 సంవత్సరాలుగా డా. కె.వి.రమణాచారి అందిస్తున్న ఈ పురస్కారాల గురించి విశదీకరించారు.

# ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజనతో రైతుల ఆదాయం పెరుగుదల

## కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎంపిలు

**హైదరాబాద్,ఆగస్టు 21,ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన తెలంగాణలో అమలు చేస్తే వ్యవసాయ ఉత్పాదకత పెరగడం తోపాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుం దని తెలంగాణ ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కర్, రఘురామిరెడ్డిలు అన్నారు. గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన తెలం గాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎంలు కలిశారు పిఎంకె ఎస్‌వై ప్రాజెక్టులను సకాలంలో మంజూరు చేసి రాష్ట్ర ప్రయోజనాలకు దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. స్థిరత్వంలేని రుతుపవనాల వల్ల పడే వర్షాలపై ఆధారపడటం క్రమంగా తగ్గుతుందని వారు మంత్రికి వివరించారు. దీనివల్ల శాస్త్రీయ నీటి పారుదల పద్ధతుల ద్వారా భూగర్భ జలాలను పరిరక్షి ంచుకోవచ్చని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలం గాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పిఎంకెఎస్‌వై ప్రాజెక్టులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. పిఎంకెఎస్‌వై పాజెక్టుల ద్వారా 'హర్ ఖేత్ కో పానీ'ని నిర్ధారించడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వాటర్ షెడ్ అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేయ డం లాంటివే లక్ష్యమని మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు.

# బిసి గురుకులాలు, హాస్టల్స్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

## నాణ్యమైన భోజనం అందించాలి

### అధికారులలో టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 21:** రాష్ట్రంలో కొనసాగుతున్న బిసి గురుకులాలు, హాస్టల్స్‌లోని విద్యార్థులందరికీ విధిగా ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలని అధికారులను బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశిం చారు. గురుకులాలతోపాటు, హాస్టల్స్‌లోని విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి పొన్నం గురువారం టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు, జాయింట్ సెక్రెటరీలు శ్యామ్‌ప్రసాద్, తిరుపతి రెడ్డి పాల్గొ న్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కుస్తుండటం, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌లోని విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని పాఠశాలల ప్రిన్సిపల్స్, వార్డెన్‌లను మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సరైన సమయం లో పాఠ్యాంశాలు పూర్తి చేయాలని అన్ని పాఠశా లల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యానని చెప్పిన మంత్రి ఎక్కడైనా ఖాళీలు ఉంటే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# గూడ్స్ షెడ్ రివర్స్ లో అదుపు తప్పిన రైలు

## తృటిలో తప్పిన ప్రమాదం

**వరంగల్ క్రైం, ఆగస్టు21ప్రభాతవార్త:** వరంగల్ రైల్వే స్టేషన్లో ఓ గూడ్స్ రైలు రివర్స్ వస్తు రైల్వే స్టేషన్ ముందున్న ఏటీఎం పక్క గోడను తగిలి విధ్వంసం సృష్టించింది. గోడ ధ్వంసం జరిగినా ఎలాంటి ప్రాణ నష్టం ఎవరికి ఏమి జరగక పోకపోవడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుండి వరంగల్ కు కాంప్లెక్స్ ఎరువులతో రావలసిన గూడ్స్ రైల్ ప్లాట్ ఫాం పైకి రివర్స్ తీసుకు వచ్చి నీలిపేస్తారు. అనంతరం ఎరువులను దిగుమతి చేసే ప్రక్రియ ఉంటుంది. ఈ క్రమంలో రైల్ రివర్స్ నిలిపే సమయంలో గాడ్ తో పాటు సిబ్బంది ట్రైన్ పైలెట్ కు ఇంస్ట్రక్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది ఈ సమయంలో సిబ్బందికి ట్రైన్ పైలెట్‌కు అవగాహనలోపంతో నిర్ణీత సమయం లో ఆగాల్సి న ట్రైన్ సుమారు ఐదు ఫీట్ల డిస్టెన్స్ అదుపు తప్పు వెనక్కి రావడంతో సపోర్ట్ ఉండాల్సి న ప్రహరీ గోడ ధ్వంసం అయ్యింది.

# మేడారం మహా జాతరను మహా వైభవంగా నిర్వహిస్తాం

## చరిత్రలోనే అత్యధికంగా నిధులు కేటాయించాం

## మంత్రులు సీతక్క,అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమ్మక్క సారలమ్మ మహా జాతర కోసం ఎన్నడు లేని విధంగా ఈ దఫా రూ.150 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్ సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. మేడారం సమ్మక్కసారలమ్మ జాతర జాతర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వచ్చే ఏడాది మేడారం సమ్మక్కసారలమ్మ జాతర జనవరి 22 నుండి 31 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా రూ.150 కోట్ల నిధులు విడుదల చేసిందని వెల్లడించారు. జాతర కోసం శాశ్వత పనులు చేపడుతున్నామని, జంపన్న వాగు నుంచి మేడారం ప్రాంగణం వరకు డబుల్ రోడ్డు, రోడ్ల వెడల్పు, డివైడర్లు, అలాగే 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతివనం అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, భద్రత కోసం 12 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. 13వ శతాబ్దపు ఈ చారిత్రక జాతరను భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..సమ్మక్క సారలమ్మ గత జాతరకు రూ.105 కోట్లు కేటాయిస్తే...ఈసారి రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆదివాసీ పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖను పట్టించుకోలేదని. అయితే ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్ద బిడ్డ వేస్తోందన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ తరఫున "పనుల జాతర 2025 పోస్టర్"ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 15వేల పనులు రూ.2198 కోట్ల వ్యయంతో ప్రారంభంకానున్నాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మేకల, గొర్రెల షెడ్లు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఉన్నాయి. ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల రూపురేఖలు మార్చడంలో ఈ పనుల జాతర కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ తరఫున "పనుల జాతర 2025 పోస్టర్"ను మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షా15 వేల పనులు రూ.2198 కోట్ల వ్యయంతో ప్రారంభం కానున్నాయని వీటిలో ప్రభుత్వ పాఠశాలలలో మరుగుదొడ్లు,మేకల,గొర్రెల షెడ్లు,గ్రామీణ మౌలికవసతుల అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల రూపురేఖలు మార్చడంలో ఈ పనుల జాతర కీలక పాత్ర పోషిస్తుంది" అని అన్నారు. జాతరలో ప్రతి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని తాను వ్యక్తిగతంగా లేఖలుపంపినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

**కెటిఆర్ వ్యాఖ్యలపై సీతక్క మండిపాటు**

కాంగ్రెస్ ది థర్డ్ క్లాస్ ప్రభుత్వం అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండి పడ్డారు. "థర్డ్ క్లాస్ అంటే ఏంటో కేటీఆర్ చెప్పాలి. కేటీఆర్ అహంకారంతో, మాట్లాడుతున్నారు. ఆయనది డర్టీ మైండ్ అని ప్రజలందరూ గ్రహిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించడం కేటీఆర్ డర్టీ మైండ్ కు నిదర్శనం అని మండిపడ్డారు. ఇంట్లో కేసులు, వ్యక్తిగత సమస్యలతో విసిగిపోయి కేటీఆర్ ఫ్రస్ట్రేషన్ అవుతున్నారు. అంతేకాకుండా సొంత చెల్లెలు కవిత కూడా లేఖ రాసి తనను సొంత పార్టీ నేతలే వేధిస్తున్నారని ఆరోపించారు. దానిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో యూరియా ఇచ్చిన వారికే మద్దతు ఇస్తానని కేటీఆర్ చెబుతున్నారు. కానీ యూరియా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం అని ఆయనకు తెలియదా? బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయి రాష్ట్రంలో యూరియా కొరతను సృష్టించాయని ఆరోపించారు. పార్లమెంటు వేదికగా ప్రియాంక గాంధీ సైతం పోరాటం చేస్తున్నారని మంత్రి సీతక్క గుర్తు చేశారు.

# దుకాణంలో చాయ్ కాచుకొని తాగిన ఉత్తరాఖండ్ సిఎం

**డెహారాడూన్, ఆగస్టు 21:** ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవాలనుకున్న ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ థామి రోజు మాదిరిగానే గురవారం ఉదయపు నడక కోసం వెళుతూ వెళుతూ రోడ్డు వెంట ఉన్న ఓ టీ స్టాల్ వద్ద ఆగారు. ఆ ప్రాంతం ఎక్కడంటే గైర్‌సైన్ ప్రాంతంలోని భరానిసాయిన్ వద్ద ప్రభుత్వ ఆర్థిక సహాయంతో చంద్రసింగ్‌నేగి అనే వ్యక్తి ఓ టీ స్టాల్ నడుపుతున్నాడు. స్వయంగా ముఖ్యమంత్రే తన టీ కొట్టు ఆగి స్వయంగా టీ తయారు చేసి ఆస్వాదించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా వినియోగమవుతున్నాయో స్థానికుల నుంచి కనుక్కుంటూ, అలాగే వారి యోగక్షేమాలను విచారిస్తూ అలా ఉదయం నడక కొనసాగించడం పుష్కర్‌సింగ్‌కు అలవాటు. అందులో భాగంగానే గురువారం చంద్రసింగ్ నేగి టీకొట్టు వద్ద ఆగారు. ఆ తర్వాత టీ తయారుచేసే కౌంటర్‌లోకి వెళ్లి అక్కడి డ్రెస్ కూడా వేసుకుని వేడివేడి టీస్వయంగా తయారు చేశారు. అలా తయారు చేసిన వేడివేడి టీని గ్లాసుల్లో పోస్తూ అక్కడి వెళ్లుతున్న బాటసారులను, దుకాణాదారులను ఆప్యాయంగా పలకించారు. తేనీటిని ఆస్వాదించారు. ఇంకేముంది క్షణాల్లో ఆ విడియో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది.

# మియాపూర్‌లో దారుణం.. ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి

## విషం కలిసిన ఆహారం తిన్నారనే అనుమానం

## హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు





మృతిచెందిన లక్ష్మయ్య, వెంకటమ్మ దంపతులు, కుమారుడు యువాన్ష్‌తో కలిసి కవిత, అనీల్ దంపతులు(ఫైల్)

**సైబరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** హైటెక్‌సిటీ పరిధిలోని మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానస్పద స్థితిలో మ ృతిచెందడం సంచలనంగా మారింది. గురువారం తెల్లవారు జామునే తెలిసిన ఈ సంఘటనతో మియాపూర్ ఉలిక్కిపడింది. మియాపూర్ మక్తా మహబూబ్‌పేట్‌లో ఉండే ఓ ఇంట్లో వ ృద్ధ దంపతులు, వారి కుమార్తె, అల్లుడు, రెండేళ్ల మనుమడు సొంత ఇంట్లో మ ృతి చెంది ఉండడం సంచలనంగా మారింది. విషం కలిసిన ఆహారం తినడంతోనే ఐదుగురు మ ృతిచెందినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కాగా ఈ ఐదుగురి మ ృతికి కారణం ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే మియాపూర్ పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, మ ృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సెడాం పరిధిలోని రంజోల్ గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మయ్య(61), భార్య ఉప్పరి వెంకటమ్మ(55) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కాగా మియాపూర్‌కు మకాం మార్చిన వీరు గత రెండేళ్లుగా మక్తా మహబూబ్‌పేట్‌లో అద్దెకు ఉంటున్నారు. లక్ష్మయ్య స్థానికంగా మేస్త్రీ పనిచేస్తుండగా, వెంకటమ్మ స్కూల్ అటెండర్‌గా పనిచేస్తుంది. వీరి కుమారుడు భగవంత్‌సాగర్ ఆటో నడుపుకుంటూ వీరితోనే ఉంటున్నాడు. కాగా లక్ష్మయ్య కాలుకు గాయం కావడంతో గతకొద్ది రోజులుగా ఇంటి వద్దే ఉంటుండగా, కుమారుడు భగవంత్ స్నేహితులతో కలిసి పెళ్లి వేడుక కోసం ఈనెల 18న వైజాగ్ వెళ్లాడు. లక్ష్మయ్య రెండవ కుమార్తె కవిత, అల్లుడు అనీల్‌లు గతంలో కాళీమందిర్ వద్ద ఉండగా, అక్కడ పని దొరక్కపోవడంతో పది రోజుల క్రితం అనీల్, కవితలు తమ కుమారుడు యువాన్ష్‌తో కలిసి లక్ష్మయ్య ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి వారు ఇక్కడే ఉంటున్నారు. కాగా బుధవారం వెంకటమ్మ నీరసంగా ఉందని చెప్పడంతో పెద్దకుమార్తె లక్ష్మి, ఆమె భర్త చాంద్‌పాషాలు లక్ష్మయ్య ఇంటికి వచ్చి రాత్రి 11 గంటలకు తిరిగి వెళ్లిపోయారు. కాగా వెంకటమ్మతో కలిసి స్కూల్‌లో పనిచేసే కార్మికురాలు గురువారం ఉదయం 5 గంటలకు తలుపు కొట్టగా, స్పందన లేకపోవడంతో ఆమె పెద్దకుమార్తె లక్ష్మికి సమాచారం అందించింది. హుటాహుటిన లక్ష్మి లక్ష్మయ్య ఇంటికి చేరుకొని తలుపులు బద్దలు కొట్టి చూడగా, లక్ష్మయ్య, వెంకటమ్మ, రెండవ కుమార్తె కవిత, ఆమె భర్త అనీల్, మనుమడు యువాన్ష్‌లు విగతజీవులుగా పడిపోయి మ ృతిచెంది కనిపించారు. స్థానికుల సమాచారంతో మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మ ృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. ఈమేరకు మియాపూర్ పోలీసులు అనుమానస్పద మ ృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



గురువారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

# జనహిత పాదయాత్ర విజయవంతం చెయ్యాలి

## కేటీఆర్ భాష మార్చుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** జనహిత పాదయాత్ర రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో మొదట దశలో జరుగుతుందనీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఇతర ముఖ్య నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 24 వ తేది చొప్పదండి శాసనసభ నియోజకవర్గంలో గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం నుండి కురిక్యాల చౌరస్తా మీదుగా గంగాధర వరకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్ర ఉంటుందన్నారు. కరీంనగర్‌ఉమ్మడి జిల్లా కార్యక్రమంగా తీసుకొని ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు,అనుబంధ సంఘాలకు ,పార్టీ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. జనహిత పాదయాత్ర ద్వారా 19 నెలలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలతో చర్చిస్తూ వారికి అందుతున్న వాటిపై ఆరా తీస్తూ,వారి కష్టాలు తెలుసుకుంటారని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు పార్టీ పక్షాన వారికి అండగా ఉంటూ , ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోఆర్డినేట్ చేస్తున్నారనీ తెలిపారు. 24న సాయంత్రం పాదయాత్ర తర్వాత గంగాధరలో బస ఉంటుందన్నారు. 25న ఉదయం ప్రభుత్వ పాఠశాలలో శ్రమ దానం ,మొక్కలు నాటే కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మీనాక్షి నటరాజన్ పాల్గొంటారనీ తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ బస్సుల యజమానులు, సోలార్ యజమానులు, ఇందిరా క్యాంటీన్ యజమానులుగా ఉన్న మహిళలతో మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. జిల్లా ముఖ్య కార్యకర్తలతో పీసీసీచీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మీనాక్షి నటరాజన్ ఇష్టాగోష్టితో మాట్లాడతారనీ వివరించారు. **కేటీఆర్ వాఖ్యలపై మంత్రి పొన్నం కౌంటర్:** కేటీఆర్ భాష థర్డ్ క్లాస్ కి మారిపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ బిడ్డగా రాజ్యాంగంలో అపార అనుభవం ఉండి, పేద గ్రామీణ వ్యవసాయం కుటుంబం నుండి వచ్చి హైకోర్టు , సుప్రీం కోర్టు జడ్జి గా చేసిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి అని తెలిపారు.

# జూబ్లీఎన్‌క్లేవ్‌లో ఆక్రమణలు తొలగింపు

## పార్కులతో పాటు రహదారులను కాపాడిన హైడ్రా, 400కోట్లు విలువైన 16వేల గజాల స్థలానికి రక్షణ

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాధాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రహదారుల ఆక్రమణలను గురువారం తొలగించింది. 22.20 ఎకరాలలో దాదాపు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 కబ్జా(దాదాపు 8 వేల 500 గజాలు)కు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జా అయ్యింది. వీటికి తోడు.. దాదాపు 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. యిలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు రూ. 400ల కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లే ఔట్ ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఈ లే ఔట్ ప్రకారం జిహెచ్ఎంసికి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లే ఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. హైడ్రా ఏసిపి శ్రీకాంత్, ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, బాలగోపాల్‌లనేతృత్వంలో ఈ కూల్చివేతలు జరిగాయి. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు సూచిస్తూ బోర్డులు పెట్టి ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీస్ కేసులు కూడా పెడుతున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.



**4 చోట్ల ఆక్రమణల తొలగింపు :** లే ఔట్ ప్రకారం ఉన్న 4పార్కుల్లో 2 పార్కులు, ఒక రహదారి, ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్టు వెల్లడి కావడంతో గురువారం ఈ మేరకు చర్యలు తీసుకుంది. హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్ కు ఎదురుగా దాదాపు 300ల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని.. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ. 4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ ఎంసీ నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలవకుండా తర్వాత ఎలా రద్దౌతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. యూఎల్‌సీ ల్యాండ్ తన సొంతం అయితే ప్లాట్ల జోలికి రాకుండా.. పార్కులే ఎలా జైహింద్‌రెడ్డివి అవుతాయని అంటున్నారు. జైహింద్‌రెడ్డిపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని.. ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. పార్కులను కాపాడిన హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. చుట్టూ ఐటీ కార్యాలయాలు, నివాసాలు ఉన్న ప్రాంతంలో పార్కులను కాపాడి.. ఇక్కడివారికి హైడ్రా ఊపిరి అందించిందని పేర్కొన్నారు.

# దేవాలయాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది హవా

## పోస్టులు అమ్ముకుంటున్న మధ్యవర్తులు: పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** దేవాదాయ శాఖ పరిధిలోని పలు పెద్ద దేవాలయాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు అంగడి సరుకుగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. రేటు పెట్టి అమ్మేసుకుంటున్నారని, ఆయా దేవాలయాలకు ఔట్సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేసే ఏజెనీల ప్రతినిధులు ఇష్టారీతిన వ్యవహరిన్నారని భక్తులు విమర్శిస్తున్నారు. శానిటేషన్,ప్రసాదాల తయారీ, ప్రసాద విక్రయ కౌంటర్లు, గోశాలల నిర్వహణ, పర్యవేక్షణ. ఇలా పలు రకాల పనుల కోసం ఖ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని "తీసుకుంటుండగా ఆ బాధ్యతను నిర్వహించకుండా జిల్లా కలెక్టర్ల ద్వారా టెండర్ పద్ధతిలో మ్యాన్‌పవర్ సప్లయింగ్ సంస్థలకు కట్టబెట్టి చేతులు దులుపుకొంటోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీలు సిబ్బం దీని నియమించే విషయంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో అంతా అస్తవ్యస్తంగా తయారైందని భక్తులు ఆరోపిస్తున్నారు. దేవాలయాల వారీగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు ఆయా ఏజెన్సీలు కొందరు ప్రతినిధులను నియమిస్తుండగా ఆ ప్రతినిధులు కూడా ఔట్ సోర్సింగ్ ఖాతాలోనే నియమితులవుతూ నెలవారీ జీతాన్ని పొందుతున్నారు. కానీ, వారిలో చాలామంది అసలు చెందా మాత్రం పోస్టులను బేరానికి పెట్టి డబ్బులు వసూలు చేయటమే ప్రసాద తయారీ కౌంటర్ పోస్టు కావాలంటే 2.25 లక్షలు,ప్రసాదాల తయారీ పోస్టు అయితే రూ.2 లక్షలు ,శానిటేషన్ విభాగంలో అయితే రూ.1.80 లక్షలు ఈ విధంగా ధరల పట్టకను ఏర్పాటు చేసుకుని వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైన వారిని పిలిచి మాట్లాడి ఉద్యోగాలు కేటాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదంతా ఏజెన్సీలకు సంబంధించిన వ్యవహారం కావడంతో దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కొన్ని దేవాలయాలకు సంబంధించిన ఏజెన్సీ ప్రతినిధులు, నిరుద్యోగుల మధ్య సాగిన ఫోన్‌కాల్ రికార్డులు వెలుగులోకి రావడంతో దీని పెద్ద దుమారం రేగింది. పెద్ద దేవాలయాలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో అక్కడ సేవలను విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో సిబ్బంది అవసరం పెరుగుతోంది. ప్రస్తుతం దేవాదాయశాఖలో నియమకాలు లేక పోవడంతో అవసరమైన సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటున్నారు. దాంతో అన్ని దేవాలయాల్లో వీరి సంఖ్య భారీగా పెరిగింది. దేవాలయాల్లో ప్రసాదాల అమ్మకాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటోంది. దర్శనం అనంతరం ప్రసాదం స్వీకరించడం తప్పని సరని భక్తులు భావిస్తున్నారు. తినే పదార్థాలు కావడంతో ప్రసాదాల తయారీలో పరిశుభ్రత చర్యలు అత్యవసరం. కానీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకంలో నిర్వాహకులు దీనిని పట్టించుకోవటంతో శానిటేషన్ విధుల్లో ఉండే సిబ్బందిని ఇటు ప్రసాదాల తయారీకి పురమాయిస్తున్నారు. ప్రసాదాల తయారీ సమయంలో తలపై క్యాప్ (జుట్టు రాలిపడకుండా) చేతులకు గ్లోవ్స్ ధరించటంతోపాటు చేతి గోళ్లు పెరిగి ఉండకూ డదని, రోజూ పరిశుభ్రమైన వస్త్రాలు ధరించాలనే నిబంధ నలుంటాయి. కానీ, సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో గోశాలల్లో పేడ ఎత్తే విధుల్లో ఉండేవారిని ప్రసాదాల తయారీకి మారుస్తున్నారు. వారి చేతి గోళ్లలో పేడ ఇరుక్కొని ఉంటె ప్రసాదం కలుషితమయ్యే ప్రమాదం ఉంటుందని భక్తులు ఆమె దన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ విధుల్లో ఉండే వారినా ప్రసాదాల తయారీ. ప్రసాదాల కౌంటర్లకు ఎలా మారుస్తారని ప్రశ్నిస్తున్నారు. విధుల్లోకి ఎంపిక చేసే వారికి సంబంధించి ఆయా ప్రాంతాల్లో కచ్చితంగా విచారణ జరపాలన్న నిబంధన అపహాస్యమవుతోంది. ఆ వ్యక్తి ఎలాంటి వాడో వాకబు చేయ కుండానే దేవాలయాల్లో కీలక బాధ్యత అప్పగిస్తున్నారని, ఈ నేపథ్యంలో అన్యమతస్తులు కూడా దేవాలయ విధుల్లో వస్తున్నారని, ఇది భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వెళుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



గాజులరామారంలో సిపిఐ రాష్ట్ర మహాసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ

# అధికార కేంద్రీకరణకు కేంద్రంలో బిజెపి కుట్ర

## రెండేళ్ల జైలుజీవితం అనుభవించిన అమిత్‌షాను రాజకీయాలనుండి వెలివేయాలి: సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్.కె.నారాయణ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** భారతదేశాన్ని అధికార కేంద్రీకరణదిశగా మార్చి ప్రభుత్వ రాజ్యాంగ బద్ధసంస్థలను బిజెపి మోడీప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు భారీకుట్ర జరుపుతుందని దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యావత్ ప్రజానీకాన్ని చైతన్యంచేసి పోరాటాలకు శ్రీకారం చుట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె. నారాయణ పిలుపునిచ్చారు. గురువారం కాంమ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావునగర్ (గాజులరామారం)లో కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ (మహారాజా గార్డెన్స్)హాలులో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభల రెండవరోజు సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. స్వయంప్రతిపత్తి గల రాజ్యాంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యంచేసి అధికారాన్ని కేంద్రీకృతం చేసుకనేందుకు యత్నిస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే సిబిఐ, ఈడి, న్యాయ వ్యవస్థ, నీతిఅయోగ్‌తదితర వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేయనివ్వడం లేదని విమర్శించారు. కేంద్రప్రభుత్వం చెబుతున్నట్లు దేశాభివృద్ధి జరగటం లేదని, కేవలం కార్పొరేట్ సంస్థల అభివృద్ధి మాత్రమే జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. బిజెపిని వ్యతిరేకించే వారిని జైళ్లలో పెట్టడం, నక్సలైట్ల అంతంపేరుతో గిరిజన సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేకుట్ర యథేచ్ఛగా జరుగుతుందన్నారు. దేశంలో రు.లు.22లక్షల కోట్ల వ్యయంతో పేదల వాటా ఎంత, సంపన్నులవాటా ఎంతో తేల్చాలన్నారు. ఉపరాష్ట్రపతి రాత్రికిరాత్రే మాయం కావడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నా అంశాలవవారీగా మద్దతు ఇవ్వాలేతప్ప అన్ని విషయాలలో తల ఊపొద్దని ఆయన సూచించారు. ఎపిలో చంద్రబాబు, జగన్‌లు బిజెపికి వత్తాసుపలుకుతున్నారని వత్తాసుపలినంత వరకే పదవులు వుంటాయని, లేదంటే వారి జీవితంకూడా జైలుపాలేదనని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయనట్లైతే ప్రజా సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని సమస్యల పరిష్కారంకోసం సిపిఐ ఉద్యమబాటను మరింత ముమ్మరం చేయాలని ఆయన పార్టీ వర్గాలకు సూచించారు. పార్టీలో యువత, విద్యార్థి, మహిళల బాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఆయా వర్గాలను ప్రోత్సహించాలన్నారు. వెనకబడిన తరగతుల (బి.సి)లకు 52శాతం రిజర్వేషన్లను రాజ్యాంగ హక్కునుకల్పించాలని భారతకమ్యూనిస్టుపార్టీ దీనికి సంపూర్ణమద్దతు ప్రకటిస్తున్నందని నారాయణ తెలిపారు.

# వరదల తో దెబ్బతిన్న రోడ్లపై నివేదిక సిద్ధం చేయండి

## ఆర్ అండ్‌బి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** తెలంగాణలో కురిసిన అతితీవ్రభారీ వర్షాలకు తలెత్తిన వరదల కారణంగా వెయ్యికోట్ల విలువగల ఆర్ అండ్ బి కి చెందిన రోడ్లు, వంతెనలు కల్వర్టు ఇతర మౌళిక వసతులు దెబ్బతిన్నట్లు క్షేత్రస్థాయిలో ని ఇంజనీర్ల ప్రాథమిక సమాచారం వివరిస్తున్నాయని నష్టం తాలుకు అంశాలను పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంజనీర్లకు తెలిపారు. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో గురువారం ఆర్ అండ్ బి శాఖ పై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ఈఎన్సి జయ భారతి,సి.ఈ రాజేశ్వర్ రెడ్డి,ఎస్.ఈ ధర్మారెడ్డి పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల వల్ల ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని రోడ్ల డ్యామేజ్ వివరాలపై నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కోతకు గురైన రోడ్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదలకు దెబ్బతిన్న స్టేట్ రోడ్స్ ,ఎన్ హెచ్ రోడ్స్ ,పలు కల్వర్టులు, మైనర్ బ్రిడ్జిల వివరాలు మంత్రి తెలుసుకొన్నారు. ఆ మౌళిక వసతుల జీవితకాలం ఎంతో నమోదు చేయాలని సూచించారు. పూర్తి శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అతి కొద్ది రోజుల్లోనే హ్యామ్ విధానం ద్వారా మెరుగైన, నాణ్యమైన రోడ్లు వేసుకోబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని, ఈ సీజన్ వర్షాలు తగ్గుముఖం పెట్టగానే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం పూర్తి ప్రణాళిక బద్ధంగా వెళ్తుందని చెప్పారు.

కేంద్రం నుండి క్లియరెన్స్ రావాల్సి న ఎన్ హెచ్ ప్రాజెక్ట్స్ పై ఆరా తీసిన మంత్రి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాను ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర పరిధిలోని ప్రాజెక్ట్స్ పై మాట్లాడానని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున విజ్ఞప్తులు కూడా ఇచ్చామని వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి గుర్తు చేశారు. ఖానాపూర్ నుండి బెల్లాం,ఉట్నూర్ నుండి గుడిహత్నూర్ రోడ్ మార్గం పై మంత్రికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి పై సానుకూలంగా స్పందించారు.

# ఉద్యోగుల డిసిప్లినరీ యాక్షన్ కేసులపై సర్కార్ కీలక నిర్ణయం

## నేరం చేసినట్లుగా గుర్తిస్తే వెంటనే విచారణ, నూతన మార్గదర్శకాలు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు21:** ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణా కేసుల ప్రక్రియను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. క్రమశిక్షణా చర్యల సమయంలో జాప్యాన్ని నివారించడానికి అన్ని స్థాయిలలోని ప్రభుత్వ ఉద్యోగులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది.

గతంలో జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తూ, కొత్త మార్గదర్శకాలను గురువారం విడుదల చేసింది. కొత్త రూల్స్ ప్రకారం.. ఒక ఉద్యోగి నేరం చేసినట్లుగా గుర్తించిన వెంటనే ప్రాథమిక విచారణను వేగంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో జాప్యం కారణంగా చాలా సందర్భాలలో ఉద్యోగులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఆరోపణలు స్పష్టంగా, సరళమైన భాషలో ఉండాలని సూచించింది. కేవలం విధుల్లో నిర్లక్ష్యం లేదంటే దుష్ప్రవర్తన వంటి సాధారణ పదాలను కాకుండా ఆరోపణలకు తగిన డాక్యుమెంటరీ ఆధారాలు ఉండాలని ఆదేశించింది. సాక్షుల స్టేట్మెంట్ రికార్డు చేయాలని చెప్పింది. ఆరోపణలను రుజువు చేయడానికి ఉపయోగించే అన్ని పత్రాల నకళ్లను ఉద్యోగికి తప్పనిసరిగా ఇవ్వాలి.

ఈ పత్రాలను నిరాకరించడం న్యాయ సూత్రాలను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అదేవిధంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి నుంచి ప్రతివాదన పత్రాన్ని పొందడం కూడా తప్పనిసరి చేసింది. దీనిని రికార్డులతో సరిపోల్చి సీనియర్ అధికారి పరిశీలించాలని పేర్కొంది. విచారణ నిర్వహించడానికి ప్రిసైడింగ్ అధికారిని నియమించాలని, ఈ అధికారి కేసు వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, డిసిప్లినరీ అథారిటీ తరపున విచారణ అధికారి కేసును వివరాలను అందించాలని సూచించింది. డిసిప్లినరీ కేసులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు మూడు రోజులకు మించి తమ వద్ద ఉంచుకోకూడదని, మంత్రుల వద్దకు వెళ్లిన ఫైళ్లను వారం రోజుల్లో క్లియర్ చేయాలని ప్రభుత్వం పేర్కొంది. నిర్దేశిత కాలపరిమితిలో విచారణను పూర్తి చేయడంలో విఫలమైన విచారణ అధికారులు క్రమశిక్షణా చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించింది.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నం: 05/T2/DEE/DSE/SEHNK/2025-2026, తేది: 13.08.2025
... www.eprocurement.gov.in ... 20.08.2025 సా.4.00గం. ... 27.08.2025 మ.3.30గం. ... https://tender.telangana.gov.in ...
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీరు, (R&B) ...
DIPR.NO. 6867-PP/CL/ADVT/1/2025-26 తేది: 21.08.2025

# 'పరదా'లో ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేశా

## -అనుపమ పరమేశ్వరన్



**సినిమా బండి** ఫేమ్ డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ పాటలు మంచి బజ్ క్రియేట్ చేశాయి. ప్రిమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పరదా ఆగస్ట్ 22న థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**పరదా కథ విన్న తర్వాత మీ ఫస్ట్ రియాక్షన్ ఏమిటి?**

పరదా చాలా కొత్తకథ. ఇలాంటి కథలు తెలుగు సినిమాలోనేకాదు ఇండి యన్ సినిమాలోకూడా చాలా అరుదు. ఇలాంటి ఫ్రెష్ కాన్సెప్ట్ నా దగ్గరికి ఎప్పుడురాలేదు. డైరెక్టర్ ప్రవీణ్ నాకు కథ చెప్పినప్పుడు పరదాలోనే నా క్యారెక్టర్ ఎక్కువగా కనిపించింది. బాడీ లాంగ్వేజ్ డైలాగ్‌తో ఎలా నటించగలను అనేది ఒక ఛాలెంజ్‌గా తీసుకొని ఈ సినిమాని చేయడం జరిగింది. ఇందులో చాలా సీన్స్ నేను సైలెంట్‌గా ఉండొచ్చు. కానీ పరదా వెనుక నా క్యారెక్టర్ ఎమోషన్ ఉంటుంది. ఇప్పుడు ప్రీమియర్స్ చూసిన చాలా మంది ఆడియన్స్ నేను కేవలం కళ్లతోనే కాదు బాడీ లాంగ్వేజ్, వాయిస్‌తో కూడా యాక్ట్ చేయగలనని చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. పరదా ప్రిమియర్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ కథ నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఒక యాక్టర్‌గా ఛాలెంజింగ్‌గా ఉండే రోల్ చేశాను.

**ఈ సినిమా ప్రమోషన్స్‌లో మీరు చాలా ఎమోషనల్ గా మాట్లాడారు.. కారణం?**

ఈ కథకి నేను చాలా కనెక్ట్ అయ్యాను. ఒక అమ్మాయి మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలదు. చాలా హానెస్ట్‌గా తీసిన సినిమా ఇది. కచ్చితంగా మీరు క్యారెక్టర్స్‌తో రిలేట్‌అవుతారు. సినిమాఅంటే ఒకసెలబ్రేషన్. అలాంటి సినిమాలుతో పాటు ఇలాఒక్కసారి మనల్ని మనం ఆలోచింప జేసుకునే సినిమాలు కూడా రావాలి. నిజాయితీగా ఒక కథ చెప్పాము. ఆడియన్స్ యాక్సెప్ట్ చేస్తారనే నమ్మకం ఉంది.

**ఈ సినిమాలో మీరు చాలా ఎమోషనల్ గా కనెక్ట్ అయిన సీన్?**

రాజేంద్ర ప్రసాద్ గారితో ఒక సీన్ ఉంటుంది. ఆ సీన్‌కి నేను చాలా కనెక్ట్ అయ్యాను. ఇప్పటికి కూడా ఆ సమస్యకి నా దగ్గర ఆన్సర్ లేదు. ఆడియన్స్ చూసినప్పుడు అక్కడ చెప్పిన పక్షి కథ ఖచ్చితంగా మనల్ని ఆలోచనల్లోకి నెట్టేస్తుంది. ఆ సినిమా కథ మొత్తం ఆ సీన్‌లోనేఉంది. పరదా ఒక బోల్డ్ అటెంప్ట్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఒక్క సెకండ్ ఆలోచించగలిగిన అది సక్సెస్‌గా భావిస్తాను.

**మీరు ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అవుతుంది.. ఈ జర్నీ ఎలా అనిపిస్తుంది ?**

అదృష్టంగా భావిస్తున్నాను. మరో స్టేట్‌కి వెళ్లి ఇంత ఫేమస్ అవుతానని, ఇలాంటి ఒక లైఫ్ ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. తెలుగు ఆడియన్స్ ఎంతగానో ఆదరించారు. తెలుగు ఆడియన్స్ ఇచ్చిన ప్రేమ వల్లే నేను తెలుగు నేర్చుకున్నాను. తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడు కృతజ్ఞతతో ఉంటాను.

# మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' మెగా బ్లాస్ట్ గ్లింప్స్ రిలీజ్



**రేపు మెగాస్టార్** చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విశ్వంభర టీమ్ అభిమానులకు స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సోషల్‌ఫాంటసీ స్పెక్టకిల్‌కు సంబంధించిన గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. వశిష్ట డైరెక్ట్ చేస్తున్న ఈ భారీ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రం, వంశీ, ప్రమోద్ గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ చేస్తూ ఎపిక్ టోన్ సెట్ చేసింది. ఓ బాబు, పెద్దాయన మధ్య జరిగే సంభాషణతో గ్లింప్స్ మొదలౌతుంది. విశ్వంభరలో జరిగిన పరిణామాల గురించి ఆ పెద్దాయన చెబుతాడు. ఒకరికి వచ్చిన స్వార్థం కారణంగా జరిగిన యుద్ధం.. సమూహం ఎదురుచూసే రక్షకుడు ఎంట్రీ ఇవ్వడం హైలైట్‌గా నిలిచింది. చిరంజీవి మాస్ లుక్‌లో, రక్షకుడిగా ఇచ్చిన పవర్‌ఫుల్ ఎంట్రీ గూస్‌బంప్స్ తెప్పించింది. వశిష్ట విజన్‌తో క్రియేట్ చేసిన ఈ యూనివర్స్ అద్భుతమైన గ్రాండియర్‌తో అదిరిపోయింది ప్రొడక్షన్ డిజైనర్ ప్రకాశ్ విశ్వంభర యూనివర్స్‌ని అద్భుతంగా తీర్చిదిద్దగా, సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు ఫ్రేమ్‌లతో మ్యాజిక్ క్రియేట్ చేశారు. ఎం.ఎం.కీరవాణి ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇంపాక్ట్ రెట్టింపు చేసింది. విజువల్స్, జునీశ్రీ హాలీవుడ్ రేంజ్‌లో ఉండగా, యూవీ క్రియేషన్స్ హై ప్రొడక్షన్ వాల్యూస్ ప్రతీ షాట్‌లో అద్భుతంగా కనిపించాయి. చిరంజీవి కెరీర్‌లో ఈ చిత్రం మరో మైలురాయి కాబోతుందని గ్లింప్స్ ప్రామిస్ చేస్తోంది. ఈ గ్లింప్స్ మెగాస్టార్ పర్ఫెక్ట్ బర్త్‌డే గిఫ్ట్ గా ఆకట్టుకుంది. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, అశికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ప్రకటించినట్లుగా విశ్వంభర 2026 సమ్మర్ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.

తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్, ప్రత్యేక పాటలో మోని రాయ్

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, బ్యానర్: యువి క్రియేషన్స్, సంగీతం: ఎంఎం కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, డిఒపి: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, పిఆర్ఒ: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో




# 'కన్యా కుమారి' ప్రీరిలీజ్ ట్రైలర్ లాంచ్

**ప్రముఖ నటి** మధు శాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ 'కన్యా కుమారి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ అండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.



ట్రైలర్‌లాంచ్ ఈవెంట్‌లో స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. 'మధు ఎప్పటినుంచో నాకు తెలుసు. తను ఒక సినిమాని ప్రజెంట్ చేస్తుందంటే తప్పకుండా అందులో కంటెంట్ ఉంటుంది. ఈ సినిమా టీజర్ చూడగానే రైటింగ్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. టీజర్‌లో వైబ్ వుంది. శ్రీ చరణ్, గీత్ పెర్ఫార్మన్స్ చాలా ఆర్గానిక్ గా ఉంది. కచ్చితంగా ఇది చాలా మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగింది. ఆగస్టు 27న అందరూ థియేటర్స్‌కి వచ్చి సినిమాని ఎంకరేజ్ చేయాలి. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్' అన్నారు. డైరెక్టర్ శశికుమార్ తిక్క మాట్లాడుతూ.. శాలినితో గూడచారి సినిమాకి వర్క్ చేసాం. నిజంగా తన ఒక ఫైటర్. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. శ్రీచరణ్ చాలా అద్భుతంగా నటించాడు. గీత్ ఫైర్ బ్రాండ్ తన పాత్రలో అత్యద్భుతంగా పెర్ఫార్మన్స్ చేసింది. పర్ఫెక్ట్ మీటర్లు పెర్ఫార్మన్స్ ఉంది. ట్రైలర్ చూడగానే ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనిపిచింది. టీమ్ అందరు కూడా అద్భుతంగా వర్క్ చేశారు ఆగస్టు 27న థియేటర్స్‌లో కలుద్దాం' అన్నారు. మూవీ ప్రజెంటర్ మధుశాలిని మాట్లాడుతూ.. 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. శ్రీ చరణ్ గీత్ వాళ్లిద్దరు కూడా అక్కడే పుట్టి పెరిగినట్టు యాక్ట్ చేశారు. ఈ సినిమాకి సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. బన్నీ వాసు గారు సపోర్ట్‌తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాము. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్‌లో చూసి ఆస్వాదించాలని కోరుకుంటున్నాను' అన్నారు. హీరోయిన్ గీత్ సైని మాట్లాడుతూ.. ' డైరెక్టర్ సుజన్ గారు ఈ సినిమా కోసం అహర్నిశలు కష్టపడ్డారు. ఇన్ని సవాళ్లు ఎదుర్కొని ఇంత అద్భుతమైన సినిమా తీశారు. తప్పకుండా ఆగస్టు 27న ఈ సినిమా థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.

డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ.. సినిమా నిర్మించడం కూడా ఒక గుడి కట్టడం లాంటిదే. కన్యాకుమారిని అలానే నిర్మించాను. ప్రేక్షకులు సినిమా చూసి గొప్ప ఆనందాన్ని పొందాలని మంచి ఉద్దేశంతో ఈ సినిమా చేశాను. అందుకే ఈ సినిమాకి ఆర్గానిక్ ప్రేమ కథ ని పెట్టాను. ఇందులో పాత్రలన్నీ కూడా రియల్ లైఫ్ నుంచి వచ్చినవే. ఈ సినిమా చూసి మీకు నచ్చితే ఆ క్రెడిట్ బన్నీ వాసు గారికి దక్కుతుంది. ఆగస్టు 27న సినిమా చూడాలనుకుంటే మా కన్యాకుమారి కూడా ఉందని కన్సిదర్ చేయండి' అన్నారు.

శ్రీ చరణ్ మాట్లాడుతూ...'ఇది నాకు డ్రీమ్ కం ట్రూ మూమెంట్. నన్ను ఈ క్యారెక్టర్‌లో బిలీవ్ చేసి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ గారికి థాంక్యూ సోమచ్. ఈ సినిమా కోసం చాలా గ్రౌండ్ వర్క్ చేశాను. ఈ సినిమా కథ కథనాలు క్యారెక్టర్స్ అన్నీ చాలా బాగుంటాయి. సినిమా చాలా బ్యూటిఫుల్‌గా నేచురల్ గా ఉంటుంది. ఆగస్ట్ 27న తప్పకుండా అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# టిడిఆర్ సినిమాస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నంబర్.1 ప్రారంభం




**టిడిఆర్ సినిమాస్** బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్.1 గా కుంచం శంకర్ దర్శకత్వంలో తలారి దినకరణ్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు గురువారంనాడు ఘనంగా జరిగాయి. ముహుర్తపు సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ నివ్వగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచాన్ చేసి గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ అబ్బరాజు, ప్రశాంత్ దిమ్మెల, అడిదాల విజయ్‌పాల్ రెడ్డి స్క్రిప్ట్ అందించారు. పవన్ కేసరి, కావ్యాకళ్యాణ్ రామ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని అందించనుండగా.. కెమెరామెన్‌గా సాయి పనిచేయనున్నారు. ఇక ఈమూవీ ప్రారంభోత్సవం సందర్భంగా హీరో పవన్ కేసరి మాట్లాడుతూ 'నా బాల్య స్నేహితుడు సన్నీ స్థాపించిన ఈ బ్యానర్ మీద సినిమాను చేస్తుండటం ఆనందంగా ఉంది. కావ్య ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ్ అన్న మంచి సంగీతాన్ని ఇవ్వబోతోన్నారు. డిఒపి సాయితో మంచి బాండింగ్ ఏర్పడింది. హీరోయిన్ కావ్యాకళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'టిడిఆర్ సినిమాస్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్.1 చిత్రంలో నేను హీరోయిన్‌గా నటిస్తున్నాను. దర్శక, నిర్మాతలు ఎంతో ప్యాషన్‌తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. మా టీంలో ఇప్పటికే విజయ్ గారు మంచి ట్యూన్స్ ఇచ్చారు. ఓ మంచి చిత్రాన్ని ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నామ'ని అన్నారు. తలారి హేమావతి రెడ్డి మాట్లాడుతూ 'పవన్, కావ్యతో పని చేస్తుండటం ఆనందంగా ఉంది. శంకర్ గారు ఓ మంచి కథతో రాబోతోన్నారు. టీంకు ఆల్ ది బెస్ట్' అని అన్నారు.డైరెక్టర్ కుంచం శంకర్ మాట్లాడుతూ 'మా చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన మీడియాకు థాంక్స్. నాకు సహకరించి ఇక్కడకు వచ్చిన మామూవీ టీంకు థాంక్స్' అని అన్నారు. విజయ్ బుల్గానిన్ మాట్లాడుతూ 'మా మూవీ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను ఇంత వరకు కొత్త దర్శకులతోనే పనిచేశాను. శంకర్‌గారు మంచి కథను రాసుకున్నారు. పవన్ పెద్ద హీరో అవుతాడని అనిపిస్తోంది. కావ్య గారు ఈ మూవీకి పెద్ద ఎస్సెట్ అవుతారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మిగిలిన వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

# వైభవంగా 'ఆత్మ కథ' చిత్రం ప్రారంభం

**వారాహి ఎంటర్టైన్మెంట్** ప్రైవేటు లిమిటెడ్ బ్యానర్‌పై శ్రీనివాస్ గుండ్రెడ్డి రచన దర్శకత్వంలో ప్రముఖ నటుడు జెమిని సురేష్ ముఖ్యపాత్రలో అఖిల నాయర్ తో జంటగా సమ్మట గాంధీ, బలగం విజయలక్ష్మి ్మ, చింటూధనరాజ్, తాగుబోతు రమేష్, మహేష్ విట్టా, నూకరాజు, గుర్రపు విజయ్ కుమార్, సుదర్శన్ రెడ్డి, బాబా శంకర్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎంవి గోపి డిఒపిగా చేయగా రాఘవేంద్ర రెడ్డి ఎడిటింగ్ చేస్తున్నారు. సోమేశ్వరరావు నిర్మాతగా రానున్న ఈ చిత్రానికి అర్థం వారాహి శ్రేయాస్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్ర కథను నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్, అలాగే జెమిని కిరణ్ గారి చేతుల మీదగా



అందుకోగా తొలిగా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. జెమిని సురేష్ తల్లి జెమిని సుబ్బలక్ష్మి గారు ఈ చిత్రానికి తొలి క్లాప్ కొట్టి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెమిని సురేష్ మాట్లాడుతూ... "నేను మీ జెమిని సురేష్. ఇది నా తొలి చిత్రం. నా 18 సంవత్సరాల కల నేడు నెరవేరబోతుంది. ఒక మంచి కథతో ప్రేక్షకులు ముందుకు రావాలి అని అనుకున్నాను. ఒకమంచికథతో నాకు శ్రీనివాస్ 'ఆత్మకథ' చిత్రంతో అవకాశంఇచ్చారు. నా ఈ చిత్ర పూజ కార్యక్రమానికి నాకు దేవుడు ఇలాంటి వ్యక్తి జెమిని కిరణ్‌గారు వచ్చి ఆశీర్వదించినందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాను. అలాగే నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ గారు పాల్గొనడం సంతోషకరం. అలాగే దండు శ్రీనివాస్ రాజు గారికి నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను. నా తొలి చిత్రానికి మా అమ్మ చేతిలో మీదగా క్లాప్ కొట్టడం అనేది మరింత సంతోషకరం. అలాగే సమ్మట గాంధీగారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఈచిత్రంలో నటించిన నటీనటులకు, సాంకేతిక బృందానికి నాప్రత్యేక ధన్యవా దాలు తెలియజేసుకుంటున్నాను. మీడియా నుండి వచ్చిన తొలి హీరో నేనే కాబట్టి మీడియా వారుఉంటే నాకు కచ్చితంగా సపోర్ట్ చేస్తారని నమ్ముతున్నాను. ప్రేక్షకులు నన్ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నటి అఖిల మాట్లాడుతూ... "మా చిత్ర బృందానికి అందరికీ ఆల్ ద బెస్ట్ చేసుకుంటున్నాను. నాకు అవకాశం ఇచ్చిన డైరెక్టర్ గారికి, ప్రొడ్యూసర్ గారికి, జెమిని సురేష్ గారికి ప్రత్యేకధన్యవాదాలు. అందరూ మా చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

సీనియర్ నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ... 'ఆత్మకథ అనే చిత్రంలో నటించే అవకాశం నాకు జెమిని సురేష్ ద్వారా వచ్చింది. ఈ చిత్ర దర్శకులు శ్రీనివాస్ గారికి నిర్మాతలకు అలాగే ఇతర నటీనటు లకు, సాంకేతిక బృందం వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ చిత్రంలో నా పాత్ర ఎంతో కీలకం. ఇటీవల కాలంలో ఇటువంటి చిత్రం రాలేదు. మరొకసారి అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుం టున్నానుచి" అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... "నేను ఇప్పటికే ఒక హిందీ సినిమాకు, నాలుగు కన్నడ చిత్రాలకి అలాగే ఒక తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించాను. కథని హీరోగా అనుకుని ఆత్మకథ అనే చిత్రాన్ని రచించాను. ఈ చిత్రంలో జెమిని సురేష్ గారు, సమ్మటి గాంధీ గారు రెండు స్తంభాలు వంటి వారు. నన్ను నమ్మి ముందుకువచ్చిన ప్రొడ్యూసర్‌గారికి నా ధన్యవాదాలు అనుకుంటున్నాను. అలాగే శ్రేయాస్‌ను అతి చిన్న వయసులోనే సంగీత దర్శకునిగా తీసుకోవడానికి కారణం అతని టాలెంట్. ఈ చిత్రాన్ని అందరూ కలిసి ముందుకు తీసుకు వెళ్లాల్సిందిగా కోరుకుం టున్నాను" అన్నారు.

# 'అర్జున్ చక్రవర్తి' ట్రైలర్ లాంచ్



**విజయ రామరాజు** టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రిలీజైన టీజర్, సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఆద్యంతం ఆకట్టుకున్న ట్రైలర్ సినిమాపై అంచనాలని పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ.. 'అర్జున్ చక్రవర్తి' కేవలం సినిమా మాత్రమే కాదు నా తొమ్మిది సంవత్సరాల కల. మా టీమ్ అంతా ఆరేళ్ల పాటు హార్డ్ వర్క్ చేశారు. మా నిర్మాత ఇచ్చిన సపోర్ట్‌ని మర్చిపోలేను. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేసాడు. చాలా రిస్కులు తీసుకున్నాడు. అర్జున్ చక్రవర్తిగా కనిపించడానికి 100శాతం ఎఫర్ట్ పెట్టాడు. మైనస్ డిగ్రీల్లో షర్టు లేకుండా నటించాడు. ఇందులో హీరో క్యారెక్టర్‌తో పాటు దయా క్యారెక్టర్‌కూడా ఫిజికల్‌గా ట్రాన్స్ఫర్మేషన్ వుంది. డిఒపి జగదీష్ అద్భుతమైన విజువల్స్ అందించారు. సిజ దేవిక పాత్రలో ఒదిగిపోయింది. అజయ్ మాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్మకం ఉంది అన్నారు. హీరో విజయరామరాజు మాట్లాడుతూ... మా ట్రైలర్‌ని లాంచ్ చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు. ఇప్పుడు వరకు మేము రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మా నిర్మాత మమ్మల్ని ఎంతగానో బిలివ్ చేశారు. ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా సినిమా తీశారు. సినిమా కూడా చాలా మంచి సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నాం. సిక్స్ ప్యాక్‌లో షూట్ చేసినప్పుడు రెండు రోజులు పాటు ఏమీ తినలేదు. ఈ సినిమానే మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది. నా కెరియర్‌లో బెస్ట్ మూవీ చేశానని ఫీల్ అవుతున్నాను. 29న ఆడియన్స్ అదే ఫీల్ అవుతారు. అజయ్ గారు ఇందులో చాలా మంచి పాత్ర చేశారు. హీరోయిన్ సిజకి తెలుగులో చాలా మంచి అవకాశాలు వస్తాయి. అందరూ కూడా మమ్మల్ని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు. హీరోయిన్ సిజ రోజ్ మాట్లాడుతూ.. మాకు ఇది చాలా ఎమోషనల్ మూమెంట్. ఈ సినిమా కోసం చాలా ఏళ్లు కష్టపడ్డాం. ఈ సినిమాల్లో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా ఫస్ట్ తెలుగు మూవీ. మీరు సాంగ్స్‌కి ఇచ్చిన రెస్పాన్స్ నాకు ఎంతో ఆనందం ఇచ్చింది. ఇది వెరీ బ్యూటిఫుల్ సినిమా. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు.. ఆగస్టు 29 థియేటర్స్ లో కలుద్దాం అన్నారు. నిర్మాత శ్రీని గుబ్బల మాట్లాడుతూ.. 'గత నెల రోజులుగా మీడియా మా సినిమాకు చాలా సపోర్ట్ చేసింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అన్నారు.

# 'ఘాటి' సెకండ్ సింగిల్ దస్సోరా రిలీజ్

**క్వీన్ అనుష్క శెట్టి** మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి అద్భుతమైన ట్రైలర్ రిలీజ్ తర్వాత అంచనాలు నెక్స్ట్ లెవల్‌కి చేరుకున్నాయి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు.

మేకర్స్ ఇప్పుడు సినిమా సెకండ్ సింగిల్ దస్సోరాను రిలీజ్ చేశారు. సాగర్ నాగవెల్లి కంపోజ్ చేసిన ఈ సాంగ్ స్టార్ట్ అవగానే ఎనర్జీ, కల్చర్, వైబ్రెన్స్‌తో ఫుల్‌గా మూడ్ బూస్ట్ చేస్తుంది. ఘాటీల జీవన శైలిని, వారి కల్చర్‌ని ట్యూన్ అద్భుతంగా క్యాచ్ చేసింది.

ఇఎస్ మూర్తి రాసిన లిరిక్స్ ఘాటీల లైఫ్, వాళ్ల స్ట్రగుల్స్, పట్టుదలని రిఫ్లెక్ట్ చేశాయి. గీతా మాధురి, సాకేత్, శృతి రంజనీ పాడిన పవర్‌ఫుల్ వోకల్స్ ఈ పాటకి మరింత ఫీల్‌ని యాడ్ చేశాయి

విజువల్స్‌లో అనుష్క శెట్టి, విక్రం ప్రభు, ఇంకో ఘాటీల టీమ్ గంజా సీక్రెట్‌గా ట్రాన్స్‌పోర్ట్ చేస్తూ, పోలీసుల్ని తప్పించుకుంటున్న సీన్స్ చూపించారు. ఇది సినిమా నేరేటివ్ ఎంత హైస్టేక్స్‌లో ఉంటుందో ప్రజెంట్ చేసింది. బిగ్ స్క్రీన్ మీద ఈ సాంగ్ ఇంకా బలంగా ఇంపాక్ట్ చేయబోతుంది.

టెక్నికల్‌గా కూడా సినిమా టాప్‌నాచ్‌గా ఉంది. మనోజ్ రెడ్డి కటాసాని సినిమాటోగ్రఫీ, సీనియర్ ఆర్ట్ డైరెక్టర్ తోటతరణి అద్భుతమైన సెట్‌లు డిజైన్ చేశారు. సాయి మాధవ్ బుర్ర డైలాగ్స్ రాశారు. చాణక్య రెడ్డి తూర్పు, వెంకట్ ఎన్. స్వామి ఎడిటింగ్ చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లు రామ్ కృష్ణన్ మాస్టర్ కంపోజ్ చేశారు.



సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కోసం సిద్ధమవుతోన్న ఘాటి, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ కానుంది. ఇప్పటికే భారీ అంచనాలు వున్న ఈ చిత్రం ఈ ఏడాది మోస్ట్ ఎవైటెడ్ రిలీజ్ లో ఒకటిగా నిలబడబోతోంది. తారాగణం: అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు, చైతన్య రావు, రవీంద్రన్ విజయ్, జగపతి బాబు

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, నిర్మాతలు: రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి, ప్రెజెంట్స్: గీజు క్రియేషన్, బ్యానర్: ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: మనోజ్ రెడ్డి కాటసాని, ఆర్ట్ డైరెక్టర్: తోట తరణి, సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్,డైలాగ్స్: సాయి మాధవ్ బుర్రా, కథ: చంటకింది శ్రీనివాసరావు
ఎడిటర్: చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి
యాక్షన్ కొరియోగ్రఫీ: రామ్ కృష్ణ

# ఈ తరమైనా మారాలని..



పీరియడ్... ఈ మాట బయటికి వచ్చిందో లేదో పక్కవారి నోట్లోంచి 'ష్... మెల్లగా' అన్న సూచన వచ్చేస్తుంది. ఆ సమయంలో వచ్చే ఇబ్బందిని చెప్పాలన్నా ఎవరైనా ఉన్నారేమోనని చుట్టూ పరిశీలించు కోవడం. ఈ ఇబ్బందులన్నీ తట్టుకోలేకే ఎంతోమంది అమ్మాయిలు ఇప్పటికీ చదువు మానేస్తున్నారు. ఆ పరిస్థితిని మార్చాలనుకున్నారు ప్రీతి శర్మ. అందుకే నెలసరిపై అవగాహన కల్పిస్తున్నారామె.

ఉత్తరప్రదేశ్‌లోని గోకుల్... ప్రీతి శర్మది. స్కూల్లో మామూలుగానే అమ్మాయిలు తక్కువ. ఇక నెలసరి మొదలైందంటే పూర్తిగా చదువు మానేసేవారు. కొందరైతే సరైన సౌకర్యాలు లేవని ఆ సమయంలో స్కూలుకే వచ్చేవారు కాదు. తన పరిస్థితి అంతే. అయితే ఇదంతా కొన్నేళ్ల క్రితం! కానీ ఇప్పటికీ... దాదాపు రెండు దశాబ్దాల తరవాత... తన కూతుళ్ల సమయంలోనూ ఎన్నో ఇబ్బందులు. చదివే స్కూళ్లు మంచివే. సేవలపరంగా ఎలాంటి డోకా లేదు. కానీ పీరియడ్ సమయంలో ఇబ్బందులను బయటికి చెప్పే వీలే లేదు. నవ్వుతారేమో, హేళన చేస్తారేమోనన్న భయం. తన పరిస్థితి ఈ తరాలకు రాకూడదనుకున్నారు ప్రీతి. నెలసరి కారణంగా ఎవరూ చదువుకి దూరం కాకూడదని అనుకున్నారు. 2018లో రాజస్థాన్‌లో 'ప్రజు ఫౌండేషన్' ప్రారంభించారు. దానిద్వారా స్కూలు విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓ నివేదిక ప్రకారం కేవలం 2019లో 2.3 కోట్లమంది అమ్మాయిలు నెలసరి ప్రారంభమయ్యాక చదువులు మానేశారు. ఇప్పటికీ శానిటరీ ప్యాడ్ కొనుక్కోలేని వారు ఉన్నారంటే నమ్ముతారా? అందుకే మొదట శానిటరీ, శుభ్రత కిట్లను అందించడంపైనే దృష్టిపెట్టా. కానీ అదొక్కటే చాలదనిపించి 'కిశోరి' పేరుతో నెలసరి శుభ్రత, ఆరోగ్యాలపై అవగాహన కలిగించడం ప్రారంభించా. ఉపాధ్యాయులు, పిల్లలనూ పూర్తిగా చేశా. అప్పుడే వారికి అమ్మాయిల ఇబ్బందులు అర్థమవుతాయి. అమ్మాయిలూ ధైర్యంగా సమస్యని అందరి ముందు మాట్లాడతారు. నెలసరి సిగ్గుపడాల్సిన, అసహ్యించుకునే విషయం కాదనీ తెలిసొస్తుంది. అయితే ఒక్కసారి ఉత్పత్తులు ఇవ్వడం సాధ్యం కాదు, అవగాహన కార్యక్రమం నిర్వహించే మార్పు కాదు. అందుకే ప్రభుత్వ స్కీముల సాయం తీసుకుంటున్నా అనే ప్రీతి 'అక్షర్ కక్ష', షేరింగ్ కేరింగ్, 'ఫన్జార్ట్' వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా వెనకబడిన మహిళలకీ వర్క్‌షాప్‌లు ఉన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ఉపాధి శిక్షణ ఇస్తున్నారు. మురికివాడల పిల్లలను బడిబాట పట్టిస్తున్నారు. ఈ అవార్డులే కాదు, ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కితాబులూ అందుకున్నారు ప్రీతి. ఆమె ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

# నోరు తెరిస్తే చనిపోయేదాన్నే!



**ప్రపంచంలోనే అతి పొడవైన నదుల్లో ఒకటి బ్రహ్మపుత్ర. అత్యంత ప్రమాదకరమైనది కూడా. అలాంటి నదిలో 28 రోజుల సాహసానికి సిద్ధమైంది మన ఆర్మీ! విజయవంతంగా పూర్తి చేసి శభాష్ అనిపించుకుంది. ఆ బృందంలో ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు మేజర్ కవితా వాసుపల్లి, ఈ తెలుగింటి ఆడపడుచు గురించి తెలుసుకుందాం..**

శ్రీకాకుళం ఏర్పాటు మెట్టూరు కవిత. నాన్న వాసుపల్లి రామారావు రైల్వేలో క్లార్క్, అమ్మ రమ్య. వైజాగ్‌లో స్కూలింగ్, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చేశారు. ఆర్థిక కారణాల రీత్యా పిజి పూర్తిచేయలేని పరిస్థితి తప్పక ఉద్యోగం సంపాదించాలి. ఏం చేద్దామనుకుంటున్నప్పుడు ఆర్మీ గురించి తెలిసింది. వైద్యులూ ఆర్మీ యూనిఫాం ధరించొచ్చని అప్పటివరకూ ఆమెకు తెలియదు. తెలిశాక చేరాలనుకున్నారు. ఇక్కడ పోటీ తక్కువేమీ కాదు. 550 సీట్లలో 50 మాత్రమే అమ్మాయిలకు ఉండేవి. చాలా కష్టపడి సాధించారు. కవితకు సాహస క్రీడలంటే ఆసక్తి, వైద్యవిద్య చదువుతున్నప్పుడే ట్రెక్కింగ్ చేసేవారు. మౌంటెనీరింగ్‌కి ప్రత్యేకంగా స్త్రీ కోర్సులుంటాయని తెలిసి... ఆర్మీలో చేరాక సెలవుపెట్టి మరీ పూర్తిచేశారు. దీనితో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (ఎన్ఐఎంఏఎస్)లో మెడికల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ దక్కింది. ఏడాదిలో అయిదుసార్లు 1800 అడుగులు ఎత్తు వరకూ ఎత్తు వరకూ ఎక్కేవారు. అదీ 15 కేజీల బరువుతో! నెట్‌వర్క్ కూడా ఉండదు. ఆమె పట్టుదల చూసి సంస్థ డైరెక్టర్.. రాఫ్టింగ్ కోర్సు చేయమన్నారు.

**ఇది రెండోది !....** ఆమె తొలి ఎక్స్ పెడిషన్ అరుణాచల్ ప్రదేశ్‌లోని గోరిచెన్. రెండో అవకాశం... బ్రహ్మపుత్ర నదిలో ఈ సాహసం. ఇండో టిబెటన్ బోర్డరు నుంచి ఇండో బంగ్లాదేశ్ బోర్డరు వరకు సాగింది. పన్నెండుమంది బృందంలో కవిత ఒక్కరే అమ్మాయి. రోజూ ఎంత దూరం వెళ్లాలి. ఎక్కడ బస చేయాలన్న గ్రౌండ్ వర్క్ అంతా ఈమే చేశారు. 28 రోజుల్లో 1040 కి.మీ. ప్రయాణించారు. తెల్లవారుజామున అల్పాహారం చేసి రాఫ్ట్‌లోకి వెళ్తే ఏ సాయంత్రమో ఆపేవాళ్లం భోజనమూ నీళ్లల్లోనే అత్యంత ప్రమాదకరమైన సాహసమనే చెప్పాలి. నీటి లోతు ఎక్కువ. 11 అడుగులు ఎత్తువరకూ ఎగిసిపడే అలలు. గ్లేసియర్‌కి దగ్గరగా ఉంటుంది కదా! క్షణ! క్షణం వాతావరణం మారిపోతుంది. తొలివారం ఊపిరి బిగపట్టి మరీ కొనసాగాం. నిజానికి తొలిరోజే ప్రమాదానికి కారణం. రాఫ్ట్‌లోంచి అందరం నీళ్లల్లో పడ్డాం. నేనైతే నీటి సుడిగుండంలో చిక్కుకున్నా. కొన్ని క్షణాలేం అర్థం కాలేదు. అర్థమయ్యాక నాకు నేనే 'ఏదేమైనా నోరు తెరవకు. లేదంటే చావు ఖాయం. కాస్త ఓపికపట్టు' అంటూ ధైర్యం చెప్పుకొన్నా. దాన్నుంచి బయటపడేసరికి పెద్ద అల. దాన్నీ తప్పించుకుని, ఈదుకుంటూ రాఫ్ట్ను చేరుకున్నా, మరోసారి లైఫ్ గార్డు కాపాడారు అనే కవితకి ఇలాంటి అనుభవాలు చాలానే ఎదురయ్యాయి. నాలుగుసార్లు రాఫ్ట్ నుంచి పడిపోయినా ధైర్యంగా ముందుకే సాగారు. ఒకరోజులో 70 కి.మీ., ఏకదాటిగా 12గం. రాఫ్టింగ్ చేసిన సందర్భాలు ఉన్నాయి.



**ఒకే జీవితం ...** రాఫ్టింగ్ వంటి సాహసక్రీడల్లో ఆర్మీ శిక్షణ తీసుకోవడం తప్పనిసరి. ఇక మనదేశంలో అడ్వెంచర్ టూరిజానికి ఆదరణ పెరుగుతోంది. బ్రహ్మపుత్ర రాఫ్టింగ్ లేదా కయాకింగ్‌కి ఉత్తమ ప్రదేశం. పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దితే స్థానికంగా ఉపాధి పెంచడం కాదు, సంస్కృతినీ బతికించగలమన్న ఉద్దేశంతో ఈ ప్రయోగం చేశారు. అందరి మన్నలూ అందుకున్నారు. 'బ్రహ్మపుత్ర ఎక్స్‌పెడిషన్ చేసిన తొలి మహిళగా నిలవడం ఆనందంగా ఉంది. ఏదైనా చేస్తానన్నప్పుడు అమ్మాయిలకు 'వద్దు, నీవల్ల కాదు, చేయలేవు' అన్నమాటలే వినిపిస్తున్నాయి. మా ఇంట్లో తొలి గ్రాడ్యుయేట్, ఆర్మీ వ్యక్తిని. సాహస క్రీడల్లోకి అడుగు పెట్టిందీ నేనే! విశిష్ట సేవా మెడల్‌నీ అందుకున్నా. నిజానికి ఆర్మీలోకి వెళ్తానన్నప్పుడు, ఎన్ఐఎంఎస్‌లో చేరతానన్నప్పుడూ అంతా వద్దన్నవారే. పట్టుదలగా సాగ. ఒక్క జీవితం... ఎదుటివారి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు. కానీ బతకాల్సింది మాత్రం మనమే. అందుకే నచ్చింది ప్రయత్నించాలి, చేయాలి. త్వరలో పీజీలో చేరతా. మౌంట్ గోరిచెన్ మాత్రమే ఎక్కా. మిగతావీ ఎక్కాలి' అంటారు మేజర్ కవిత.

# ఫోన్‌తో గొడవలా..



ప్రస్తుతం **ఫోన్ అందరి జీవితంలో** భాగమైపోయింది. దీని మాయలో పడి చుట్టూ ఉన్నవాళ్లని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య గొడవలకు కారణం మొబైలే అంటున్నారు నిపుణులు. అవేంటో చూసేద్దాం..

వివాహబంధాలు బలహీన పడడానికి సోషల్ మీడియా, సాంకేతికత చాలా వరకూ కారణం అవుతున్నాయి. రోజులో సంగంపైనే ఫోన్‌లో వీడియోలు చూడటం, చిన్న విషయాలకు మెసేజ్, మెయిల్ రూపంలో సమాధానం ఇచ్చుకోవడం వల్ల ఇద్దరిమధ్యా కమ్యూనికేషన్ తగ్గుతుంది. తిరిగి అడిగినదానికి అనాసక్తిగా సమాధానాలు చెబితే కోపాలు తలెత్తుతాయి. భాగస్వామితో సంభాషించేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచండి. ఇది ఇద్దరిలో సఖ్యతను పెంచుతుంది.

◆. సోషల్ మీడియాలో ఇతరులతో పరిచయాలు పెంచుకుంటే అది భాగస్వామిలో అసూయకీ, అపనమ్మకానికీ దారితీస్తుంది. ఫలితంగా సంబంధాలూ దెబ్బతింటాయి. కాబట్టి ఇద్దరి మధ్య అపార్థాలు రావద్దు అంటే మీ పరిచయాలు గురించి మీ భాగస్వామితో చెప్పండి. దాంతో మీ దాంపత్యం దృఢంగా మారుతుంది.

◆. వారాంతంలో కుటుంబంతో సమయం గడపకుండా ఫోన్ చూస్తుండడం వల్ల ఇద్దరి మధ్య ప్రేమ తగ్గుతూ పోతుంది. సెలవురోజు అయినా కాస్త భాగస్వామితో బయటకు వెళ్లడం కలిసి భోజనం చేయడం వంటివి మీ బంధాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

# ఈ నీళ్లతో ఊబకాయం రాదు..



గత వారం స్ట్రాబెర్రీ ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్ తాగితే ఎన్ని లాభాలో తెలుసుకున్నాం కదా! యాపిల్ నీళ్లు కూడా చాలా మంచిది. దిన్నెల చేయాలంటే యాపిల్‌ను సన్నగా స్లైసులుగా కట్ చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో దాల్చినచెక్క ముక్కలు రెండు జతచేయాలి. నిండా నీళ్లు పోసి రెండు మూడు గంటలు నానబెట్టి.. యాపిల్, దాల్చినచెక్క తీస్తే సరిపోతుంది. యాపిల్ రుచి, వాసనలతో ఈ నీరెంతో రుచిగా ఉండి ఇష్టంగా తాగాలనిపిస్తుంది. శరీరం డీహైడ్రేట్ అవదు. ✦ శక్తి పెరుగుతుంది. నీరసం, నిస్సత్తువ ఉండవు. ✦ యాపిల్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్, సి-విటమిన్ చర్మానికి రక్షణ ఇస్తాయి. ముఖానికి నునుపుదనం, మెరుపు వస్తాయి. ✦. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణ ప్రక్రియ సజావుగా ఉంటుంది. వాపు, దద్దుర్లు లాంటి ఇబ్బందులు తలెత్తవు. కొవ్వు పేరుకోదు, ఊబకాయం రాదు. కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. గుండె జబ్బులకు చెక్ పెట్టినట్టవుతుంది. నెలసరిలో వచ్చే కడుపు నొప్పి వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

# చిన్న చిట్కాతో.. పెద్ద మార్పు !

వంటచేసే క్రమంలో వెలువడే కొన్ని వాయువులు పర్యావరణాన్ని కలుషితం చేయడంతో పాటు మన ఆరోగ్యానికీ ముప్పు తెచ్చిపెడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే వంట చేసే క్రమంలో చిన్న చిన్న జాగ్రత్తలు, చిట్కాలు పాటించడం మంచిదంటున్నారు నిపుణులు.

✦ వంట చేసే క్రమంలో కొంతమంది పాత్రలపై మూత పెట్టరు. మరికొందమంది సగం వరకే పెట్టి వదిలేస్తారు. మూత పెట్టకుండా వండుకోవడం వల్ల 20 శాతం అదనంగా ఇంధనం వాడాల్సి వస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడం మంచిది. ✦ ఆహారాన్ని మాటిమాటికీ వేడి చేయడం ఆరోగ్యకరం కాదు. పైగా దీని వల్ల కూడా గ్యాస్ వృథా అవుతుంది. తద్వారా పర్యావరణానికీ నష్టమే.

✦ ఓపిక లేకో, సమయం సరిపోకో.. కొంతమంది కాయ గూరలను పెద్ద పెద్ద ముక్కలుగా తరుగుతారు. పెద్ద అయితే ముక్కలు ఉడకడానికి ఎక్కువ సమయం పడుతుంది.. గ్యాస్ కూడా వృథా! అదే చిన్న ముక్కలుగా కట్ చేస్తే.. త్వరగా ఊడికి పోతాయి.. కాలుష్యమూ తగ్గుతుంది.. అంతేకాదు.. కూర రుచిగానూ ఉంటుంది. కిచెన్‌లో పోగయ్యే తడి చెత్త కూడా వాతావరణం కాలుష్య కారకమే! అయితే ఈ వృథాతో పాటు కుళ్లిపోయిన కాయగూరలు/పండ్లు, వాడిన కాఫీ/టీ పొడి పిప్పి, కోడిగుడ్డు పెంకులు, టీబ్యాగ్స్.. వంటివన్నీ కలిపి కంపోస్ట్ ఎరువుగా మార్చితే.. ఇటు దీన్ని ఇంట్లో పెంచుకునే మొక్కలకు ఎరువుగానూ ఉపయోగపడుతుంది. ఎవరి కిచెన్‌లో చూసినా ప్లాస్టిక్ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తుంటాయి. నిత్యావసరాలు, కాయగూరలు తీసుకురావ డానికి చాలామంది ప్లాస్టిక్ సంచులే ఉపయోగిస్తారు. వీటికి బదులుగా క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించడం, నిత్యావసరాలను గాజు/ స్టీల్/సిలికాన్‌తో తయారుచేసిన డబ్బాల్లో భద్రపరచుకోవడం.. వంటివీ కిచెన్‌లో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు చక్కటి ప్రత్యామ్నాయ మార్గాలు అంటున్నారు నిపుణులు.



# మెరిసే చర్మం కోసం..

మచ్చల్లేని చర్మంతో ఉండాలని ఎవరి కుండదు. కానీ చర్మంపై అక్కడక్కడా వచ్చే తెల్ల మచ్చలు అందాన్ని పాడుచేస్తాయి. శరీరంలో మెలనిన్ ఉత్పత్తి తక్కువ కావడంతో ఈ మచ్చలు ఏర్పడు తుంటాయి. కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా నివారించవచ్చు.

**దానిమ్మ తొక్కలు ...** చెంచా దానిమ్మ తొక్కల పొడికి అదే పరిమాణంలో రోజ్‌వాటర్‌ను కలిపి ముఖానికి రాయాలి. పావుగంటాగి చల్లటి నీటితో కడిగి శుభ్రం చేస్తే సరి. ఇది చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేట్ చేస్తుంది. దురద, యాక్నే నుంచి రక్షణ కల్పించి ముఖాన్ని మెరిపిస్తుంది. మచ్చలనీ తగ్గిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడి చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.



**టీ ట్రీ ఆయిల్..** చర్మంపై మచ్చలు, మురికిని తొలగించడంలో సమర్థవంతంగా పని చేస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ లోణాలు చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. శరీరం నుంచి వెలువడే చెమట బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని కారణంగా అనేక చర్మ సమస్యలు కలుగు తాయి. ఇలా కాకూడదంటే టేబుల్‌స్పూన్ ఆలివ్ ఆయిల్‌కి అదే పరిమాణంలో కొబ్బరి నూనె, పదిచుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి మృదువుగామర్దన చేయాలి. అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరచాలి. ఇలా రోజూ రెండు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**కొబ్బరినూనె:** ఇందులో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలం.ఇవి చర్మంపై ఫంగల్ ఇన్‌ఫెక్షన్లను తొలగించి ముఖాన్ని మెరిపిస్తాయి. రోజూ నిద్రించే ముందు రాస్తే..తగిన తేమ అంది చర్మం నిగనిగలాడుతుంది.

**నిమ్మ, చక్కెర స్క్రబ్..** చెంచా చక్కెరకికొద్దిగా నిమ్మరసం తేనె కలిపి సమస్యల ఉన్న చోట రాయాలి. నిమ్మలోని సి విటమిన్ పిహెచ్ స్థాయుల్ని సమతుల్యం చేస్తుంది. తెల్లమచ్చలను నివారిస్తుంది. తేనేలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి తగినంత తేమను అందించిమెరిసేలా చేస్తాయి.


**చందనం, రోజ్‌వాటర్‌మాస్క్:** తగినంత చందనం పొడికి సరిపడా గులాబీనీరు కలిపి మెత్తని పేస్టు చేసుకోవాలి. దీన్ని తెల్లమచ్చలున్న చోట రాసి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. గంధంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖాన్ని తేమగా కాంతమంతంగా కనిపించేలా చేస్తాయి.

# దైవకృప



ముఖ్యంగా చేసిన పని విజయవంతమైనప్పుడు అది తన కృషితోనే సాధ్యమైంది అనడం పరిపాటి. కానీ దైవకృప లేనిదే ఏదీ పూర్తికాదని, మనం నిమిత్తమాత్రులమే అని మహనీయులు ఉద్ఘాటించారు. అర్జునుడు మత్స్య యంత్ర పరీక్షలో నెగ్గి ద్రౌపదిని వివాహం చేసుకున్నాడు. ఆ సందర్భంలో స్వయంవర మేడుకకు విచ్చేసిన రాజులు, పెద్దలు అందరూ అర్జునుణ్ణి అభినందించారు. కృష్ణుడు మాత్రం నోరు మెదపక పోవడంతో బావ, నువ్వొక్కడివే నన్ను ప్రశంసించ లేదు. ఎందుకో తెలుసుకోవచ్చా? అనడిగాడు అర్జునుడు. అప్పుడు కృష్ణుడు ఇందులో నీ గొప్పతనం ఏముంది అర్జునా? అన్నాడు.

అదేంటి విలువిద్యలో అన్ని మెలకువలూ ఉపయోగించి ఏకాగ్రతతో మత్స్యయంత్రంలో ఉన్న చేపకన్నును, కింద జలాశయంలో దాని నీడను చూసి బాణం ప్రయోగించడం చిన్న విషయమా? తక్కిన రాజులు చేయలేని పనిని నేను చేశాను కదా' అన్నాడు అర్జునుడు. కృష్ణుడు నవ్వి అర్జునా! నీకంటే ముందు వాళ్లకి జలాశయంలో నీళ్లు గాలికి అలలుగా కదలడం వల్ల చేప నీడను సరిగా చూడలేక పోయుంటారు. అలా గురి తప్పి ఉంటుంది. నువ్వు బాణం ఎక్కు పెట్టినప్పుడు వాయుదేవుడు సహకరించినందున అలలు లేక చేప కన్నును స్పష్టంగా చూసి గురిపెట్టగలిగావు. అంతే అన్నాడు. కనుక నేను అనే అహం లేకుండా ప్రయత్నించాలి. దానికి దైవకృప తోడైతేనే పనిలో విజయం సాధ్యమౌతుంది.



ఆధ్యాత్మికం

# విమర్శల్ని విందాం !

**'పని బాగా చేశారు' అన్నది వినడానికి చాలామంది ఇష్టపడతారు.** విమర్శను మాత్రం తట్టుకోలేరు. ముఖ్యంగా ఎంత కష్టపడి పనిచేసినా... అమ్మాయిల విషయంలో మాత్రం ఆఫీసుల్లో ప్రత్యేక లెన్స్‌లు పనిచేస్తాయి. అంటే వారి, ప్రవర్తన దుస్తులు... ఇలా ఎన్నో అంశాల ఆధారంగా జడ్జ్ చేస్తారు. అలాంటప్పుడు కోపం, బాధ, అసహనం వంటివి కలగడం సహజమే. అలాగని వాటిని వినడానికి అయిష్టత ప్రదర్శించలేదు కదా? ఎవరైనా ఏదైనా అన్నారనుకోండి వెంటనే సమాధానం ఇవ్వొద్దు. విమర్శ, ఫీడ్‌బ్యాక్... ఏదైతేనేం పూర్తిగా వినండి మనం వింటేనే అవతలివాళ్లూ తరవాత మనం చెప్పేది వింటారు. ముఖ్యంగా పూర్తిగా వింటేనే దానికి దీటైన సమాధానాన్నీ ఇవ్వగలం. పోనీ అవతలివాళ్ల ఆలోచనలైనా తెలుస్తాయి. ఇదీ మంచిదే. దీన్నో బలహీనతగానూ భావించొద్దు. ఈ ఓపిగ్గా వినడం, భావోద్వేగాల



నియంత్రణ, సహానుభూతి వంటి ఎన్నో నైపుణ్యాలను మీకు తెలియకుండానే చేజిక్కించుకుంటారు. ఇవి మిమ్మల్ని మరింత శక్తిమంతంగా మలుస్తాయి. అయినా అన్నిసార్లూ ప్రశంసలు మేలే చేయవు. వాస్తవానికి దూరంగాను తీసుకెళ్లగలవు. అప్పుడప్పుడు విమర్శలనీ తీసుకోవాలి. అప్పుడే మనల్ని మనం తీర్చిదిద్దుకోగలం. మార్చుకుంటూ ముందుకు సాగాలం. కాబట్టి... ఈసారి ఎవరైనా మీ వ్యక్తిత్వం, పనితీరులోపాల గురించి చెబుతుంటే వినండి. అలాగని అవి వాస్తవమని భావించి, మిమ్మల్ని మీరు మార్చుకోమని కాదు. కేవలం వినండి. అవసరమైతే ఉదాహరణలతో చెప్పమనండి. వాస్తవమే అనిపించిందా... 'థాంక్స్' చెప్పి పాటించండి. లేదంటారా వదిలేయండి. ఎంతచెప్పినా ఒకరు 'నువ్విది... ఇలా చేశావ్ లేదా చేస్తావ్' అంటే తెలిసీ తెలియక చేసినా అది బాధగానే అనిపిస్తుంది. వ్యక్తిగత దాడిగానూ తోస్తుంది. అయితే వాళ్లముందు బయటపడాల్సిన పనిలేదు కదా! ఇదీ నేర్చుకోవడమే అనుకుని వినండి. కానీ దానికీ ఓ హద్దు ఉంటుంది. మాట తూలినా, అగౌరవంగా మాట్లాడినా ఊరుకోవద్దు. అయితే ఇది ఎదుగుదలలో ఓ భాగం కాబట్టి, భయపడొద్దు.. ప్రశాంతంగా ఎదుర్కోండి,

### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో
## ఎయిర్ రైఫిల్ టీమ్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఎయిర్ రైఫిల్ టీమ్ స్వర్ణం గెలుచుకుంది. గురువారం కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన 2025 ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రుద్రాంక్ష్ పాటిల్, అర్జున్ బబౌతా, కిరణ్ జాదవ్‌లతో కూడిన భారత పురుషుల ఎయిర్ రైఫిల్ జట్టు బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ ముగ్గురూ కలిపి మొత్తం 1892.5 పాయింట్లు సాధించి చైనా (1889.2) కొరియా (1885.7)లను వరుసగా 2వ మరియు 3వ స్థానాలకు నెట్టి, గత 4 ఎడిషన్ల ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో భారతదేశం తరపున మూడవ స్వర్ణాన్ని గెలుచుకున్నారు. 2022 విజయం తర్వాత, ఈ ముగ్గురి జట్టుకు ఇది రెండవ ఆసియా స్వర్ణం, అదే సంవత్సరం వారు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాన్ని కూడా సాధించారు.

రుద్రాంక్ష్ పాటిల్ (632.3) మరియు అర్జున్ బాబుటా (631.6) కూడా వ్యక్తిగత ఎయిర్ రైఫిల్ ఫైనల్‌కు అర్హత సాధించారు కానీ వరుసగా నాల్గవ మరియు ఐదవ స్థానంలో నిలిచిన తర్వాత వారి ఖాతాలో మరో పతకాన్ని చేర్చలేకపోయారు. భారత బృందం ఇప్పటికీ సీనియర్స్ పతకాల జాబితాలో 7 పతకాలు, 2 స్వర్ణాలు, 1 రజతం మరియు 4 కాంస్య పతకాలతో చైనా తర్వాత రెండవ స్థానంలో కొనసాగుతోంది.

### ఇంటర్‌స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో
## ధనలక్ష్మికి స్వర్ణం



**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ ఇంటర్‌స్టేట్ ఛాంపియన్‌షిప్ లో ధనలక్ష్మి శేఖర్ అద్భుత విజయంతో సత్తా చాటింది. తమిళనాడులోని చెన్నైలో జరిగిన ఇంటర్ స్టేట్ సీనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మూడు సంవత్సరాల తర్వాత అత్యంత పోటీ నడుమ మహిళల 100 మీటర్ల ఫైనల్లో 27 ఏళ్ల ఆమె స్వర్ణ పతకం సాధించింది. ఆమె 11.36సెకన్ల స్ప్రింట్ వ్యక్తిగత అత్యుత్తమ సమయం అయినప్పటికీ, తమిళనాడుకు చెందిన అభినయ రాజరాజన్ (11.58 సెకన్లు) మరియు కర్ణాటకకు చెందిన స్నేహ ఎస్ఎస్ (11.61 సెకన్లు) వరుసగా రెండవ మరియు మూడవ స్థానంలో నిలిచారు. ఈ రేసులో నిత్య గాంధే (తెలంగాణ) 11.61 సెకన్ల సమయంతో పోడియంను తృటిలో మిస్ అయ్యారు, సాక్షి చవాన్ (గుజరాత్) 11.70 సెకన్ల సమయంతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. అగస్టు 2022లో ధనలక్ష్మి కెరీర్‌లో ఆ ఏడాది ప్రారంభంలో డోప్ పరీక్షల్లో విఫలమైన తర్వాత తన ప్రదర్శనను నిలిపివేసింది. ఈ నిషేధం తొలగింపు తర్వాత ఆమె ప్రాధాన్యత కలిగిన మొదటి సీనియర్ ఈవెంట్ ఈ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో విజయంతో స్వర్ణ పతకాన్ని సాధించడం విశేషం. ఇక ఇతర ఫైనలిస్టులలో మహారాష్ట్రకు చెందిన సుదేశ శివంకర్ (11.75సె), కేరళకు చెందిన జిల్నా ఎంవి (11.80సె), మరియు అనుభవజ్ఞుడైన స్ప్రింటర్ ఒడిశాకు చెందిన శ్రబని నందా (11.84సె) ఉన్నారు.

# ఓపెనింగ్ జోడీలో ఛేంజ్

### సవాల్‌గా ప్లేయింగ్ ఎలెవన్.. ప్లేయర్ల బాధ్యతలపై టీమిండియా కసరత్తు




**న్యూఢిల్లీ:** టీం ఇండియా తన ఆసియా కప్ ప్రచారానికి ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబరు 10 నుండి ఆసియా కప్ ప్రారంభం కానుంది. తన మొదటి మ్యాచ్‌లో భారత జట్టు యుఎఇ తో, తర్వాత సెప్టెంబర్ 14న తన ప్రత్యర్థి పాకిస్తాన్ తో తలపడుతుంది. మొదటి రౌండ్ చివరి మ్యాచ్‌లో భారత్, ఒమన్ జట్లు తలపడతాయి. ఇందుకోసం 15 మందితో బలమైన భారత జట్టును ప్రకటించారు. వీరిలో స్టార్ ఆటగాళ్లు కూడా ఉన్నారు. దీంతో ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడం అతిపెద్ద సవాలు కానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్లేయర్ల బాధ్యతలపై కసరత్తు జరుగుతోంది. జట్టులో ముగ్గురు ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్స్, నలుగురు ఆల్ రౌండర్లు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆసియా కప్ తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ టీమ్ ఇండియా తరపున ఓపెనింగ్‌లు చేయడం ఖాయం. అభిషేక్ గతంలో కూడా ఓపెనర్‌గా అద్భుతంగా రాణించాడు. ఇప్పుడు, శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా ప్రవేశించడంతో, సంజు శాంసన్ తన ఓపెనింగ్ స్థానాన్ని కోల్పోతాడు. తిలక్ వర్మ మూడో స్థానంలో బరిలోకి దిగడం అవకాశాలు ఉన్నాయి. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో. హార్దిక్ పాండ్యా ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఇక సంజు శాంసన్ ఆరో స్థానంలో వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్‌గా అవకాశం పొందే అవకాశం ఉంది. శివం దూబే ఏడో స్థానంలో, అక్షర్ పటేల్ ఎనిమిదో స్థానంలో కనిపించే వీలుంది. యుఎఇ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండటంతో అక్షర్ పటేల్ స్పిన్ ఆల్ రౌండర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి బౌలర్లుగా ప్లేయింగ్ ఎలెవన్‌లో కనిపిస్తారు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివం దూబే ఆల్ రౌండర్లుగా ఉండటం వలన, టీం ఇండియా ఆరుగురు బౌలర్లను ఉపయోగించుకోగలు గుతుంది. అభిషేక్ శర్మను అదనపు బౌలర్‌గా ఉపయోగించుకునే అవకాశం ఉంది. అందువల్ల టీం ఇండియా 8 మంది బ్యాటర్లతో ప్లేయింగ్ ఎలెవెన్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.




### యూరప్ స్మాష్ క్వార్టర్ ఫైనల్స్‌కు
## మానవ్, మనుష్

### మనుష్, దియా నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** యూరప్ స్మాష్-2025, పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ జోడీ మానవ్-మనుష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. అలాగే మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో మరో భారత్ జంట మనుష్ షా-దియా చిటాలే రొమేనియన్ ద్వయం చేతిలో నిష్క్రమించింది. స్వీడన్‌లోని మాల్మో అరీనాలో గురువారం జరిగిన యూరప్ గ్రాండ్ స్మాష్‌లో ఐదవ సీడ్ భారత పురుషుల డబుల్స్ జోడీ మనుష్ షా-మానవ్ ఠక్కర్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ఈ జంట 9-11, 11-4, 11-5, 11-6 తేడాతో నాలుగు ఆటలలో పోలిష్ జంట మిలోజ్ రెడ్జిమ్స్కి-మాసీజ్ కుబ్లిక్ లను ఓడించి, వరుసగా నాలుగోసారి డబ్ల్యూటిటి గ్రాండ్ స్మాష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత ప్రచారం ముగిసింది. రెండవ రౌండ్‌లో ఏకైక భారతీయుడు మానవ్ ఠక్కర్, దక్షిణ కొరియాకు చెందిన పదహారవ సీడ్ అన్ జాహ్యూన్ చేతిలో 10-12, 7-11, 11-4, 12-14 తేడాతో ఓడిపోయాడు. అలాగే ఆరో సీడ్ భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా-దియా చిటాలే కూడా క్వార్టర్ ఫైనల్స్‌లో రొమేనియన్ ద్వయం ఎడ్వర్డ్ ఐయోనెస్కు-బెర్నాడెట్ స్జోక్స్ చేతిలో 10-12, 3-11, 7-11 తేడాతో వరుస గేమ్‌లతో ఓటమి పాలయ్యారు. మహిళల డబుల్స్ విభాగంలో దియా, యశస్విని ఘోడ్పాడేతో కలిసి రెండో రౌండ్లోనే నిష్క్రమించింది. బలమైన జర్మన్ జంట సబీన్ వింటర్-యువాన్ వాన్ చేతిలో 5-11, 10-12, 12-10, 9-11 తేడాతో నాలుగు గేమ్‌ల హోరాహోరీ పోరులో ఓడిపోయింది.

### ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో
## తపస్యాకు స్వర్ణం, శ్రుష్టికి రజతం

**న్యూఢిల్లీ:** అండర్ 20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025 మహిళల విభాగంలో భారత్ ఖాతాలో తొలి స్వర్ణం జమ అయింది. భారత్ అథ్లెటిక్ తపస్యా స్వర్ణంతో మెరవగా, శ్రుష్టి రజత పతకం గెలుచుకుంది. బల్గేరియాలో గురువారం జరిగిన ఈ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో తపస్యా మహిళల 57 కిలోల బరువు విభాగంలో పోటీ పడి ఫైనల్లో నార్వేకు చెందిన ఫెలిసిటాస్ డొమాజెవాను 5-2 తేడాతో ఓడించింది. తాప్స్య ముందుగా టోర్నమెంట్‌లో తన ప్రచారాన్ని మొదటి రౌండ్‌లో డోల్జోన్ సింగువాపై విజయంతో ప్రారంభించింది. ఆమె తన ప్రత్యర్థిని ఓడించే సమయానికి 6-0తో ఆధిక్యంలో ఉంది. ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన రొమైస్సా ఎల్ ఖర్రాబీని ఓడించి, ఆపై ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన సోవాకా ఉచిడా నుండి 4-3 తేడాతో గట్టి పోటీని ఎదుర్కొంది. ఇక మహిళల 68 కిలోల విభాగంలో భారత్‌కే చెందిన సృష్టి బంగారు పతక పోరులో ఓడిపోయి రజత పతకాన్ని సాధించింది. రే హోషినోతో తలపడిన ఈ భారత క్రీడాకారిణి జపనీస్ క్రీడాకారిణితో పోటీ పడలేకపోయింది, ఆమె చివరి బౌట్‌ను 0-7తో ఓడించింది. శృష్టి అంతకుముందు సెమీఫైనల్లో జర్మనీకి చెందిన లారా కోహ్లర్‌ను 73 తేడాతో ఓడించి బంగారు పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకుంది. అలాగే భారత్‌కు చెందిన ప్రియా మాలిక్, రీనా బరువు విభాగాలలో ఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల 76 కిలోల విభాగంలో ప్రియా 10-0 తేడాతో సెర్బియాకు చెందిన ఎవెలిన్ ఉజెల్జీని ఓడించి ఫైనల్‌కు చేరుకోగా, మహిళల 55 కిలోల సెమీఫైనల్లో రీనా 11-1 తేడాతో రొమేనియాకు చెందిన వోయిక్యులెస్కు అలెగ్జాండ్రాను ఓడించింది.






## జియో 799 రీచార్జి రద్దు అవాస్తవం

**హైదరాబాద్, ఆగస్టు21, ప్రభాతవార్త:** రిలయన్స్ జియో రీఛార్జి ప్లాన్ విషయంలో నెలకొన్న గందరగోళంపై ఆ కంపెనీ స్పందించింది. రూ.799 రీఛార్జి ప్లాన్ ను రద్దు చేసినట్లు జరుగుతున్న ప్రచారాన్ని జియో తోసిపుచ్చింది. ఆ ప్లాన్ కొనసాగుతుందని, యూజర్లు ఎప్పటిలానే రీఛార్జి చేసుకోవచ్చని స్పష్టతనిచ్చింది. జియో వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ ప్లాన్ తో అందుబాటులోనే ఉంచినట్లు వివరణ ఇచ్చింది. యూజర్ల అవసరాలకు అనుగుణంగా, అందుబాటు ధరలో రీఛార్జి ప్లాన్లను అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు జియో పేర్కొంది. రూ.799 రీఛార్జి ప్లాన్ తో రీఛార్జి చేసుకుంటే 84 రోజుల వ్యాలిడిటీ పొందవచ్చని, రోజుకు 1.5 జీబీ డేటాతో పాటు అపరిమిత కాల్స్ చేసుకోవచ్చని వివరించింది. అదేవిధంగా ఈ ప్లాన్ లో రోజుకు వంద ఎస్ఎంఎస్ లు పొందవచ్చని కంపెనీ పేర్కొంది.



## 2030కి రిటైల్‌రంగం రెట్టింపు!

**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** దేశీయ రిటైల్ రంగం 2030నాటికి సుమారు రూ.168లక్షల కోట్లకు చేరొచ్చని డెలాయిట్-ఫిక్కీ నివేదికలో అంచన వేసింది. వార్షికంగా 10శాతం సమ్మిళిత వృద్ధి చెందుతుందని వెల్లడించింది. అయితే హైదరాబాద్, బెంగళూర్ వంటి నగరాలే మొత్తం రిటైల్ స్థలాల్లో గతేడాది 60శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొంది. ప్రపంచ వాణిజ్య అస్థిరత పరిస్థితుల్లోనూ రాణిస్తున్న గృహ విపణితో రిటైల్ రంగం ఊపందుకుంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పట్టణ, అభివృద్ధి చెందుతున్న విపణుల్లో డిజిటల్ స్వీకరణ, ప్రీమియమైజేషన్, ఈ-కామర్స్ వేగంవంతంగా ఎదుగుతుండడంతో పాటు బలమైన దేశీయ వినియోగం ద్వారా దేశ రిటైల్ రంగంతో పాటు వినియోగదార్ల ధోరణిలో మార్పు సంభవిస్తుందన్నారు. స్పాటింగ్ ఇండియాస్ ప్రైమ్ ఇన్నోవేషన్‌లో మూమెంట్ నివేదిక ప్రకారం 2024లో దేశ రిటైల్‌రంగం విలువ కేవలం రూ. 1.06 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.92లక్షల కోట్లు) నమోదైంది. అయితే మాల్స్, హై-స్ట్రీట్ స్థలాలు అనుభవ కేంద్రాలుగా అభివృద్ధి చెందుతుండడంతో బెంగళూర్, హైదరాబాద్ వంటి నగరాల్లో రిటైల్ స్థలాల సెర్చ్‌లో 60% వాటఉందని డెలాయిట్-ఫిక్కీ వివరించింది.

# జిఎస్టిలో ఇక రెండే శ్లాబులు!

### పన్ను సంస్కరణలకు మంత్రుల బృందం ఆమోదం

### త్వరలో జిఎస్టీ కౌన్సెల్ తుది నిర్ణయం



**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** వస్తు సేవల పన్ను సంస్కరణల విషయంలో కేంద్రం ముందడుగు వేసింది. ఈ క్రమంలో పరోక్ష పన్నుల విధానంలో రెండు శ్లాబులు ఉంచాలనే ప్రతిపాదనలకు కేంద్రమంత్రుల బృందం ఆమోదించింది. 12,28 శాతం శ్లాబులు తొలగించి 5,18 శాతం శ్లాబులు ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపినట్లు బిహార్ డిప్యూటి సిఎం, రేటు హేతుబద్ధీకరణ జీవోఎం కన్వీనర్ సామ్రాట్ చౌదరి పేర్కొన్నారు. అయితే హేతుబద్ధీకరణపై కేంద్రం చేసిన రెండు ప్రతిపాదనలను జివోఎం ఆమోదించినట్లు మీడియాకు వివరించారు. కేంద్ర ప్రతిపాదనల్లో అల్ట్రా లగ్జరి, సిన్‌గూడ్స్ లపై 40శాతం పన్ను విధించనున్నట్లు యూపీ ఆర్థికమంత్రి సురేశ్‌కుమార్ ఖన్నా వివరించారు. కార్లు, సిన్‌గూడ్స్ వంటి అల్ట్రా లగ్జరీ వస్తువులపై ప్రస్తుత పన్ను రేటు కొనసాగించేందుకు తమ రాష్ట్రం 40శాతం జిఎస్టి రేటుపై లెవీని ప్రతిపాదించిందని పశ్చిమబెంగాల్ ఆర్థికమంత్రి చంద్రిమాభట్టాచార్య అన్నారు. అయితే కొత్త శ్లాబుల అమలు తర్వాత కేంద్రం, రాష్ట్రాలకు కలిగే ఆయా నష్టాల గురించి ప్రతిపాదనల్లో ప్రస్తావించలేదని ఆమె వెల్లడించారు. రేటు హేతుబద్ధీకరణపై సామ్రాట్ చౌదరి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల మంత్రుల బృందం గురువారం భేటి అయింది,

ఇందులో ప్రస్తుత నాలుగు శ్లాబుల స్థానంలో రెండు మాత్రమే ఉంచనున్నారు.దీంతో హానికర ఉత్పత్తులకు 40శాతం జిఎస్టి విధించేందుకు ఆమోదం అంగీకరించింది. జిఎస్టి కౌన్సిల్‌లో ఫైనల్ నిర్ణయం తీసుకోనున్నారు.ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీకి సంబంధించి కొద్ది రోజులుగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దీనిని సరళీకరించే దిశగా సంస్కరణలు తీసుకురానున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

**బీమా పాలసీలపై మినహాయింపు...**

సామాన్యులు ఎక్కువగా వినియోగించే నిత్యావసరాలపైనే జీఎస్టీ రేట్లను క్రమంగా తగ్గించనున్నట్లు స్పష్టం చేశారు. ఇక హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపైనా జీఎస్టీ మినహాయించేందుకు కేంద్రం సుముఖంగా ఉంది. బీమా మార్కెట్ విస్తరణ ప్రాధాన్యం, పెట్టుబడుల కోసం మరింత ఆకర్షణీయంగా మార్చే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఇప్పటికే బీమా పాలసీలపై జీఎస్టీ మినహాయించాలని కేంద్రం భావిస్తుంది.ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త పాలసీ లేదా రెనివల్ అయితే దాని ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ ఉంది. మీ ప్రీమియం రూ. 20 వేలు అయితే జీఎస్టీతో కలిపి రూ. 23,600 చెల్లించాలి. జీఎస్టీ మినహాయిస్తే.. కేవలం రూ. 20 వేలు చెల్లిస్తే సరిపోతుంది. ప్రస్తుత మీ ప్రీమియం జీఎస్టీ కలిపి ఉంటుంది కాబట్టి.. మినహాయింపు నిర్ణయంతో దాదాపు 15 శాతం వరకు బీమా ధర తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జీవిత, ఆరోగ్య బీమాలు రూ. 8262 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి అందజేశాయి.

రీఇన్సూరెన్స్ మరో రూ. 1500 కోట్లు తెచ్చింది. ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చితే ప్రీమియం తగ్గుతుంది. అయితే బీమా కంపెనీలు ఇప్పటివరకు డిస్ట్రిబ్యూషన్, కస్టమర్ సర్వీస్, టెక్నాలజీ వంటి వాటిపైన చెల్లించిన వ్యయాల్ని ఇన్‌పుట్ టాక్స్ రూపంలో వెనక్కి తీసుకుంటున్నాయి. ఇప్పుడు జీఎస్టీ తొలగిస్తే ఇన్‌పుట్ క్రెడిట్ సరాసరి ఆగుతుంది. అప్పుడు బీమా సంస్థల వ్యయాలు వెనక్కిరావు. అప్పుడు వాటి నష్టాల్ని భర్తీ చేసుకునేందుకు బేస్ ప్రీమియం ధరల్ని బీమా కంపెనీలు పెంచొచ్చు. పాలసీలపై జీఎస్టీని సున్నా స్థాయికి తీసుకురావాల్సి ఉంటుంది. అయితే సెప్టెంబరులో జరిగే జిఎస్టి కౌన్సిల్ మీట్‌లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




## జిసిసి చూపు హైదరాబాద్ వైపే!

**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** బడాస్థాయి కంపెనీలకు చెందిన జిసిసి (గ్లోబల్ కేపాబిలిటి సెంటర్)లను ఆకర్షించడంతో హైదరాబాద్ పేరే చక్కర్లు కొడుతుంది. రోజురోజుకు కొత్త కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఇందులో ఆర్థిక సేవలు, జీవశాస్త్రాల విభాగానికి చెందిన సంస్థలు ఎక్కువ ఉన్నాయి. అయితే కొన్ని వారాల్లోనే అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాలకు చెందిన కంపెనీలు తమ జిసిసిలను నగరంలో ఏర్పాటుచేశాయి. యూఎస్‌కు చెందిన సంపద నిర్వహణ, ఆర్థికసేవల సంస్థ అమెరిప్రైస్ ఫైనాన్షియల్, అమెరికాకే చెందిన డెయిరీ,పశుపోషక ఉత్పత్తుల సంస్థ లాండ్‌ఓలేక్స్, ఆటోమేటివ్ సర్వీసెస్ సంస్థ హాల్‌మ్యాన్‌లు స్థాపించాయి. ఇక ఆస్ట్రేలియాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మెక్వారీ గ్రూపు,జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌స్టాక్ ఎక్స్ఛేంజిని నిర్వహించే సంస్థ కూడా డాయిష్ బోర్స్ సైతం హైదరాబాద్‌లో జిసిసి కేంద్రాలు ప్రారంభించాయి. ప్రముఖ 10ఫార్మ కంపెనీల్లో ఎనిమిది కంపెనీలు ఉన్నాయి. ఎలీలిల్లి, నొవార్టిస్, బిఎంఎస్, సనోఫి, రోష్, ఆమ్‌జాన్‌చబేయర్, ఎంఎస్‌డీతో పాటు హెల్త్‌కేర్ సేవా సంస్థ, ఎవర్‌నార్త్, ఇక ప్రపంచంలోని అతిపెద్ద యానిమల్ హెల్త్‌కంపెనీ అయిన జోటిఫ్ పరిశోదన కేంద్రం, ఫార్మ, ఐటీసైన్స్ సంస్థలు నెలకొల్పాయి. అలాగే రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన వెస్టియన్ నివేదిక ప్రకారం కొత్త జిసిసిలను హైదరాబాద్ ఆకట్టుకుంటుందని, బెంగళూర్‌తో పోటిపడుతుంది. దేశంలో 1700 జిసిసిలు ఉండగా, ఇందులో బెంగళూర్‌లో 487 కేంద్రాలు ఉండగా...హైదరాబాద్‌లో 273 ఉన్నాయి. తర్వాత స్థానాల్లో చెన్నై, ఢిల్లీ, ఎన్‌సిఆర్, ముంబాయ్ ఉన్నాయి. 2028నాటికి జిసిసిల సంఖ్య 2100కు చేరుతుందని ప్రభుత్వ వర్గాలు, వాణిజ్య నిపుణులు భావిస్తున్నారు.

### చైనా దిగుమతులు తగ్గించి..
## దేశీయ ఉత్పత్తులు పెంచాలి

**హైదరాబాద్,ఆగస్టు21, ప్రభాతవార్త:** చైనా ఎగుమతులైనా అరుదైన ఖనిజాలు, ఎరువులపై ఆంక్షలను సడలించేందుకు చైనా నిర్ణయించడం సానుకూల పరిణామమేనని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) వెల్లడించింది. అయితే చైనాపై ఆధారపడటాన్ని తగ్గించి భారత్‌లో తమదైన స్థాయిలో ఉత్పత్తులు పెంచాల్సిన అవసరం ఉందని వివరించింది. అదేవిధంగా 100బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును భారత్ కలిగి ఉండడం ఆందోళనకర పరిస్థితికి సంకేతమని పేర్కొంది. 2014 నుంచి 2024 నడుమ భారత్ దిగుమతుల్లో చైనా పాత్ర మరింత పెరిగింది. దేశీయ తయారీదార్ల ప్రయోజనాలను పరిరక్షించాలంటే చైనా నుంచి దిగుమతులను తగినగంచుకోవడమే కాకుండా తయారీపై మరింతగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని జీటిఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. చైనాకు భారత్ ఎగుమతులు తగ్గుతుండడంతో వాణజ్య లోటు భారీగా పెరిగేందుకు కారణం. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్ వాటా రెండు దశాబ్ధాల క్రితం 42.3శాతం కాగా...ప్రస్తుతం 11.2శాతం తగ్గిందని వివరించింది. దీంతో భారత్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ముప్పు అవకాశాలు పెరుగుతాయి. ఈ క్రమంలో దేశీయ ఉత్పత్తి సామార్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. భారత్ టెలికాం, ఎలక్ట్రానిక్స్ దిగుమతుల్లో చైనా వాటా 57.2శాతానికి చేరగా.. యంత్రాలు, హార్డ్‌వేర్‌ల విభాగంలో 44శాతం రసాయానాలు, ఔషదాల విభాగంలో 28.3శాతం దిగుమతులు చైనా నుంచే భారత్‌కు చేరుతున్నాయని వెల్లడించారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.